సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
హైదరాబాద్
శనివారం 21.03.2026
@mudranews mudratv
సంపుటి: 13 సంచిక: 147
పేజీలు: 12 వెల: రూ. 5

# తెలంగాణ బడ్జెట్ రూ.3,24,234 లక్షల కోట్లు

అసెంబ్లీలో నాలుగోసారి బడ్జెట్ ప్రవేశ పెట్టిన ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క

| | |
|---|---|
| తెలంగాణ వార్షిక బడ్జెట్ | రూ.3,24,234 కోట్లు |
| రెవెన్యూ వ్యయం | రూ.2,34,406 కోట్లు |
| మూలధన వ్యయం | రూ. 47, 267 కోట్లు |
| గతేడాది కంటే | రూ.20 వేల కోట్లు అధికం |
| శాఖల వారీగా కేటాయింపులు | (రూ. కోట్లలో) |
| విద్యాశాఖ | 26,674 |
| వైద్యారోగ్య శాఖ | 13,679 |
| హోం శాఖ | 11,907 |
| వ్యవసాయ శాఖ | 23,179 |
| విద్యుత్ శాఖ | 21,285 |
| పౌరసరఫరాల శాఖ | 7,366 |
| స్త్రీ, శిశు సంక్షేమం | 3,143 |
| ఎస్సీ అభివృద్ధి | 11,784 |
| ఎస్టీ అభివృద్ధి | 7,937 |
| మైనారిటీ సంక్షేమం | 3769 |
| ఇరిగేషన్ | 22, 615 |
| మున్సిపల్ శాఖ | 17,907 |
| పశుసంవర్ధక శాఖ | 1,529 |
| రాజీవ్ యువ వికాసం | 6,000 |
| గృహ నిర్మాణం | 7,430 |
| ఐటీ శాఖ | 875 |
| చేనేత, జౌళి శాఖ | 258 |
| పరిశ్రమల శాఖ | 3,490 |
| పంచాయతీ రాజ్ | 33,688 |
| ఆర్ అండ్ బీ | 12,789 |



2

| | |
|---|---|
| న్యాయ శాఖ | 2,367 |
| టూరిజం | 1,224 |
| గోదావరి పుష్కరాలకు | రూ. 500 |
| ఆరు గ్యారంటీలకు | రూ.50,713 |
| గృహజ్యోతి | రూ.2,080 |
| రాజీవ్ ఆరోగ్యశ్రీ | రూ.1,143 |
| మహాలక్ష్మి గ్యాస్ సబ్సిడీ | రూ.723 |
| ఇందిరమ్మ ఆత్మీయ భరోసా | రూ.600 |
| రైతు భరోసా | రూ.18 |
| చేయూత | రూ.14,861 |
| ఇందిరమ్మ ఇళ్లు | రూ.5,500 |
| మహాలక్ష్మి పథకం | రూ.4,305 |
| వ్యవసాయ ఉత్పత్తులకు బోనస్ | రూ.3,500 |
| కల్యాణలక్ష్మి పథకం | రూ.3,683 |
| ఉపకారవేతనాలు | రూ.4,343 |



## పీపుల్స్ సెంట్రిక్ బడ్జెట్

ప్రజలే కేంద్రంగా బడ్జెట్ ప్రవేశపెట్టాం
విపక్ష లేకుండా ప్రతి ఒక్కరికీ బీమా
ఉద్యోగులకు రూ. కోటి బీమా
ఆర్భాటాలకు పోకుండా ఆర్థిక క్రమశిక్షణకు ప్రాధాన్యత ఇచ్చాం
మీడియాతో డిప్యూటీ సీఎం భట్టి చిట్ చాట్

శాసన మండలిలో బడ్జెట్ ప్రవేశపెట్టిన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగిస్తున్నాం

రెండేళ్ల కాలంలో అనేక సంక్షేమ పథకాలు అమలు చేశాం

దేశంలోనే ఆదర్శవంతమైన పాలన అందిస్తున్నాం

రాష్ట్రాభివృద్ధి కోసం శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నాం

దేశంలోనే తెలంగాణను నంబర్‌వన్‌గా నిలుపుతాం

దేశంలోనే తెలంగాణను నంబర్‌వన్‌గా నిలుపుతాం

రైతు సంక్షేమం, మహిళా సాధికారిత, యువతకు ఉపాధియే ప్రాధాన్యం

తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలకు పెద్దపీట

ప్రతి పౌరుడికి సామాజిక, ఆర్థిక న్యాయం మా లక్ష్యం

ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క

అసెంబ్లీకి ముందు కేబినెట్ భేటీ.. బడ్జెట్ ప్రతిపాదనలపై ఆమోదం

### 2026–27 తెలంగాణ బడ్జెట్ లో ప్రవేశపెట్టిన నూతన పథకాలు

1. ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా
ప్రతి కుటుంబానికి ₹5 లక్షల బీమా – బడ్జెట్ ₹4,000 కోట్లు.
2. చేయూత పథకం
2 లక్షల కొత్త పెన్షన్లు – బడ్జెట్ ₹14,861 కోట్లు.
3. తెలంగాణ పబ్లిక్ స్కూళ్లు
ఆధునిక సదుపాయాలతో ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి – ₹500 కోట్లు.
4. విద్యార్థులకు బ్రేక్‌ఫాస్ట్ పథకం
పాలు, రాగి జావతో పోషకాహారం – ₹800 కోట్లు.
5. ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం
జూనియర్ కాలేజీలకు విస్తరణ – ₹100 కోట్లు.
6. నగదు రహిత ఆరోగ్య భద్రత
ఉద్యోగులు, పెన్షనర్లకు క్యాష్‌లెస్ ట్రీట్‌మెంట్.
7. ఉద్యోగుల ప్రమాద బీమా
ప్రమాదంలో ₹1.2 కోట్లు వరకు బీమా – మొత్తం ₹1,056 కోట్లు.
8. సీఎం ఓవర్సీస్ ఎంప్లాయిమెంట్
విదేశీ ఉద్యోగాలకు శిక్షణ, మార్గదర్శకత – ₹1,056 కోట్లు.
9. ATC ట్రైనీలకు స్కాలర్‌షిప్
నెలకు ₹2,000 – ₹80 కోట్లు.

## ఆరు గ్యారంటీలకు గోరీ

హామీల అమలుపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదు
ఇందిరమ్మ, రాజీవ్ గాంధీ పేరుతో ఉన్న పథకాలకూ నిధుల్లేవు
రాష్ట్ర బడ్జెట్ పై బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు ఆరోపణ

9

## గ్యారెంటీ మోసం

గ్యారెంటీల అమలు లో వైఫల్యం ...బాకీ కార్డులతో నిరసన
హామీలపై బీఆర్ఎస్ ప్రశ్నలు....బడ్జెట్‌పై తీవ్ర విమర్శలు
అసెంబ్లీలో ఎండగడతాం
ఆరు గ్యారెంటీల అమలు వైఫల్యంపై గన్ పార్క్ వద్ద బీఆర్ఎస్ నిరసన

3

## దళిత సంక్షేమానికి పెద్ద ఎత్తున కేటాయింపులు


3



## ఆరు గ్యారెంటీలకు పాడె కట్టే బడ్జెట్ ఇదీ

అంకెల ఆర్భాటం మాత్రమే...
ప్రజలకు లాభం శూన్యం
మరో లక్ష కోట్లు అప్పు భారమా?.. కాంగ్రెస్‌పై ఫైర్
రైతు, మహిళ, నిరుద్యోగులకు న్యాయం ఎక్కడ?
"మోసం, దగా బడ్జెట్" అంటూ బండి సంజయ్ తీవ్ర విమర్శలు

3




# ఆర్థిక.. ఆరోగ్య భరోసా

ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల జీవిత భీమా భరోసా అందించనున్న తెలంగాణ ప్రభుత్వం
జూన్ 2 నుంచి అమల్లోకి 'ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా' మహా పథకం
ఆదాయం సంపాదించే వ్యక్తి మరణించినా కుటుంబానికి ఆర్థిక రక్షణ
పేద–మధ్యతరగతి తేడా లేకుండా అందరికీ వర్తించే సామాజిక భద్రత
ఒకేసారి 1.15 కోట్ల కుటుంబాలకు బీమా కవరేజీ... దేశంలోనే రికార్డు
ప్రభుత్వ ఖర్చుతో అందరికీ జీవితబీమా... సంక్షేమంలో కొత్త అధ్యాయం
విపత్కర సమయంలో కుటుంబానికి అండగా నిలిచే రూ.5 లక్షల భద్రత
రేవంత్ ప్రభుత్వం విప్లవాత్మక నిర్ణయం

3




# రేవంత్ వ్యూహం.. విపక్షం విలవిల!

దూకుడు మీద రేవంత్..
అయోమయంలో కేటీఆర్
పాత అస్త్రాలు.. విమర్శలతో బీఆర్ఎస్
కొత్త వ్యూహాలతో రేవంత్
మూసీ మీద పట్టు సాధించని కేటీఆర్ టీం
విమర్శలతోనే తిప్పికొట్టిన రేవంత్
సింగిల్ హ్యాండ్.. అయినా సీఎందే పైచేయి

9

ముద్ర, తెలంగాణ బ్యూరో : అసెంబ్లీ వేదికగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన రాజకీయ దూకుడుతో బీఆర్ఎస్ శ్రేణులను ఆత్మరక్షణలో పడేశారు. పాత విమర్శలతోనే కేటీఆర్ బృందం సభకు రాగా, రేవంత్ మాత్రం గత పాలకుల వీడియో సాక్ష్యాలు, గణాంకాలతో 'రివర్స్ అటాక్' చేసి వారిని ఉక్కిరిబిక్కిరి చేశారు. ముఖ్యంగా మూసీ పునరుజ్జీవం, అభివృద్ధి విజన్‌పై సీఎం చూపిన స్పష్టత ముందు విపక్షం అయోమయంలో పడినట్లు కనిపిస్తోంది. సింగిల్ హ్యాండ్‌తో రేవంత్ సభపై పట్టు సాధించగా కేటీఆర్ టీం వ్యూహం ఫలించలేదనే చర్చ సాగుతోంది.

## మావోయిజం నిర్మూలనకు తెలంగాణ ఆదర్శం

అసెంబ్లీలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క
అసమానతలే మావోయిజం మూలం
సంక్షేమంతోనే పరిష్కారం
732 మంది మావోయిస్టులు లొంగుబాటు
ఉపాధితో ప్రధాన ప్రవాహంలోకి
ఫ్యూడలిస్టిక్ సామాజిక, ఆర్థిక అసమానతులను రూపుమాపితేనే ఉద్యమం అంతం

3



## రాష్ట్రంలో విపత్తుల శిక్షణా కేంద్రం

9


అంతర్జాతీయ ప్రమాణాలతో విపత్తుల శిక్షణా కేంద్రం ఏర్పాటు దిశగా అడుగులు
డిజాస్టర్ మేనేజ్‌మెంట్‌లో తెలంగాణను ఆదర్శంగా తీర్చిదిద్దే లక్ష్యం
ముందస్తు సన్నద్ధతతో ప్రాణ, ఆస్తి నష్టాలు తగ్గించాలన్న ప్రభుత్వ ప్రయత్నం
డ్రోన్లు, హైస్పీడ్ బోట్లు సహా ఆధునిక సాంకేతికతకు ప్రాధాన్యం
అన్ని శాఖల సమన్వయంతో విపత్తుల నిర్వహణకు సమగ్ర కార్యాచరణ
డిజాస్టర్ మేనేజిమెంట్‌పై సమీక్షలో మంత్రి పొంగులేటీ



9

## ఇక కొత్త విద్యావిధానం

టెన్త్ పరీక్షలు ఉండవు
సెమిస్టర్ విధానానికి దారితీస్తున్న ప్రభుత్వం
నర్సరీ నుంచి ఇంటర్ వరకు ఒకే బోర్డు.. విద్యలో భారీ సంస్కరణలు
రాష్ట్రంలో వంద పబ్లిక్ స్కూళ్లు
వన్ బోర్డ్ పాలసీతో విద్యా వ్యవస్థ సరళీకరణపై దృష్టి
ప్రతి నియోజకవర్గంలో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లు ఏర్పాటు
కార్పొరేట్ స్థాయి విద్యను ప్రభుత్వ పాఠశాలల్లో అందించాలన్న లక్ష్యం
స్కిల్ యూనివర్సిటీతో ఉద్యోగావకాశాలకు కొత్త దారులు
విద్యార్థుల ఆరోగ్యం, పోషణపై రాజీ లేదన్న సీఎం
మీడియా చిట్ చాట్‌లో సీఎం రేవంత్ రెడ్డి




## ముంచుకొస్తోన్న గ్యాస్ సంక్షోభం

ప్రపంచ ఎల్ఎన్‌జీ సరఫరాలో కీలక కేంద్రం రాస్ లఫాన్ దెబ్బతింది
భారత్ గ్యాస్ అవసరాల్లో ఖతార్‌పై భారీ ఆధారపడటం
ఎరువులు, విద్యుత్తు, పరిశ్రమలపై ప్రభావం తీవ్రం
గ్యాస్ ధరలు పెరిగే ప్రమాదం.. వినియోగదారులకు భారం
ప్రత్యామ్నాయ ఇంధన వనరుల కోసం భారత్ ప్రయత్నాలు

10

# పవర్ హౌస్‌గా కరీంనగర్..

రాష్ట్ర రాజకీయాల్లో కీలక ముద్ర..
ఉద్యమాల నేల నుంచి అధికార కేంద్రంగా కరీంనగర్ ఎదుగుదల
మూడు పార్టీల్లోనూ కరీంనగర్ నేతల ప్రభావం

6



## ఇదీ ఏఐ ముద్ర

నాటో దేశాలపై ట్రంప్ చిందులుతొక్కారు.. పిరికివాళ్లంటూ ఎద్దేవా వేశారు. అమెరికా లేకపోతే నాటో కేవలం ఒక పేపర్ టైగర్ మాత్రమేనంటూ ఫైర్ అయ్యారు.



సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
21.03.2026 శనివారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews





**సానుకూల ఆలోచన**

ప్రతికూల పరిస్థితుల్లో కూడా మంచి కోణాన్ని చూడడానికి ప్రయత్నించండి. ఇది మీలో ఆశాభావాన్ని పెంచి, ఒత్తిడిని తగ్గిస్తుంది.

# తెలంగాణ బడ్జెట్ రూ.3,24,234 లక్షల కోట్లు

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**

2026: 202627 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి బడ్జెట్‌ను ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క శుక్రవారం అసెంబ్లీలో ప్రవేశపెట్టారు. 202526 పద్దు రూ.3.04 లక్షల కోట్లు కాగా.. ఈ ఏడాది రూ.3.24 లక్షల కోట్లతో బడ్జెట్ ప్రవేశపెట్టారు. రంగాల వారీగా కేటాయింపు వివరాలను భట్టి విక్రమార్క సభా వేదికగా వెల్లడించారు. ఈ బడ్జెట్‌లో ఆరు గ్యారెంటీలకు రూ.50,713 కోట్లు, ఆర్థికశాఖకు రూ.60,438 కోట్లు కేటాయించారు. అలాగే ఇందిరమ్మ ఇళ్లు, సాగునీటి ప్రాజెక్టులు, పంచాయతీ రాజ్ వంటి కీలక శాఖలకు భారీగా నిధులు కేటాయించారు. హోంశాఖతో పాటు విద్య, పట్టాభివృద్ధి రంగాలకు పెద్దపీట వేశారు. అంత్యంత ప్రాధాన్యతమైన ఆర్థిక శాఖలకు రూ.60438 కోట్లు కేటాయించగా సాధారణ పరిపాలనశాఖకు రూ.1190 కోట్లు కేటాయించారు. ఉన్నత విద్య కు రూ.5443 కోట్లు, రాష్ట్రంలో శాంతి భద్రత పర్యవేక్షించే హోంశాఖకు రూ.11907 కోట్లు, పరిశ్రమలు, వాణిజ్యం రూ.3,747 కోట్లు, పట్టణాభివృద్ధి శాఖ రూ.17,907 కోట్లు, ప్రణాళికశాఖ రూ.7971 కోట్లు, రెవెన్యూ శాఖకు రూ.4020 కోట్లు, మాధ్యమిక విద్య రూ.21,231 కోట్లు, రవాణాశాఖ రూ.4,491 కోట్లు కేటాయించారు. రైతు భరోసా పథకానికి రూ.18 వేల కోట్లు ఖర్చు చేయనున్నట్లు వెల్లడించారు. చేయూత పథకానికి రూ.14,861 కోట్లు.. ఇందిరమ్మ ఇండ్ల పథకానికి రూ.5,500 కోట్లు.. మహాలక్ష్మి పథకానికి రూ.4,305 కోట్లు.. రైతులు పండించిన సన్న వడ్ల బోనస్‌కు రూ.3,500 కోట్లు.. 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందించే గృహ జ్యోతి పథకానికి రూ.2,080 కోట్లను కేటాయించారు. రాజీవ్ ఆరోగ్య శ్రీ పథకానికి రూ.1,143 కోట్లు.. మహాలక్ష్మి పథకం కింద ఎల్పీజీ సబ్సిడీకి రూ.723 కోట్లు.. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకానికి రూ. 600 కోట్లు.. పవర్ సబ్సిడీకి రూ.14 వేల కోట్లు.. బియ్యం సబ్సిడీకి రూ.3 వేల కోట్లు.. కల్యాణలక్ష్మీ, షాదీ ముబారక్ స్కీంకు రూ.3,683.. విద్యార్థుల డైట్ ఛార్జీల కోసం రూ.2,170 కోట్లు.. విద్యార్థుల స్కాలర్‌షిప్‌లకు రూ.4,343 కోట్లు.. ఆఫీస్ ఖర్చులకు రూ.2,323 కోట్లు కేటాయించారు.ప్రతి పౌరుడికి సామాజిక, ఆర్థిక న్యాయం అందించడమే లక్ష్యంగా బడ్జెట్ ను రూపొందించినట్లు చెప్పారు. అంబేడ్కర్ అడుగుజాడల్లోనే పాలన సాగిస్తున్నామని పేర్కొన్నారు. తెలంగాణలో తలసరి ఆదాయం 10.2 శాతం పెరిగి రూ.4,18,931 లక్షలకు చేరిందని ప్రకటించారు. 202425తో పోలిస్తే 202526లో తెలంగాణ రాష్ట్ర జీడీపీ 10.6 శాతం మేర పెరిగిందన్నారు. జాతీయ సగటు వృద్ధి రేటు కంటే తెలంగాణ జీఎస్‌డీపీ 2.7 శాతం ఎక్కువగా ఉందన్నారు. అంతకుముందు ఉదయం 9 గంటలకు అసెంబ్లీ కమిటీ హాలులో కేబినెట్ సమావేశం నిర్వహించి బడ్జెట్‌ను ఆమోదించారు. ప్రజా భవన్ నల్ల పోచమ్మ ఆలయం వద్ద బడ్జెట్ ప్రతులకు భట్టి పూజలు నిర్వహించారు.

**బీఆర్ఎస్ వాకౌట్**

ఓ వైపు బడ్జెట్ పై భట్టి విక్రమార్క ప్రసంగిస్తుండగానే బీఆర్ఎస్ నేతలు సభ నుంచి వాకౌట్ చేశారు. బడ్జెట్ రాష్ట్ర ప్రజల అవసరాలు తీర్చేలా లేదని విమర్శిస్తూ.. చెవుల్లో పువ్వులు పెట్టుకుని నిరసన తెలిపారు. అనంతరం తెలంగాణ అసెంబ్లీ, మండలి సోమవారానికి వాయిదా పడ్డాయి.



**ఆరు గ్యారంటీలకు రూ. 50వేల కోట్లు..**

రాష్ట్ర బడ్జెట్‌లో ప్రభుత్వం ఆరు గ్యారెంటీలకు పెద్దపీట వేసింది. ఈ పథకాల అమలు కోసం రూ.50 వేల కోట్ల నిధులు కేటాయిస్తున్నట్లు ప్రకటించింది. ఇందులో భాగంగా రాష్ట్రంలోని పేదలు, వృద్ధులు, ఆసరా అవసరమైన వారికి భట్టి భారీ ఊరటనిచ్చారు. కొత్తగా మరో 2 లక్షల మందికి 'చేయూత' పెన్షన్లు మంజూరు చేయనున్నట్లు భట్టి విక్రమార్క అసెంబ్లీలో ప్రకటించారు. కాగా ఎన్నికల వేళ ఇచ్చిన హామీలను అమలుకు చర్యలు చేపట్టింది. తాము అధికారంలోకి వచ్చిన తర్వాత ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని ప్రకటించిన కాంగ్రెస్ సర్కార్... ఇప్పటికే ఈ గ్యారెంటీల్లో కొన్నింటిని అమలు చేస్తోంది. మరికొన్ని హామీలు మాత్రం మిగిలిపోయాయి. దీనిపై ప్రతిపక్ష బీఆర్ఎస్, బీజేపీలు కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పిస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే తాజాగా ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఆరు గ్యారెంటీల అమలుకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం నడుం బిగించింది. 6 గ్యారెంటీలకు భారీగా నిధులను కేటాయించింది. ఈ పథకాల అమలు కోసం ఏకంగా రూ.50,713 కోట్లు కేటాయిస్తున్నట్లు తెలిపింది.

**మూసీ పునరుజ్జీవానికి రూ. 1500 కోట్లు**

మూసీ నది ప్రాజెక్టు కోసం రూ.1500 కోట్లు కేటాయిస్తున్నట్లు ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రకటించారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ కోసం రూ.5 వేల కోట్లు.. ప్రభుత్వ ఉద్యోగుల ఆరోగ్య పథకం కోసం రూ.1,056 కోట్లు.. ఉస్మానియా యూనివర్సిటీకి రూ. వెయ్యి కోట్ల కేటాయింపులు చేసినట్లు భట్టి వివరించారు. ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు డిజిటల్ కార్డులు ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు ఎంతోకాలంగా ఎదురు చూస్తున్న నగదు రహిత ఆరోగ్య భద్రత పథకం ఎంప్లాయిస్ హెల్త్ స్కీంను ప్రారంభిస్తున్నట్లు భట్టి విక్రమార్క ప్రకటించారు. రాష్ట్రంలోని రాజీవ్ ఆరోగ్యశ్రీ ట్రస్ట్ ద్వారా ప్రభుత్వ ఆస్పత్రులతోపాటు 421 ఎంప్యానెల్ ప్రయివేట్ ఆసుపత్రుల్లో 1,998 వ్యాధులకు ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు చికిత్స పొందవచ్చని తెలియజేసారు. ఇందులో భాగంగా ప్రతి ఉద్యోగికి డిజిటల్ కార్డు అందిస్తామని వెల్లడించారు. మరోవైపు రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటు చేస్తున్న 3 టిమ్స్ ఆస్పత్రులను ఈ ఏడాది చివరికి ప్రారంభిస్తామన్నారు. నిమ్స్ ఆస్పత్రి విస్తరణ, వరంగల్ మల్టీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ తో సహా మొత్తం 6,582 టెర్షియరీ కేర్ బెడ్లు అందుబాటులోకి తెస్తామని పేర్కొన్నారు.

**ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం**

ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో ఇంటర్ చదువుతున్న విద్యార్థులకు కూడా మధ్యాహ్న భోజనం పథకాన్ని ప్రవేశపెడుతున్నట్లు ఆర్థిక మంత్రి ప్రకటించారు. 202627 విద్యా సంవత్సరం నుంచి ప్రీప్రైమరీ నుంచి ఇంటర్ వరకు విద్యార్థులకు నూతనంగా బ్రేక్ ఫాస్ట్ పథకాన్ని ప్రారంభిస్తామని మంత్రి తెలిపారు. మూడు రోజులు అల్పాహారంతోపాటు పాలు, మరో మూడు రోజులు రాగి జావ అందిస్తామని భట్టి ప్రకటించారు. తెలంగాణలోని ఏ విద్యార్థి కూడా ఆకలితో అలమటించొద్దనే ఉద్దేశంతో బ్రేక్‌ఫాస్ట్ పథకానికి రూపకల్పన చేశామని మంత్రి తెలిపారు. ఐటీఐలు, ఏటీసీల్లో చదివే విద్యార్థులకు నెలకు రూ.2 వేల చొప్పున స్కాలర్‌షిప్ అందిస్తామని మంత్రి ప్రకటించారు. ఈ బడ్జెట్లో విద్యా రంగానికి రూ.26,674 కోట్లు కేటాయించారు.

తెలంగాణ విద్యార్థి ఉద్యమాలకు గుండె కాయ ఉస్మానియా యూనివర్సిటీకి రాష్ట్ర బడ్జెట్‌లో పెద్ద పీట వేశారు. వర్సిటీ అభివృద్ధికి రూ. 1000 కోట్లు కేటాయించారు. ఈ నిధులు మౌలిక సదుపాయాల కల్పన, పాత భవనాల పునరుద్ధరణ, నూతన హాస్టల్ భవనాల నిర్మాణానికి వినియోగించనున్నారు. ఈ కేటాయింపులతో యూనివర్సిటీలో అత్యాధునిక పరిశోధనా కేంద్రాలు, డిజిటల్ లైబ్రరీలు, స్మార్ట్ క్లాస్ రూమ్‌ల ఏర్పాటుకు మార్గం సుగమం అయింది. ఇక విద్యార్థులకు అవసరమైన క్రీడా ప్రాంగణాలు, క్యాంపస్ సుందరీకరణ పనులకు కూడా ఈ నిధులు వెచ్చించనున్నారు. ప్రభుత్వ తీసుకున్న ఈ నిర్ణయంపై విద్యార్థులు, అధ్యాపకులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

**మెట్రో రెండో దశకు రూ. 600 కోట్లు..**

హైదరాబాద్ మెట్రో ఫేజ్ 2 విస్తరణకు ప్రభుత్వం రూ.600 కోట్లు కేటాయించింది. మెట్రో నిర్వహణను ప్రభుత్వం తన ఆధీనంలోకి తీసుకుంటుందని, పాతబస్తీ, ఎయిర్‌పోర్ట్ కారిడార్లకు ప్రాధాన్యత ఇస్తామని మంత్రి భట్టి విక్రమార్క బడ్జెట్ ప్రసంగంలో తెలిపారు. నగర మౌలిక వసతుల కోసం హెచ్‌సీఐటీఐ కింద రూ.2,654 కోట్లు, తాగునీటి ప్రాజెక్టుల కోసం భారీ నిధులను బడ్జెట్‌లో కేటాయించినట్లు చెప్పారు. హైదరాబాద్ మహానగరానికి జీవనాడిగా ఉన్న మెట్రో రైల్ ప్రాజెక్టును ఎల్ అండ్ టీ సంస్థ నుంచి ప్రభుత్వం తన ఆధీనంలోకి తీసుకోవాలనే నిర్ణయం రాష్ట్ర రవాణా చరిత్రలో ఒక సాహసోపేతమైన, ప్రజానుకూలమైన నిర్ణయమన్నారు. హైదరాబాద్ మెట్రో రైలు ప్రస్తుతం రోజుకు సుమారు 5 లక్షల ప్రయాణికులకు సేవలందిస్తోందన్నారు. ఈ సౌకర్యాన్ని పాతబస్తీకి విస్తరించడంతో పాటు మెట్రో ఫేజ్ 11 కింద కొత్త కారిడార్లు నిర్మించి నెట్వర్క్‌ను విస్తరించే ప్రణాళికను ప్రభుత్వం రూపొందించిందన్నారు. వేగంగా విస్తరిస్తున్న హైదరాబాద్ నగరంలో పాతబస్తీ, శంషాబాద్ విమానాశ్రయం, హైటెక్ సిటీ దాటి ఇతర ప్రాంతాలకు మెట్రో విస్తరణ అత్యవసరంగా మారిందన్నారు. ఇక దేశంలోనే అత్యంత నివాసయోగ్యమైన నగరంగా హైదరాబాద్ ఇప్పటికే ఖ్యాతి గడించిందన్నారు. అంతర్జాతీయ నగరాలకు ధీటుగా తీర్చిదిద్దేందుకు తమ ప్రభుత్వం తగిన చర్యలు చేపడుతోందన్నారు. ప్రజలు, సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు, కార్పొరేట్ సామాజిక బాధ్యత భాగస్వాములు తదితరుల సహకారంతో అనేక నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుడుతోందన్నారు. హైదరాబాద్ శరవేగంగా అభివృద్ధి చెందుతున్న నగరాల జాబితాలో ముందుందన్నారు. అయినా, ప్రభుత్వం అక్కడితోనే ఆగకుండా తెలంగాణలోని ప్రతి పట్టణం, ప్రతి నగరం హైదరాబాద్ మాదిరిగా అభివృద్ధి చెందాలనే లక్ష్యంతో పనిచేస్తుందన్నారు. రాష్ట్రంలో పట్టణీకరణ శాతాన్ని పెంచగలిగామన్నారు. ఈ ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తుందని చెప్పడానికి ఇది ఒక నిదర్శనమన్నారు. నగర నీటి అవసరాలు తీర్చేందుకు గోదావరి తాగునీటి ప్రాజెక్ట్, కొత్త రిజర్వాయర్లు, 39 మురుగునీటి శుద్ధి కేంద్రాలను మంజూరు చేశామన్నారు. వాటి నిర్మాణం వివిధ దశలలో కొనసాగుతోందని చెప్పారు. పాత జీహెచ్ఎంసీ సంస్థకి ఉన్న అధిక వడ్డీ అప్పుల గురించి సంబంధిత బ్యాంకులతో చర్చించి వడ్డీ రేటును 9.15 శాతం నుండి 7.95 శాతానికి తగ్గించామన్నారు. హైదరాబాద్ నగర మౌలిక వసతుల అభివృద్ధి కోసం 'HCITI' పథకం కింద 2 వేల 654 కోట్ల రూపాయలు కేటాయించామని భట్టి విక్రమార్క వెల్లడించారు.

**జూన్ 2 నుంచి ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం**

రాష్ట్ర ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క రాష్ట్ర ప్రజలకు శుభవార్త చెప్పారు. ఈ ఏడాది జూన్ 2 నుంచి ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని అమలు చేయనున్నట్లు అసెంబ్లీలో ప్రకటించారు. ఈ పథకం కింద రాష్ట్రంలోని 1.15 కోట్ల కుటుంబాలకు రూ.5 లక్షల జీవిత బీమా కల్పిస్తున్నట్లు వెల్లడించారు. పేద, ధనిక అనే తేడాలు లేకుండా రాష్ట్ర ప్రజలందరికీ ఈ బీమాను వర్తింపజేస్తామని తెలిపారు. ఏపీ రాష్ట్రంలో తెల్ల రేషన్ కార్డు ఉన్న ప్రతి కుటుంబానికి, అసంఘటిత రంగంలోకి కార్మికులకు బీమా రక్షణ కల్పిస్తోంది. ఈ పథకం కింద ప్రభుత్వమే బీమా ప్రీమియాన్ని చెల్లిస్తోంది. అయితే తెలంగాణ ప్రభుత్వం కుటుంబ ఆర్థిక పరిస్థితితో సంబంధం లేకుండా రాష్ట్రంలోని అన్ని కుటుంబాలకు ఈ పథకాన్ని వర్తింపజేస్తామని ప్రకటించడం గమనార్హం. ఈ పథకం అమల్లోకి వస్తే.. చాలా వరకు పేద కుటుంబాలకు ఆర్థిక భరోసా లభించనుంది.ఎస్టీల సంక్షేమానికి రూ.12,600 కోట్లు కేటాయించారు. ఈ నిధులను 'ఇందర సౌర గిరి జల వికాసం' పథకం ద్వారా ఖర్చు చేయనున్నారు. 100 శాతం సబ్సిడీతో సోలార్ పంపు సెట్లను అందించి, ఆరు లక్షల ఎకరాల పోడు భూముల్లో అటవీ ఉత్పత్తులకు సంబంధించిన తోటల పెంపకాన్ని ప్రోత్సహించి 2.10 లక్షల గిరిజన రైతులకు లబ్ధిచేకూర్చనున్నట్లు భట్టి విక్రమార్క ప్రకటించారు. ఈ పథకాన్ని ఇప్పటికే అచ్చంపేటలో పైలట్ ప్రాజెక్టుగా ప్రారంభించామని, దీని విధివిధానాలు అధ్యయనం చేసి రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేస్తామని భట్టి తెలిపారు.

**ఐటీకి రూ.875 కోట్లు**

బడ్జెట్‌లో ప్రభుత్వం ఐటీ శాఖకు భారీగా నిధులు కేటాయించింది. గ్రామీణ ప్రాంతాలకు ఇంటర్నెట్ సేవలు అందించాలన్న లక్ష్యంతో రూ.875 కోట్లను కేటాయించింది. ఇప్పటికే టీఫైబర్ ద్వారా రాష్ట్రంలోని 424 మండలాల్లోని 8888 గ్రామపంచాయతీలకు, 4800 ప్రభుత్వ సంస్థలకు హైస్పీడ్ ఇంటర్నెట్‌ను అనుసంధానం చేసింది. ఈ ఆర్థిక సంవత్సంలో మరో 50 వేల ప్రభుత్వ సంస్థలకు కొత్త కనెక్షన్లు ఇచ్చేందుకు ప్రణాళికలు రూపొందించింది. ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రైవేట్ సంస్థల ఇంటర్నెట్‌ను సేవలను తగ్గించడంతోపాటు ఖర్చును తగ్గించేందుకు ప్రభుత్వం టీఫైబర్ ద్వారా సురక్షితమైన హైస్పీడ్ ఇంటర్నెట్‌ను అందిస్తున్నట్లు ఆర్థికశాఖ మంత్రి భట్టి బడ్జెట్ ప్రసంగంలో తెలిపారు.

**ఐటీలో 9.39 లక్షల మందికి ఉద్యోగాలు:**

ఐటీ రంగంలో తెలంగాణ సాధిస్తున్న అభివృద్ధి దేశానికే తలమానిరంగా మారిందని భట్టి తెలిపారు. రాష్ట్రంలో 1500 కంటే ఎక్కువ ఐటీ, ఐటీఈఎస్ కంపెనీలు ఉన్నాయన్నారు. తెలంగాణలో ఐటీ రంగంలో వృద్ధి పెంచడానికి, పెట్టుబడులను ఆకర్షించడానికి, ఉపాధి కల్పన కోసం 1వ, 2, ఐసీటీ విధానాలను ప్రభుత్వం ప్రారంభించిందని భట్టి వెల్లడించారు. వీటితోపాటు ఎలక్ట్రానిక్స్ పాలసీ, ఇమేజ్ పాలసీలను ప్రభుత్వం తీసుకొస్తున్నచెప్పారు. తెలంగాణ నుంచి ఐటీ ఎగుమతులు 3.13 లక్షల కోట్లకు 9.39 లక్షల మందికి పైగా ఉపాధి అవకాశీలు కల్పిస్తున్నాయని భట్టి వివరించారు.

హైదరాబాద్ లోయర్ ట్యాంక్ బండ్ వద్ద కొత్తగా డా.బి.ఆర్ అంబేద్కర్ నాలెడ్జ్ టవర్‌ను నిర్మించబోతున్నట్లు భట్టి ప్రకటించారు. రూ.368.27 కోట్ల అంచనా వ్యయంతో 910 ఎస్సీ కమ్యూనిటీ హాళ్లు, అంబేద్కర్ భవనాలు, విగ్రహాలు మంజూరు చేశామని తెలిపారు. హైదరాబాద్‌లోని నింబోలి అడ్డ కాచిగూడలో బాబూ జగ్జీవన్ రామ్ పేరుతో నూతన వసతి గృహాన్ని నిర్మిస్తామని పేర్కొన్నారు. అంతరాలు లేని సమాజం కోసం తమ ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందన్నారు. షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగల సామాజిక న్యాయం చేయాలనేది ప్రభుత్వ ముఖ్య ఉద్దేశం అన్నారు. వసతి పాఠశాలలు, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాల ద్వారా ఎస్సీ, ఎస్టీలకు ఉద్యోగావకాశాలు కల్పించడానికి కృషి చేస్తున్నట్లు చెప్పారు.

**ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ అమలుపై..**

ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ చట్టాన్ని సంపూర్ణంగా అమలు చేయడానికి ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని భట్టి అన్నారు. తాము అధికారంలోకి వచ్చే సమయంలో 202324 ఆర్థిక సంవత్సరం నాటికి సబ్ ప్లాన్ చట్ట ప్రకారం ఖర్చు చేయాల్సిన నిధులలో ఎస్సీలకు చెందిన రూ.13 ,617 కోట్లు, ఎస్టీలకు చెందిన 1,317 కోట్లు కలిసి మొత్తం 14,934 కోట్లు ఖర్చు కాకుండా ఉందన్నారు. తమ ప్రభుత్వం గత ఆర్థిక సంవత్సరంలో చేసిన కేటాయింపులతో పాటు ఈ బకాయిలను కూడా అదనంగా కేటాయించామన్నారు. 202425 ఆర్థిక సంవత్సరానికి ఈ క్యారీ ఫార్వర్డ్ చేయవలసిన నిధులు, ఎస్సీలకు రూ7,757 కోట్లు, ఎస్టీలకు రూ.1,754 కోట్లు ఖర్చు చేయవలసి ఉంది. వాటిని మేము 202627 ఆర్థిక సంవత్సరంలో కేటాయించాల్సిన మొత్తానికి అదనంగా 202425 ఆర్థిక సంవత్సరానికి చెందిన బకాయిలను కూడా కేటాయిస్తున్నామన్నారు.

**చెవిలో పువ్వు పెట్టుకుని బీఆర్ఎస్ నిరసన**

డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క బడ్జెట్ ప్రసంగం ప్రారంభించగానే, బీఆర్ఎస్ సభ్యులు వినూత్న నిరసనకు దిగారు. ప్రభుత్వం ప్రజలను 'చెవిలో పూలు' పెట్టి మోసం చేస్తోందని అర్థం వచ్చేలా, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలంతా తమ చెవులలో పూలు పెట్టుకుని సభ నుంచి వాకౌట్ చేశారు. అంతకు ముందు బడ్జెట్ ప్రసంగం ప్రారంభం కాగానే, ప్రభుత్వం గత ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలను విస్మరించిందని ఆరోపిస్తూ నినాదాలు చేశారు. ముఖ్యంగా 'ఆరు గ్యారంటీల' అమలు తీరుపై వారు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. వాకౌట్ చేసిన అనంతరం, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు శాసనసభ ఎంట్రీ వద్దకు చేరుకుని ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా వారు ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. 'తులం బంగారం మోసం మోసం' అంటూ నినాదాలు చేస్తూ ప్రభుత్వం పేద మహిళలను వంచించిందని ఆరోపించారు. 'రెండు లక్షల ఉద్యోగాలు మోసం మోసం' అంటూ యువతకు ఇచ్చిన హామీని ప్రభుత్వం నిలబెట్టుకోవడంలో విఫలమైందని మండిపడ్డారు. ఇక 'బడ్జెట్ మోసం మోసం' అంటూ, ఈ బడ్జెట్‌లో పేదలకు, రైతులకు, మహిళలకు ఎలాంటి న్యాయం జరగలేదని బీఆర్ఎస్ నేతలు ధ్వజమెత్తారు.

## ఇంటర్ ఫస్టియర్ ఎగ్జామ్ రద్దు చేయాలని ప్రతిపాదన: ఎడ్యుకేషన్ కీలక ప్రకటన

ముద్ర , తెలంగాణ బ్యూరో : 10వ తరగతి బోర్డు పరీక్షలు రద్దు వార్తలపై తెలంగాణ ఎడ్యుకేషన్ కమిషన్ స్పష్టత ఇచ్చింది. 10వ తరగతి పరీక్షలు రద్దు చేయాలని కమిషన్ ఎక్కడా సిఫార్సు చేయలేదని, SSC బోర్డు BIE విలీనం చేయాలని మాత్రమే సిఫార్సు చేసిందని తెలిపారు. కేవలం 11వ తరగతి పబ్లిక్ ఎగ్జామ్స్ రద్దు ప్రతిపాదన చేసిందని మీడియాలో వస్తున్న వార్తలపై కమిషన్ క్లారిటీ ఇచ్చింది.



# పీపుల్స్ సెంట్రిక్ బడ్జెట్

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**

మాది పీపుల్స్ సెంట్రిక్ బడ్జెట్ అని ప్రజలే కేంద్రంగా బడ్జెట్ ప్రవేశపెట్టామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. ఇవాళ సభలో బడ్జెట్ ప్రవేశ పెట్టిన అనంతరం మీడియాతో ఆయన చిట్ చాట్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రాష్ట్రంలోని ప్రతి ఒక్కరికి ఎలాంటి వివక్ష లేకుండా బీమా సౌకర్యం కల్పించామని చెప్పారు. ఉద్యోగులు అందరికీ రూ. కోటి బీమా కల్పించామని చెప్పారు. వాస్తవిక బడ్జెట్ కాబట్టే ఇక్కడితో ఆగామని బీఆర్ఎస్ మాదిరిగా చేసి ఉంటే బడ్జెట్ మూడు లక్షల 30 వేల కోట్ల వరకు వెళ్లేదని సెటైర్ వేశారు. అలా కాకుంటా వాస్తవ అంచనాలతో రూ.3,24,234 కోట్లతో బడ్జెట్ రూపొందించినట్లు చెప్పారు. బడ్జెట్ ప్రసంగంలో తాము ఆర్భాటాలకు పోకుండా ఆర్థిక క్రమశిక్షణకు ప్రాధాన్యత ఇచ్చామని వెల్లడించారు. తద్వారా అభివృద్ధికి, సంక్షేమానికి పెద్ద పీట వేశామన్నారు. తాము ప్రవేశ పెట్టిన



బడ్జెట్ తెలంగాణ రాష్ట్ర ప్రజల ఆకాంక్షల ప్రతిరూపం అని పీడిత, తాడిత, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి ఇస్తున్న భరోసా అన్నారు. ఒక వైపు ఆర్థిక పరమైన ఒడిదుడుకులు ఎన్ని ఎదురైనా అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలకు ఏమాత్రం నిధుల కొరత రాకుండా ఈ బడ్జెట్‌ను సమతుల్యంగా రూపొందించామని చెప్పారు. పన్నుల భారంతో సామాన్యుడి పైన భారం మోపకుండా ఉన్న వనరులను సద్వినియోగం చేస్తూ కొత్త సంపద సృష్టించి దానిని ప్రజలకు పంచడమే మా ప్రజా ప్రభుత్వ ఆర్థిక విధానం అని చెప్పారు.


# బంగారం వెండి వెంటనే కొనుక్కోండి

**ముద్ర డెస్క్ :**

బంగారం, వెండి ధరలు వారం రోజులుగా పతనం అవుతున్నాయి. ఒకవైపు గల్ఫ్ యుద్ధం కారణంగా ఒకవైపు రూపాయి విలువ పతనం అవుతోంది. మరోవైపు బంగారం ధరలు పడిపోతున్నాయి. ఇది అందరినీ ఆశ్చర్యపరుస్తున్నాయి. రూపాయి పతనం అయితే బంగారం విలువ పెరగాలి. కానీ తగ్గుతుంది. ప్రస్తుతం 10 గ్రాముల బంగారం ధర రూ.1.47 లక్షల నుంచి రూ.1.55 లక్షల మధ్య ట్రేడ్ అవుతోంది. కిలో వెండి ధర ఒకదశలో రూ.3 లక్షలు దాటింది. కానీ ప్రస్తుతం రూ.2.35 లక్షలుగా ఉంది. కొన్ని ప్రాంతాల్లో రూ.2.15 లక్షలకు పతనమైంది. ఈ హెచ్చుతగ్గులు రిటైల్ కొనుగోలుదారులు, ఇన్వెస్టర్లకు ఇబ్బందిగా మారాయి.

**ఫెడ్ రేట్ స్థిరీకరణ ప్రభావం..**

అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లను స్థిరీకరించడం బంగారం మార్కెట్‌పై ప్రధానంగా ఒత్తిడికి కారణం. ఈ నిర్ణయం డాలర్ బలోపేతానికి దారితీసి, బంగారం వంటి సేఫ్-




హేవెన్ ఆస్తుల ఆకర్షణ తగ్గింది. ఇన్వెస్టర్లు బాండ్లు, స్టాక్స్ వైపు మళ్లారు. భారతదేశంలో ఢిల్లీ, ముంబై లాంటి మార్కెట్లలో ఈ ప్రభావం స్పష్టంగా కనిపిస్తోంది.

**సప్లయ్ పెరగడంతో..**

చేతిలో డబ్బులు లేకపోవంతో ఇప్పటికే బంగారంపై పెట్టుబడి పెట్టినవారు ఇప్పుడు అమ్మేస్తున్నారు. దీంతో మార్కెట్‌లో సప్లయ్ పెరిగింది. ఫలితంగా ధరలు తగ్గుతున్నాయి. దీంతో కొనుగోలు ఆసక్తిని తగ్గించింది. ఫలితంగా ధరలు మరింత పతనమవుతున్నాయి. ఈ విక్రయాలు ముఖ్యంగా ఫెస్టివల్ సీజన్ తర్వాత పెరిగాయి.

**రికవరీ సూచనలు**

అంతర్జాతీయంగా భౌగోళిక ఉద్రిక్తతలు, ద్రవ్యోల్బణ ఆందోళనలు బంగారానికి మద్దతుగా నిలుస్తాయని నిపుణులు అంచనా. వెండి మార్కెట్ ఇండస్ట్రియల్ డిమాండ్‌తో (సోలార్, ఎలక్ట్రానిక్స్) బలపడవచ్చు. అయితే, ఫెడ్ తదుపరి చర్యలు, భారత జీడీపీ గ్రోత్ కీలకం. డబ్బులు సమృద్ధిగా ఉన్నవారు ఈ తక్కువ ధరలను అవకాశంగా చూసి కొనుగోలు చేయవచ్చు. దీర్ఘకాల లాభాల కోసం. అప్పులు చేసి రిస్క్ పెంచుకోవద్దు. ఇప్పుడు కొంటే రాబోయే రోజుల్లో ధర మళ్లీ పెరుగుతుందని ఆర్థిక నిపుణులు అంచనా వేస్తున్నారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
21.03.2026 శనివారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



**లక్ష్యాలను నిర్ణయించుకోవడం**

చిన్న చిన్న లక్ష్యాలను పెట్టుకుని వాటిని చేరుకోవడానికి కృషి చేయండి. ఇది మీలో నమ్మకాన్ని పెంచి ముందుకు నడిపిస్తుంది.





# గ్యారెంటీ మోసం

- ప్రభుత్వాన్ని అసెంబ్లీలో ఎండగడతాం
- బాకీ కార్డులతో కాంగ్రెస్ మోసం
- ఆరు గ్యారెంటీల అమలు వైఫల్యంపై గన్ పార్క్ వద్ద బీఆర్ఎస్ నిరసన

**ముద్ర, తెలంగాణ బ్యూరో :** బడ్జెట్ ప్రవేశపెట్టిన సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వ హామీల వైఫల్యంపై ప్లకార్డులతో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు నిరసన చేపట్టారు. కాంగ్రెస్ ఇచ్చిన "బాకీ కార్డులు" ప్రదర్శిస్తూ ప్రజలను మోసం చేసిన విధానాన్ని బీఆర్ఎస్ ప్రజా ప్రతినిధులు ఎండగట్టారు. గన్ పార్క్ వద్ద బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీష్ రావు, శాసనసభ్యులు, శాసనమండలి సభ్యులు కలిసి నిరసన తెలిపారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయకుండా తెలంగాణను ఆగం చేశారని ఆరోపణలు చేశారు. దివ్యాంగులకు బాకీ పడ్డ రూ.54,000 ఎక్కడ అని నిలదీశారు. నిరుద్యోగులకు హామీ ఇచ్చిన రెండు లక్షల ఉద్యోగాలు ఎక్కడ? నిరుద్యోగ భృతి ఏమైంది? అంటూ ప్రశ్నించారు. ఆటో డ్రైవర్లకు ఇస్తామని చెప్పిన రూ.24,000లో, సంవత్సరానికి రూ.12,000 చొప్పున రెండు సంవత్సరాలుగా బాకీ ఉందని విమర్శించారు. వృద్ధులకు ఇవ్వాల్సిన నెలకు రూ.4,000 చొప్పున మొత్తం రూ.54,000 బాకీ ఎక్కడ అని ప్రశ్నించారు. పేదింటి ఆడ బిడ్డలకు ఇస్తామని చెప్పిన తులం బంగారం ఏమైందని నిలదీశారు. తెలంగాణ రాష్ట్ర సంపాదనను దోచుకుంటూ రాష్ట్ర ప్రజలను గాలికి వదిలేసిందని కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. ఈ మోసాన్ని నిలదీయడానికే అమరవీరుల స్తూపం సాక్షిగా ఈ నిరసన చేపట్టాం" అని అన్నారు. "జేమ్స్ బాండ్‌ల మాదిరిగా బాండ్ పేపర్లు రాసిచ్చి, 100 రోజుల్లో హామీలు అమలు చేస్తామని చెప్పి ప్రజలను మోసం చేశారు. ఇప్పుడు మూడో బడ్జెట్‌లో కూడా 'గ్యారెంటీ' అన్న మాట లేకుండా, 'డిక్లరేషన్' అన్న మాట లేకుండా ప్రతి వర్గాన్ని వంచిస్తున్నారు" అని కేటీఆర్ విమర్శించారు. కేటీఆర్ ప్రభుత్వం పై పలు కీలక అంశాలపై ప్రశ్నలు లేవనెత్తారు. బలహీన వర్గాలకు లక్ష కోట్ల బడ్జెట్ ఇస్తామని చెప్పి, మూడు బడ్జెట్లు కలిపినా 20 వేల కోట్లకు మించకుండా కేటాయించడాన్ని ప్రశ్నించారు. వృద్ధులు, వితంతువులు ఎదురుచూస్తున్న రూ.4,000 పెన్షన్ ఎప్పుడు ఇస్తారో చెప్పాలని డిమాండ్ చేశారు. మహిళలకు 18 ఏళ్లు నిండిన కోటి 58 లక్షల మందికి ఇస్తామని చెప్పిన రూ.2,500 మహాలక్ష్మి పథకం ఏమైందని ప్రశ్నించారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 5 లక్షల దివ్యాంగులకు రూ.6,000 పెన్షన్ హామీ అమలు చేయాలన్నారు. రైతులకు రైతు భరోసా పేరుతో రూ.15,000 ఇస్తామని చెప్పి, ఇప్పటికే ఉన్న రైతుబంధునే అమలు చేయడంలో విఫలమయ్యారని విమర్శించారు. సంక్రాంతికి రావాల్సిన డబ్బులు ఉగాది దాటినా రాకపోవడం ప్రభుత్వ వైఫల్యమని అన్నారు. ఉద్యోగాల విషయంలో రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి కేవలం 11,900 ఉద్యోగాలు మాత్రమే ఇచ్చారని, ఇది యువతను మోసం చేయడమేనని పేర్కొన్నారు

# మోసం.. దగా.. ప్రజా వంచన..

- కాంగ్రెస్ బడ్జెట్‌పై బండి సంజయ్ విమర్శలు
- 6 గ్యారెంటీలకు పాడె కట్టే బడ్జెట్ అంటూ తీవ్ర ఆగ్రహం



**ముద్ర, హైదరాబాద్ బ్యూరో:** తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2026–27 వార్షిక బడ్జెట్‌పై కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. ఈ బడ్జెట్ పూర్తిగా "మోసం, దగా, ప్రజా వంచన"తో నిండిపోయిందని ఆయన అభివర్ణించారు. అంకెల ఆర్భాటం, కేటాయింపుల ప్రగల్భాలు తప్ప ప్రజలకు ఉపయోగపడేదేమీ లేదని అన్నారు. రాష్ట్ర ఆదాయాన్ని పెంచుతున్నట్లు చూపిస్తూ మరో లక్ష కోట్ల రూపాయల అప్పు భారాన్ని మోపేందుకు ప్రభుత్వం సిద్ధమవడం సిగ్గుచేటని మండిపడ్డారు. ఇది కాంగ్రెస్ ప్రభుత్వ మూడో బడ్జెట్ కాగా, రాష్ట్రాన్ని భ్రష్టుపట్టించే హ్యాట్రిక్ సాధించిందని విమర్శించారు. కేంద్రంపై ఆధారపడటం తప్ప రాష్ట్ర ప్రభుత్వం స్వయంగా ఏ అభివృద్ధి చర్యలు చేపట్టలేదని ఆరోపించారు. రైతు భరోసా కింద ఇవ్వాల్సిన సాయాన్ని రెండు విడతల్లో కూడా ఎగ్గొట్టారని, కౌలు రైతులు, వ్యవసాయ కూలీలకు రూపాయి సహాయం కూడా అందలేదని చెప్పారు. మహిళలకు హామీ ఇచ్చిన తులం బంగారం, నెలకు రూ.2500 సాయం ఎక్కడా కనిపించలేదని, వృద్ధులకు పెన్షన్ పెంపుపై కూడా ప్రస్తావనే లేకపోవడం దురదృష్టకరమన్నారు. నిరుద్యోగ భృతి అంశం పూర్తిగా పక్కన పెట్టారని, విద్యార్థులకు రూ.5 లక్షల భరోసా కార్డుపై ఒక్క రూపాయి కేటాయింపులు చేయలేదని విమర్శించారు. ఆరు గ్యారంటీల అమలు ప్రశ్నార్థకమైందని, ఈ బడ్జెట్ వాటికి పాడె కట్టే విధంగా ఉందన్నారు. ఆరోగ్యశ్రీ కేటాయింపుల కంటే గత బకాయిలే ఎక్కువగా ఉన్నాయని, విద్యకు కేవలం 8 శాతం నిధులు కేటాయించడం సరైనది కాదని పేర్కొన్నారు. దేవాదాయ శాఖకు ఈసారి కేటాయింపులు లేకపోవడం, పుష్కరాలకు తక్కువ నిధులు ఇవ్వడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. బీసీలకు తక్కువ కేటాయింపులు, ఎస్సీ, ఎస్టీలకు అన్యాయం జరిగిందని, మైనారిటీలకు మాత్రం అధిక నిధులు కేటాయించడం విచిత్రమని అన్నారు. దావోస్, గ్లోబల్ సమ్మిట్ పేరుతో పెట్టుబడులు తెచ్చామని ప్రభుత్వం చెబుతుండగా, వాటి వివరాలు వెల్లడించాలన్నారు. ఇంకా రెండేళ్లలో పదవి కోల్పోయే పరిస్థితి ఉందని తెలిసి ప్రభుత్వం నిర్లక్ష్యంగా అప్పులు చేస్తోందని విమర్శించారు. భవిష్యత్తులో బీజేపీ అధికారంలోకి వస్తే, గత బీఆర్ఎస్ మరియు కాంగ్రెస్ ప్రభుత్వాల అప్పులపై పూర్తి స్థాయి విచారణ చేపడతామని బండి సంజయ్ హెచ్చరించారు.

# మావోయిజం నిర్మూలనకు తెలంగాణ ఆదర్శం

- అసెంబ్లీలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క
- అసమానతలే మావోయిజం మూలం
- సంక్షేమంతోనే పరిష్కారం
- 732 మంది మావోయిస్టులు లొంగుబాటు
- ఉపాధితో ప్రధాన ప్రవాహంలోకి
- ఫ్యూడలిస్టిక్ సామాజిక, ఆర్థిక అసమానతులను రూపుమాపితేనే ఉద్యమం అంతం



**ముద్ర, తెలంగాణ బ్యూరో :** నక్సలిజం పుట్టుకకు కారణమైన ఫ్యూడలిస్టిక్ సామాజిక, ఆర్థిక అసమానతులను రూపుమాపడం ద్వారానే నక్సలిజం ఉద్యమం అంతం అవుతుందని ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క్ అభిప్రాయపడ్డారు. సమగ్ర సంక్షేమం, ఉపాధి ద్వారానే నిజమైన మార్పు సాధ్యమని తెలంగాణ నిరూపించిందని వెల్లడించారు. నక్సలిజం అంతం, లొంగుబాట్లపై అసెంబ్లీ వేదికగా కీలక ప్రకటన చేశారు. ఈ బడ్జెట్‌లో హోంశాఖకు రూ.11,907 కోట్ల కేటాయించినట్టు తెలిపిన భట్టి.. మావోయిస్టుల లొంగుబాట్లపై మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత బీఆర్ఎస్ ప్రభుత్వం హ యాంలో 347 మంది మావోయిస్టులు లొంగిపోతే, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక 2023 డిసెంబర్ 7 నుంచి 2026 మార్చి 8 వరకు 732 మంది మావోయిస్టులు లొంగిపోయినట్లు భట్టి ప్రకటించారు. సరెండర్ అయిన వారికి పునరావాసం కల్పిస్తున్నట్లు తెలిపారు. గత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నక్సలిజాన్ని శాంతి–భద్రతల సమస్యగానే చూశాయని చెప్పారు. ఈ క్రమంలో నక్సలిజాన్ని అణిచివేడానికి పోలీస్, సైనిక బలగాలను ఉపయోగించాయన్నారు. కానీ కాంగ్రె స్ ప్రభుత్వం మాత్రం సమస్య మూలాలను విశ్లేషించి చర్యలు తీసుకుందన్నారు. యువ తకు సరైన జీవనోపాధి, సామాజిక గౌరవం, ఆర్థిక భరోసా అడవుల్లోకి వెళ్లిన వాళ్లు సైతం ఆయుధాలు వీడి జనజీవన స్రవంతిలో కలుస్తారనే సామాజిక ఆర్థిక వాస్తవాన్ని తమ ప్రభుత్వం గుర్తించిందన్నారు. ఈ విధానంలోనే ప్రజా ప్రభుత్వం అనుసరించిన దార్శనిక విధానం దేశానికి ఆదర్శ నమూనాగా నిలిచిందని భట్టి పేర్కొన్నారు.

## 'పిరికిపందలు'

- నాటో దేశాలపై ట్రంప్ ఫైర్!

**ముద్ర డెస్క్ :** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తనదైన శైలిలో మరోసారి అంతర్జాతీయ వేదికపై విమర్శల వర్షం కురిపించారు. ఈసారి ఆయన ఆగ్రహం నాటో సభ్య దేశాలపై మళ్లింది. ఇరాన్‌తో నెల కొన్న ఉద్రిక్తతలు ముఖ్యంగా 'స్ట్రెయిట్ ఆఫ్ హార్ముజ్' వద్ద నెలకొన్న అస్థిరత పై నాటో దేశాల ఉదాసీనతను ఆయన తూర్పారబట్టారు.అమెరికా–ఇజ్రాయెల్ సంయుక్త సైనిక చర్యల నేపథ్యంలో మధ్యప్రాచ్యంలో యుద్ధ మేఘాలు కమ్ముకున్నాయి. దీనికి ప్రతిచర్యగా ఇరాన్ ప్రపంచ చమురు రవాణాకు వెన్నెముక వంటి హార్మూజ్ జలసంధి వద్ద ఉద్రిక్తతలను పెంచింది. "అమెరికా అండ లేకపోతే నాటో కేవలం ఒక 'పేపర్ టైగర్' మాత్రమే. చమురు ధరలు పెరిగాయని గగ్గోలు పెట్టే దేశాలు ఆ సమస్యకు పరిష్కారం చూపేందుకు మాత్రం ముందుకు రావడం లేదు. హార్మూజ్ జలసంధిని సురక్షితంగా మార్చడంలో నాటో దేశాలు పిరికిపందల్లా వ్యవహరిస్తున్నాయి" అని ట్రంప్ విమర్శించారు.

# భారీ కేటాయింపులు

- అంబేద్కర్ నాలెడ్జ్ టవర్‌తో దళిత విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు
- ఎస్సీ, ఎస్టీ సంక్షేమానికి రూ.19,721 కోట్లు
- దివ్యాంగుల వివాహాలకు రూ.2 లక్షల ప్రోత్సాహకం
- ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి




**ముద్ర, హైదరాబాద్ :** దళిత, గిరిజన, అట్టడుగు వర్గాల సాధికారతను కేంద్రబిందువుగా చేసుకుని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దూరదృష్టి, ఆర్థిక మంత్రి మల్లు భట్టి విక్రమార్క సమర్థ నాయకత్వంలో రూపొందించిన 2026–27 బడ్జెట్ సమగ్రాభివృద్ధికి మార్గదర్శిగా నిలుస్తుందని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పేర్కొన్నారు. షెడ్యూల్డ్ కులాలకు రూ.11,784 కోట్లు, షెడ్యూల్డ్ తెగలకు రూ.7,935 కోట్లు కలిపి మొత్తం రూ.19,721 కోట్ల భారీ కేటాయింపులు చేయడం ద్వారా అట్టడుగు వర్గాల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి స్పష్టం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా దళిత సామాజిక మౌలిక వసతుల అభివృద్ధికి రూ.368 కోట్ల 27 లక్షల వ్యయంతో 910 ఎస్సీ కమ్యూనిటీ హాళ్లు, అంబేద్కర్ భవనాలు, విగ్రహాలు మంజూరు చేయడం జరిగిందని వెల్లడించారు. సంక్షేమంలో భాగంగా దివ్యాంగుల వివాహాలను ప్రోత్సహిస్తూ రూ.2 లక్షల నగదు కానుక అందించడం ప్రభుత్వం సామాజిక బాధ్యతను చాటుతున్నదని అన్నారు. ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం రూపకల్పన చేసి రూ.4,000 కోట్లు ప్రతిపాదించడం ఈ బడ్జెట్ ప్రత్యేకతగా పేర్కొన్నారు. అలాగే చేయూత పథకం కింద అర్హులైన వారికి 2 లక్షల కొత్త పెన్షన్లు మంజూరు చేస్తూ రూ.14,861 కోట్లు కేటాయించడం ప్రజల జీవన భద్రతకు పెద్ద అడుగని తెలిపారు. విద్య రంగంలో తెలంగాణ పబ్లిక్ స్కూల్స్‌లో ప్రీ–ప్రైమరీ నుంచి 12వ తరగతి వరకు 1,500 మంది విద్యార్థులకు ఉచిత విద్య అందించేందుకు రూ.500 కోట్లు ప్రతిపాదించామని చెప్పారు. ఆరోగ్య రంగంలో 23.50 లక్షల మందికి నగదు రహిత ఆరోగ్య భద్రత పథకం ప్రవేశపెట్టడం గొప్ప ముందడుగు అని మంత్రి పేర్కొన్నారు. ఉద్యోగులు, పెన్షనర్ల భద్రతకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన స్పష్టం చేశారు. ప్రమాద బీమా పథకం కింద ప్రమాద మరణం సంభవించినట్లయితే రూ.1.20 కోట్లు, టర్మ్ ఇన్సూరెన్స్ కింద రూ.10 లక్షలు, విమాన ప్రమాదంలో అదనంగా రూ.2 కోట్ల కవరేజ్ లభించేలా రూపకల్పన చేయడం జరిగిందన్నారు. ఈ పథకం ద్వారా 7.57 లక్షల ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు ప్రయోజనం చేకూరుతుందని తెలిపారు. ఈ రెండు పథకాల కోసం రూ.1,056 కోట్లు ప్రతిపాదించామని వెల్లడించారు. గత ప్రభుత్వ కాలంలో అధిక వడ్డీతో తీసుకున్న రుణాలను పునర్వ్యవస్థీకరించి రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క కీలక పాత్ర పోషించారని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ కొనియాడారు.

# ఆర్థిక.. ఆరోగ్య భరోసా

- ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా స్పెషల్
- సర్కారు విప్లవాత్మక నిర్ణయం
- ప్రతి కుటుంబానికి 5 లక్షల రక్షణ



**ముద్ర, తెలంగాణ బ్యూరో :** రాష్ట్ర అవతరణ దినోత్సవమైన జూన్ 2వ తేదీని పురస్కరించుకుని తెలంగాణ ప్రభుత్వం ఓ కొత్త పథకాన్ని ప్రారంభించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ పథకం కింద, రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల రూపాయల జీవిత బీమా కల్పిస్తారు.తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సామాన్య ప్రజల జీవితాల్లో వెలుగులు నింపేలా ఒక విప్లవాత్మక నిర్ణయాన్ని ఈ బడ్జెట్‌లో తీసుకుంది. రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి ఆర్థిక రక్షణ కల్పించడమే లక్ష్యంగా 'ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం' అనే పథకాన్ని జూన్ 2, 2026 నుంచి ప్రారంభించబోతున్నట్లు ప్రకటించింది. ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క 2026–27 వార్షిక బడ్జెట్ ప్రసంగంలో ఈ ప్రతిష్టాత్మక పథకాన్ని అధికారికంగా ప్రకటించారు. ఒకేసారి రాష్ట్రంలోని కోటిన్నర మంది ప్రజలకు వర్తించేలా రూపొందించిన ఈ పథకం, భారత్ సామాజిక భద్రతా చరిత్రలోనే ఒక మైలురాయిగా నిలవనుంది.

**జూన్ 2 నుంచి ఈ కొత్త పథకం**

తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవమైన జూన్ 2వ తేదీని పురస్కరించుకుని ఈ పథకాన్ని ప్రారంభించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ పథకం కింద, రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల రూపాయల జీవిత బీమా కల్పిస్తారు. ఒక కుటుంబంలో ఆదాయం సంపాదించే వ్యక్తి దురదృష్టవశాత్తు మరణిస్తే, ఆ కుటుంబం రోడ్డున పడకుండా, ఆర్థికంగా చితికిపోకుండా ఉండాలనే మానవీయ కోణంలో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. మంత్రి భట్టి విక్రమార్క తన బడ్జెట్ ప్రసంగంలో పేర్కొన్నట్లుగా, సంపాదించే వ్యక్తి దూరమైనప్పుడు ఆ కుటుంబం ఎదుర్కొనే మానసిక వేదన ఒకటైతే, ఆర్థిక విపత్తు మరొకటి. అటువంటి విపత్కర పరిస్థితుల్లో అభయహస్తంలా ఈ రూ. 5 లక్షల బీమా మొత్తం ఆ కుటుంబాన్ని ఆదుకుంటుంది అన్నారు. ప్రపంచంలోని మరే ఇతర అభివృద్ధి చెందిన దేశాల్లో కూడా ఇటువంటి సామాజిక భద్రతా పథకం లేదని, ఇంత భారీ స్థాయిలో ఒకేసారి ఒక కోటి 15 లక్షల కుటుంబాలకు బీమా కల్పించడం ఒక రికార్డు అని ప్రభుత్వం అభిప్రాయపడింది.

**అర్హులు ఎవరు?**

సాధారణంగా సంక్షేమ పథకాలు కేవలం దారిద్ర్య రేఖకు దిగువన ఉన్నవారికి మాత్రమే పరిమితమవుతాయి. కానీ, ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం విషయంలో ప్రభుత్వం ఒక సాహసోపేతమైన నిర్ణయం తీసుకుంది. సామాజిక, ఆర్థిక అంతరాలు లేవు. ఈ పథకం వర్తించడానికి పేద, మధ్యతరగతి లేదా ధనిక అనే వ్యత్యాసం లేదు. అన్ని వర్గాలకు వర్తింపు చేయాలని నిర్ణయించారు. సామాజిక అంతరాలతో సంబంధం లేకుండా రాష్ట్రంలోని అన్ని కుటుంబాలకు ప్రభుత్వం ఈ భరోసాను కల్పించనుంది. అంటే రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 1.15 కోట్ల కుటుంబాలు ఈ పథకం కింద రక్షణ పొందనున్నాయి. లబ్ధిదారులను గుర్తించే ప్రక్రియలో ప్రభుత్వం ఇప్పటికే ఉన్న రేషన్ కార్డుల డేటాబేస్, ప్రజా పాలన దరఖాస్తులను ప్రాతిపదికగా తీసుకునే అవకాశం ఉంది. అయితే, ప్రతి కుటుంబం అని ప్రభుత్వం స్పష్టంగా ప్రకటించినందున, రాష్ట్రంలోని ప్రతి రిజిస్టర్డ్ కుటుంబానికి ఈ ఇన్సూరెన్స్ వర్తించేలా మార్గదర్శకాలు రూపొందించే ఛాన్స్ ఉంది.

**ఏ రాష్ట్రాల్లో ఇలాంటి పథకం ఉంది?**

భారతదేశంలోని కొన్ని రాష్ట్రాలు కూడా గతంలో ఇటువంటి బీమా పథకాలను ప్రవేశపెట్టాయి. ఆంధ్రప్రదేశ్ సంపాదించే వ్యక్తి మరణిస్తే బీమా సొమ్ము అందిస్తారు, అయితే ఇది ప్రధానంగా అసంఘటిత రంగ కార్మికులు, పేద కుటుంబాలకు పరిమితం అయ్యింది. కేంద్ర ప్రభుత్వం ప్రధాన్ మంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన, సురక్ష బీమా యోజనలను అమలు చేస్తోంది, కానీ వీటిలో లబ్ధిదారులు స్వయంగా ప్రీమియం చెల్లించాల్సి ఉంటుంది.

**తెలంగాణ పథకం ఎందుకు ప్రత్యేకం?**

తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ పథకం ఇతర రాష్ట్రాల కంటే భిన్నమైనది. ఎందుకంటే, ఇది కేవలం ఒక వర్గానికో లేదా కేవలం పేదలకు మాత్రమే కాకుండా, రాష్ట్రంలోని ప్రతి పౌరుడికి ప్రభుత్వం తన సొంత ఖర్చుతో బీమా కల్పించనుంది. రాష్ట్రంలో పుట్టడం, ఇక్కడ జీవించడం ఒక వరంగా భావించేలా ప్రభుత్వం ఈ భద్రతను కల్పిస్తోందని మంత్రి పేర్కొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
www.mudranews.in
@mudranews
mudratv
21.03.2026 శనివారం, హైదరాబాద్



నా తెలంగాణ కోటి రతనాల వీణ అన్నాడు 'దాశరథి'.. నైజాం పాలనలో 'బండెనక బండి కట్టి'.. పాటలతో ఉద్యమాన్ని రగిలించిన నేల ఇదీ.. తెలంగాణ రక్తంలోనే కవిత్వం ఉంది.. కవులు, కళాకారులకు ఈ నేల పుట్టినిల్లు.. అందుకే మీలోని రచయితను మేల్కొలపండి.. కవితలు, వ్యాసాలు, సంపాదకీయాలు ఏవైనా సరే.. మేం ప్రచురిస్తాం.. మన 'ముద్ర'లో ఎడిటోరియల్‌గా మీ భావాలను వ్యక్తీకరించండి..

మీ 'ముద్ర' వేయండి

మీ రచనలు పంపాల్సిన వాట్సాప్ నం.: +91 98496 23744
అలాగే ఈ-మెయిల్ కూడా చేయొచ్చు: mudradaily@gmail.com



## శారీరక మానసిక క్షీణతకు చెందిన వ్యాధి

# 'డౌన్ సిండ్రోమ్'

**(21 మార్చి "ప్రపంచ డౌన్ సిండ్రోమ్ దినం" సందర్భంగా)**

క్రోమోజోమ్స్‌లో లోపం వల్ల కలిగే శారీరక మానసిక క్షీణతకు చెందిన వ్యాధిగా "డౌన్ సిండ్రోమ్"ను పిలుస్తున్నాం. బ్రిటీష్ వైద్యుడు జాన్ లాంగ్డన్ డౌన్ కృషి ఫలితంగా వివరించబడిన ఈ ప్రత్యేక వ్యాధికి డౌన్ జ్ఞాపకార్థం "డౌన్ సిండ్రోమ్"గా నామకరణం చేశారు. డౌన్ సిండ్రోమ్ వ్యాధిగ్రస్తుల్లో క్రోమోజోమ్స్ 21లో రెండేసి పోగులు ఉండడానికి బదులు అసాధారణంగా మూడు ఉండడం వల్ల దీనిని 'ట్రైసోమీ'గా పిలుస్తారు. ఇలాంటి వారిలో సాధారణంగా ఐక్యూ 100కి బదులుగా వీరిలో 50 వరకు మాత్రమే ఉంటూ శారీరక మానసిక అభివృద్ధి కుంటుపడుతుంది. ఈ వ్యాధిని తల్లి గర్భంలోనే గుర్తించే టెక్నాలజీ ఉండడంతో నేటి వైద్యులు అబార్షన్‌ను కూడా సూచించడం చూస్తున్నాం. డౌన్ సిండ్రోమ్‌తో బాధపడుతున్న వయోజనులు కూడా 10 ఏండ్ల లోపు పిల్లల వలె ప్రవర్తించడం గమనించవచ్చు.

**ఐక్యతతో ఒంటరితనాన్ని ఓడిద్దాం:**

జీవితాంతం శాపంగా మారగల ఈ వ్యాధి పట్ల ప్రజల్లో అవగాహన కలిగించడానికి ప్రతి ఏట 21 మార్చిన "ప్రపంచ డౌన్ సిండ్రోమ్ దినం"గా పాటించడం 2012 నుంచి కొనసాగుతున్నది. ప్రపంచ డౌన్ సిండ్రోమ్ 2026 ఇతివృత్తంగా "ఒంటరితనానికి వ్యతిరేకంగా ఐక్య పోరాటం" అనే అంశాన్ని తీసుకొని అవగాహన కల్పిస్తున్నారు. డౌన్ సిండ్రోమ్ వ్యాధిగ్రస్తుల్లో 33 శాతం వరకు న్యూరోలాజికల్ సమస్యలు, 50 శాతం రోగుల్లో వినికిడితో పాటు దృష్టి దోషాలు నమోదు అవుతున్నాయి.

**డౌన్ సిండ్రోమ్ వ్యాధి లక్షణాలు - చికిత్స మార్గాలు:**

డౌన్ సిండ్రోమ్ వ్యాధిగ్రస్తుల్లో మానసిక క్షీణత, శారీరక పెరుగుదల తగ్గడం, చిన్న చేతులు/గడ్డం/మెడ/చెవులు, మాట తడబడడం, పెద్ద నాలుగ, అసాధారణ చెవులు, మెడ వెనుక చర్మం పెరుగుదల, కండరాల బలహీనత, పుట్టుకతో గుండె జబ్బులు లాంటి లక్షణాలు కనిపుస్తాయి. కొంత మందిలో గుండె జబ్బులు, క్యాన్సర్, ఎండోక్రైన్, దంత లోపాలు కనిపిస్తూ, సంతానోత్పత్తి కూడా మందగిస్తుంది. ఈ వ్యాధి నిర్ధారణకు క్రోమోజోమ్స్ విశ్లేషణ, ఎక్స్ రే, రక్త పరీక్షలు, క్వాడ్ స్క్రీన్, అల్ట్రా సౌండ్, డిఎన్ఎ పరీక్షలు చేస్తారు. బాల్యం నుంచి సక్రమ కుటుంబ వాతావరణం, వైద్య చికిత్సలు, ఆరోగ్య పరీక్షలు, కొన్ని పనుల్లో శిక్షణలు ఇవ్వడం వల్ల వ్యాధిగ్రస్తుల్లో కొంత శారీరక మానసిక అభివృద్ధి మెరుగుపడవచ్చు. పిల్లలకు విద్యను అందించడంతో పాటు అవసరమైన జాగ్రత్తలు తీసుకోవడంతో రోగుల్లో సమస్యలు కొంత వరకు తగ్గుతాయని తెలుసుకోవాలి. జన్మతః సంక్రమించే ఈ వ్యాధిగ్రస్తులను తల్లి గర్భంలోనే గుర్తిస్తూ సరైన వైద్యం లేదా అబార్షన్ పరిష్కారం చూపవచ్చు.

డౌన్ సిండ్రోమ్ ఉచ్చులో చిక్కిన అన్ని వర్గాల అభాగ్య రోగులకు సమాన హక్కులు, వైద్య ఆరోగ్య సహాయాలు, విద్య, గౌరవ మర్యాదలు కల్పించే విధంగా పౌర సమాజం మేల్కొనాలి. ప్రతి వెయ్యి మంది శిశువుల్లో ఒకరు ఇలాంటి సమస్యలతో జన్మిస్తున్న కారణంగా పుట్టక ముందే గుర్తించే ప్రయత్నాలు చేస్తే చక్కటి పరిష్కారాలు చూపవచ్చని తెలుసుకుందాం, ఈ రోగుల పట్ల గౌరవ మర్యాదలు ప్రదర్శిద్దాం.

డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037







# కుంభ వర్షం కురిసినా బోర్లించిన కుండలో నీరు నిలువదు

మీరు ఏం చేసినా ఏం చేయకపోయినా మీ చుట్టూ వున్న వారు, మీ సమీప బంధువులు సూటిపోటి మాటలతో మిమ్మల్ని ఓ పట్టాన ఆలోచించుకోనివ్వరు. "ముందు నుయ్యి వెనుక గొయ్యి" అన్నచందంగా మిమ్మల్ని వారి ఈర్ష్యా, అసూయతో కూడిన మాటలతో మీలోని ఆత్మ విశ్వాసాన్ని దెబ్బ తీయాలని ప్రయత్నిస్తూ వుంటారు. అలాంటప్పుడు మీరు బలహీన మనస్తత్వం వున్న వారైతే తప్పకుండ వారి మాటలు మీపై ప్రభావితం చూపి మీరు వేయాల్సిన అడుగులు ముందుకు కదలకుండా ఆగిపోతారు. లేదా మీరు బలమైన సంకల్పం ఉన్నవారైతే ఎవరి మాటల్ని పట్టించుకోకుండా కేవలం మీరు చేయబోయే పని మీదనే దృష్టి కేంద్రీకరించి "లక్ష్యం" చేరే వరకు మీ చుట్టు పక్కల నుండి వచ్చే ఎలాంటి అంతరాయాలను పట్టించుకోరు. చివరికి మీ ముందున్న "లక్ష్యం" నెరవేరి అంతకుముందు మీ ప్రయాణంలో మీ పై రాళ్ళు వేసినవారందరి నోళ్ళు మీ "సక్సెస్" ద్వారా నోరు మూయిస్తారు. ఇక మీపై విమర్శలు చేసే వారికి వారి నోటికి "తాళం" పడుతుంది. నేనైతే మొదటి రకం వ్యక్తుల కంటే రెండవ రకం వ్యక్తులకే ప్రాధాన్యత ఇస్తాను. ఎందుకంటే అలాంటి వారి వల్లనే సమాజంలో నేడు ఇంత ప్రగతిశీలమైన మార్పు సంభవించిందని చెప్పగలను. లేకపోతే ఈ రెండవ రకం వారు కూడా మొదటి రకం వారి మాదిరిగానే విమర్శకుల మాటలకు భయపడితే మరి విజయం సాధించేది ఎవరు.

సమాజం నిత్య చైతన్యమైనది. మీరు కాలాన్ని పట్టుకొని నియంత్రించలేరు. కాని కాలాన్ని మాత్రం మీరు తప్పకుండా ఉపయోగించుకోగలరు. ఓ చరిత్ర నిర్మించి రాబోయే తరాల వారికి పాఠమై నిలబడగలరు. ఇక్కడ చరిత్రలో నమోదుకాబడిన ఓ యుద్ధం (హల్దీ ఘాట్ యుద్ధం) గురించి ప్రస్తావిస్తాను 1576 జూన్ - 18న మొఘల్ చక్రవర్తి అక్బర్ మరియు మేవార్ రాజు రాణా ప్రతాప్ సింగ్ మధ్యన జరిగింది. ఈ యుద్ధంలో అక్బర్ సైన్యం పదివేలు రాణా ప్రతాప్ సింగ్ సైన్యం మూడు వేలు. అంతిమంగా జరిగింది ఏమిటంటే రాణా ప్రతాప్ సింగ్ "ఆత్మ విశ్వాసం" ముందు అక్బర్ సైన్యం మానసికంగా ఓడిపోయింది. కాని రాణా ప్రతాప్ సింగ్ అక్బర్ ముందు లొంగిపోకుండా చాకచక్యంగా తప్పించుకొని ఆరావళి పర్వతాల్లో తలదాచుకొని తిరిగి సైన్యాన్ని కూడదీసుకున్నాడు. ఇక్కడ మీరైతే ఏం చేస్తారు చెప్పండి. శరణార్థిగా మారి ఖైదీగా పట్టుబడతారు లేదా యుద్ధానికి ముందే లొంగిపోతారు. చరిత్రలో ఇలా చెప్పుకుంటూపోతే నేతాజీ, భగత్ సింగ్, ఆజాద్, ఇలా ఎంతోమంది వారి ముందున్న కర్తవ్యాన్ని పూర్తి చేశారు తప్ప ఎక్కడా రాజీ పడలేదు. మీకు కూడా ఇలాంటి వ్యక్తిత్వమే వుండాలంటాను కాదంటారా చెప్పండి.

మీ లాంటి మనస్తత్వం వున్న వారికి వర్తించే ఓ కథను చదవండి. ఒకరోజు తండ్రి కొడుకు పొరుగు ఊరికి వెళ్ళి ఓ గుఱ్ఱాన్ని ఖరీదు చేసుకొని వస్తున్నారు. కొద్ది దూరం గుఱ్ఱంతో కలిసి నడిచిన ఇద్దరు, (పిల్లవాడు దాదాపు 1012 సం.రాల వయసువాడు) ఎండ వల్ల ఇద్దరూ అలిసి పోయే స్థితికి వచ్చారు. తండ్రి ఓ ఆలోచన చేసి పిల్లవాడిని గుఱ్ఱం పై



కూర్చోబెట్టి తను మాత్రం నడుస్తూ గుఱ్ఱంతో పాటు కొద్ది దూరం ప్రయాణిస్తారు. మార్గ మధ్యలో తండ్రి కొడుకులకు ఇద్దరు యాత్రికులు తారసపడుతారు. అందులో ఒకడు తండ్రీ కొడుకులనుద్దేశించి పిల్లవాడు ఎంత అజ్ఞాని తండ్రిని (వృద్ధుడిని) కింద నడిపిస్తు తను మాత్రం గుఱ్ఱంపై "దర్జాగా" స్వారీచేస్తున్నాడని "హేళన" చేస్తారు. ఆ మాటలకు పిల్లవాడి స్వాభిమానం గాయపడుతుంది. వెంటనే గుఱ్ఱంపై నుండి కిందికి దిగి నాన్నగారు తమరు గుఱ్ఱంపై కూర్చోండి నేను గుఱ్ఱంతో పాటు నడుస్తాను అని తండ్రిని గుఱ్ఱంపై కూర్చోబెట్టి తను గుఱ్ఱాన్ని అనుసరిస్తాడు. అలా కొద్ది దూరం వెళ్ళాక బాటలో వీరికి మరికొద్ది మంది ఎదురౌతారు. ఆ సమూహంలో ఒకడు వీరినుద్దేశించి తండ్రి ఎంత మూర్ఖుడు అభం శుభం తెలియని పసిపిల్లవాడిని కింద నడిపిస్తు తను మాత్రం గుఱ్ఱంపై దర్జాగా కూర్చొని స్వారి చేస్తున్నాడు అంటూ హేళనతో కూడిన మాటలు అంటాడు.

ఈ మాటలు విన్న పిల్లవాడి తండ్రి ఆత్మ విమర్శలో పడి సరే నేను కూడా గుఱ్ఱంపై నుండి దిగి పిల్లవాడితో పాటు నడుస్తానని గుఱ్ఱం కళ్ళెం చేతిలో పట్టుకొని ఇద్దరూ నడుస్తూ ఉంటారు. కొద్ది దూరం వెళ్ళాక మరొక సమూహం వీరికి ఎదురైంది. ఈ సారి సమూహంలో వున్న వారందరు గుఱ్ఱాన్ని నడిపించుకొని వెళ్తున్న ఇద్దరినీ చూసి ఎలాంటి "మూర్ఖులు" వీరు గుఱ్ఱంను ఖాళీగా వుంచి ఇద్దరూ దానితో పాటు నడుస్తున్నారు. ఎంచక్కా గుఱ్ఱంపై కూర్చొని స్వారి చేయవచ్చు కదా!? అంటూ ఆట పట్టిస్తారు. ఆ మాటలు విన్న తండ్రీ కొడుకులు ఇద్దరు కలిసి గుఱ్ఱంపై కూర్చొని ఊరికి వెళదాం అని గుఱ్ఱంపై కూర్చొని కొద్ది దూరం వెళ్ళాకా ఒక వ్యక్తి వీరికి తారసపడుతాడు. అతడు వీరిద్దరిని ఉద్దేశించి అరే మీరు ఇద్దరు కల్సి ఈ గుఱ్ఱాన్ని చంపాలనుకుంటున్నారా? ఇద్దరి బరువు గుఱ్ఱంపై వేస్తారా ? పైగా ఇంత వేడిగా వున్న సమయంలో గుఱ్ఱం ఇద్దరి బరువును తట్టుకుంటుందా ? అని ప్రశ్నిస్తాడు. ఆ మాటలు విన్న ఇద్దరు (తండ్రీ - కొడుకు) గుఱ్ఱంపై నుండి దిగి ఓ చెట్టు నీడలోకి వెళ్లి సేద దీరుతు ఆలోచనలో పడిపోతారు.

ఇప్పుడేం చేయాలో తోచదు వారికి. సమాజం ఏ రకంగా వున్నా హాయిగా బ్రతకనివ్వదు. తండ్రి సమయస్ఫూర్తితో విషయం అర్థం చేసుకొని కొడుకుతో "ఈరోజు నుండి నా మాటల్ని శ్రద్ధగా మనసులో పెట్టుకో ఎల్లప్పుడు మన మనస్సు ఏం చెపుతుందో అదే వినాలి అలాగే నడుచుకోవాలి. అంతేకాని ఇతరుల (సమాజం) మాటలు వింటే ఎప్పటికి నీ లక్ష్యం చేరుకోలేవు అలాగే ఇలాంటి వారి వల్ల మనసు వికలమైపోతుంది తప్ప ప్రగతిశీలమైన అడుగులు ముందుకు వేయలేము" అంటాడు. ఈ మాటలు కొద్దిమందికి సరిగ్గా అనిపించవచ్చు. మరికొద్ది మందికి తప్పుగా అనిపించవచ్చును. కాని మీరు ఒకవేళ వినాల్సి వస్తే అందరి మాటలు వినండి. కాని మీ అంతరాత్మ ఏం చెబితే అదే చేయండి. గుఱ్ఱం మీద మనం ఇద్దరం కూర్చున్నప్పుడు గుఱ్ఱానికి బాధలేదు. ఈదారి గుండా వస్తున్న వారికి ఎందుకు? అంటూ గుఱ్ఱానికి నీళ్ళు త్రాగించి ఇద్దరూ కలిసి గుఱ్ఱంపై కూర్చొని వేగంగా స్వారీచేస్తు ముందుకు కదులుతారు. ఈసారి ఎవరి మాటలు పట్టించుకోలేదు ఎటువైపు చూడలేదు. కేవలం వారు చేరాల్సిన "లక్ష్యంపై" మాత్రమే శ్రద్ధ పెట్టారు. రెండు గంటల తర్వాత వారు వారి ఇంటిని చేరుకుంటారు. ఇలాంటి అనుభవం మీకు ఎక్కడో చోట, ఏదో ఒక సందర్భంలో మీరు ఏదైనా పని చేస్తున్నప్పుడు బహుశా ఇలాంటి మాటలే విని వుంటారు. ఇప్పుడాలోచించండి ఆత్మ విశ్వాసంతో అడుగులు వేయండి ఎన్ని అవరోధాలైన సులువుగా అధిగమించి మీ "లక్ష్యం" చేరుకోండి.

దీని కోసం ముందుగా మీలో వున్న ఈ శక్తిని మేల్కొల్పవలసి వుంటుంది. అది మీలో ఉన్నదే. మీరు ఏ వర్గం వారైనా సరే అవివేకపు ఆలోచనలు చేయకుండా మీ దారిలో మీరు నడిస్తే ఖచ్చితంగా మీ ప్రయాణం గెలుపుతో ముగుస్తుంది. ఎలాగంటారా ఈ చరాచరా జగత్తు ఏ సూత్రం లేకుండానే నడుస్తుందంటారా చెప్పండి? ఉదయం సాయంత్రాలు ఎలా అవుతున్నాయో ఓసారి పరిశీలించండి. మీరు అంతే. కాలంతో పాటు మీరు పరుగులు పెట్టాలి. మీ మెదడును పరుగులు పెట్టించాలి. అంతే కాని ఎవరో ఏదో అన్నారని అక్కడే నిలబడిపోతే ఎప్పటికి మీరనుకుంటున్న లక్ష్యం చేరలేరు కాదంటారా? మీలో వున్న మీ "ఆత్మ విశ్వాసమే" మిమ్మల్ని బలంగా ముందుకు నడిపిస్తున్నప్పుడు ఇంకా ఇతరుల మాటలతో ఏం పని. చాలా మందికి ఈ ఆత్మ విశ్వాసం లోపించటం మూలంగానే మధ్యలోనే వారి లక్ష్యాన్ని వదిలివేస్తారు. "కుంభ వర్షం కురిసినా బోర్లించిన కుండలో నీరు నిలువనట్లే ఆత్మ విశ్వాసం లేనివాడ విశ్వమంతా తిరిగినా వీసమెత్తు సాధించలేడు". అన్నట్లుగా మిమ్మల్ని మీరు నమ్మండి. మీ ఆత్మ విశ్వాసంపై నమ్మకం వుంచండి అంతే అన్నీ మీకు అనుకూలంగా జరుగుతూ వుంటాయి. మీ సంకల్పం గట్టిదైతే మార్గం సులభమై కాలం కూడా ఖచ్చితంగా సహకరిస్తుంది కాకపోతే ప్రయత్నం చేసి చూడండి. ఇలా ఎవరైతే ముందుకు నడుస్తారో వారి జీవితంలో ఖచ్చితంగా ఉషోదయపు వెలుగులు విరజిమ్ముతాయి.

మీ పరిసరాలు మొత్తం వెలుగులతో నిండి వున్నప్పుడు కేవలం మీ ఇంట్లోనే చీకటి వుందంటే లోపం ఎక్కడుందో ఆలోచించండి. అంటే లోపం మీలోనే వుందని గుర్తించండి. దానిని సరి దిద్దుకోండి. చాలామంది తమను తాము రాజీపడి బ్రతుకుతూ ఉంటారు. అందుకే వారు జీవితంలో ఏమి సాధించలేరు. ఎదురుగా వున్న అవకాశాలను పసిగట్టి కూడా పొందలేక నిరాశలోకి జారిపోతారు పట్టుకోవడానికి ప్రయత్నం చేయలేక డీలాపడిపోతారు. అసలు "ప్రయత్నమే చేయనప్పుడు విజయం ఎలా సిద్ధిస్తుంది" చెప్పండి. మీ మెదడులో చక్కని ప్రణాళిక లేకపోతే మీరు ఏం ఆశించినా ఫలితం మీకు అనుకూలంగా వుండదు. ఓ రాయిని మీరు విగ్రహంగా చెక్కాలంటే మీకు దాని మీద పూర్తి అవగాహన వుండాలి మెదడులో "చక్కని భావం" స్థిరపడిపోవాలి ఎలాంటి రూపురేఖలు ఉండాలో ముందే నిర్ణయించుకోవాలి. లేనిపక్షంలో మీరు ఉలితో కొట్టే దెబ్బల తీవ్రత ఎక్కువైతే విగ్రహం రూపురేఖలు మారిపోవచ్చు. అందుకే ఆలోచన చేయకుండా అడుగు ఎలా ముందుకు పడుతుంది. (కొద్దిమందికి ఇలా అనిపిస్తుంది) రోజంతా ఏదోకటి చేయండి. ఏదో ఒక దాంట్లో విజయం సాధిస్తారని అనుకుంటారు. కాని అది ఎంత మాత్రం ఆమోదయోగ్యమైన ఆలోచనా విధానం కాదు.

అందుకే మీరు ఏం కావాలనుకుంటున్నారో, దానిని చేరడానికి కావాల్సిన "మార్గాలు" ఏమిటో ఎలా ఐతే మీరు అనుకుంటున్న లక్ష్యం చేరుకుంటారో కొద్దిసేపు ఆలోచించి అడుగులు వేయండి. అంతేకాని ఇతరుల మాటలు వినకండి, మీ అంతరాత్మను నమ్మండి అది ఏం చెబితే దాని ప్రకారం నడవండి. అందుకే "మీ దృష్టి స్పష్టంగా వుంటే శిల ఐనా శిల్పంగా మారుతుంది". ఎంతటి కఠినమైన "లక్ష్యం" ఐనా మీ ముందు తలవంచుతుంది కాదంటారా చెప్పండి? ఆత్మ విశ్వాసంతో, బలమైన సంకల్పంతో అడుగులు వేసి ప్రపంచాన్ని గెలవండి.

డా.మహ్మద్ హసన్
అసిస్టెంట్ ప్రొఫెసర్
సెల్:9908059234.



# వనాలు...మానవాళికి రక్షా కవచాలు:

**మార్చి 21 ప్రపంచ అటవీ దినోత్సవం**

ప్రకృతి అందించిన అమూల్య వరాలలో అడవులు అత్యంత ముఖ్యమైనవి. భూమిపై జీవం కొనసాగడానికి అవసరమైన ఆక్సిజన్, వర్షపాతం, జీవవైవిధ్యం అన్నీ అడవులపైనే ఆధారపడి ఉన్నాయి. పర్యావరణ సమతుల్యతను కాపాడుతున్న అడవుల విస్తీర్ణం ఇటీవల ప్రపంచవ్యాప్తంగా తగ్గుతోంది. అందుకే అటవీ పరిరక్షణపై అవగాహన పెంచేందుకు ప్రతి సంవత్సరం మార్చి 21న ప్రపంచ అటవీ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు.

**నేపథ్యం:**

1971లో ఆహార వ్యవసాయ సంస్థ సమావేశంలో ఈ దినోత్సవాన్ని నిర్ణయించగా, 2012లో ఐక్యరాజ్యసమితి అధికారికంగా ప్రకటించింది. 2013 నుండి ప్రతి ఏడాది వివిధ ఇతివృత్తాలతో ఈ దినోత్సవం జరుపుతున్నారు. అడవుల నాశనం వల్ల వర్షపాతం తగ్గి ఎడారీకరణ పెరుగుతోంది.

**2026 థీమ్:**

"అడవులు మరియు ఆర్థిక వ్యవస్థలు" అనే అంశంతో జరుపుతున్నారు. చెక్క, కాగితం, ఔషధాలు, తేనె, బాంబూ వంటి ఉత్పత్తులు కోట్లాది మందికి ఉపాధి కల్పిస్తున్నాయి. ప్రపంచవ్యాప్తంగా సుమారు 1.6 బిలియన్ మంది అడవులపై ఆధారపడి జీవిస్తున్నారు. అడవులు కార్బన్‌ను తగ్గించి వర్షపాతానికి తోడ్పడుతూ, వరదల ప్రభావాన్ని తగ్గిస్తాయి. ప్రపంచంలో 86 మిలియన్ ఉద్యోగాలు అటవీరంగంపై ఆధారపడి ఉన్నాయి.


**సవాళ్లు:**

అటవీ నరికివేత, పట్టణీకరణ, ఖనిజ తవ్వకాలు, అటవీ అగ్నిప్రమాదాలు ప్రధాన సమస్యలు. 1990ల్లో ఏటా 10.7 మిలియన్ హెక్టార్ల అడవులు నశించగా, 20152025లో ఇది 4.12 మిలియన్లకు తగ్గింది. భారత్ అటవీ విస్తీర్ణం పెరుగుతున్న దేశాల్లో ఒకటి అయినా, లక్ష్యమైన 33%కి ఇంకా చేరలేదు.

**ప్రాముఖ్యత:**

అడవులు నీటి శుద్ధి కేంద్రాలుగా పనిచేస్తూ, వరదలు, నేలకోత, తుఫానుల ప్రభావాన్ని తగ్గిస్తాయి. ఆదివాసీ, గిరిజనుల జీవనాధారం కూడా అడవులే.

అడవులు జీవకోటికి ఆధారం, మానవ భవిష్యత్తుకు భరోసా. ప్రభుత్వ చర్యలతో పాటు ప్రజల భాగస్వామ్యం అవసరం. 'చిప్కో' వంటి ఉద్యమాల స్ఫూర్తితో అడవులను సంరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత.



-సుధాకర్.ఏ.వి
రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు
స్టేట్ టీచర్స్ యూనియన్ తెలంగాణ స్టేట్
(STUTS)
9000674747



# కవన గోదారి

**(21 మార్చి 'ప్రపంచ కవిత్వ దినోత్సవం" సందర్భంగా)**

అక్షర క'వన' పూతోటలో..
గుబాళించు భావ
సుగంధాలు
కవితాక్షరం ఓ తీరని దాహం
కవిత్వం ఓ భాషా సృజన
కవిత ఓ మెదడుకు మేత
కవనం ఓ అద్భుత ఆవిష్కరణ
కవనం ఓ అక్షర ఔషధం
కవనం ఓ భావాక్షర క్షీరసాగరం
కవిత్వం ఓ కలుపు తీసే
యంత్రం !
కవి ఓ పౌర సమాజ వైద్యుడు
కవి ఓ అక్షర శ్రామికుడు
కవిత్వ అక్షర ఆయుధాలతో..
దురాగతాల్ని పాతరేయడం
దురాచారాల్ని దులిపేయడం
అక్రమార్కుల భరతం పట్టడం
అవలక్షణాల్ని అడ్డుకోవడం !
దుర్మార్గాల్ని దూగడ పట్టడం
వాస్తవాల్ని కళ్ల
ముందుంచడం
అబద్ధాలపై
కోరడా జులపయడం
అజ్ఞాన చీకట్లను
తరిమేయడం
అవినీతికి తలకొరివి పెట్టడం
చీడపురుగుల్ని ఉతికి
ఆరేయడం
చెడును చెండాడి బొంద
పెట్టడం
అసుర కీచకుల తోలు
తీయడం
మృగాళ్ల అంగం నరికేయడం
!
విజ్ఞాన విందులు
వడ్డించడం
ప్రకృతి అందాల్ని
ఆరబోయడం
మంచికి
పట్టాభిషేకం
చేయడం
మానవీయతకు ప్రాణం
పోయడం
ఐక్యత వృక్షానికి నీరు
పోయడం
శాంతికి కవన గొడుగు
పట్టడం..
అనాదిగా అవిశ్రాంతంగా
జరిగింది
నేడు నిక్కచ్చిగా జరుగుతోంది
రేపు వడివడిగా
జరుగనుంది !

-మధుపాళీ
9949700037



సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
శనివారం 21.03.2026
www.mudranews.in | @mudranews



**వ్యాయామం చేయడం**
రోజు కనీసం 30 నిమిషాలు శారీరక వ్యాయామం చేయండి. ఇది మనసును ప్రశాంతంగా ఉంచి, ఒత్తిడిని తగ్గిస్తుంది.

## స్మశానవాటిక సమస్య పరిష్కరించండి

### సీఎంకు ఎమ్మెల్యే వినతి పత్రం



**ముద్ర, మల్కాజిగిరి:**

మచ్చ బొల్లారం హిందూ స్మశాన వాటిక సమస్యను పరిస్కరించాలని సీఎం రేవంత్ రెడ్డి కిమల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా డంపింగ్ యార్డ్ ను మరో చోటికి తరలించడం కోసం జిల్లా యంత్రాంగం, మున్సిపల్ అధికారులను పలుమార్లు ప్రత్యామ్నాయ స్థలాల కోసం కోరినా, అలాగే హైకోర్టు, జాతీయ మానవ హక్కుల కమిషన్ నుంచి ఆదేశాలు వచ్చినప్పటికీ, ఇప్పటివరకు సమస్యకు సరైన పరిష్కారం లభించలేదని ఎమ్మెల్యే తెలిపారు. దీంతో తానే స్వయంగా ముందడుగు వేసి, జేఏసి నాయకులు, స్థానిక ప్రజలతో కలిసి పలు స్థలాలని పరిశీలించి, డైరీ ఫార్మ్ రోడ్ వద్ద మిలిటరీకి చెందిన ఖాళీ స్థలాన్ని గుర్తించినట్లు తెలిపారు. ఆ స్థలాన్ని చెత్త డంపింగ్ కోసం కేంద్ర ప్రభుత్వంతో బదలాయింపు చేసుకొని, ప్రస్తుతం స్మశానవాటికలో జరుగుతున్న చెత్త డంపింగ్‌ను పూర్తిగా నిలిపివేసి, సుమారు 50 కాలనీల ప్రజలను రక్షించాలని ముఖ్యమంత్రిని అభ్యర్థించినట్లు ఆయన పేర్కొన్నారు. మచ్చ బొల్లారం ప్రజలను చెత్త డంపింగ్ సమస్య నుండి విముక్తి కల్పించేందుకు అన్ని స్థాయిలలో తనవంతు కృషి కొనసాగిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా మచ్చ బొల్లారం జేఏసి నాయకులు, వివిధ కాలనీల ప్రతినిధులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

## డీసీసీలో కృష్ణారెడ్డికి కీలక బాధ్యత

**నాగర్ కర్నూల్, ముద్ర ప్రతినిధి:**



డీసీసీ అధికార ప్రతినిధిగా కృష్ణారెడ్డిని నియమిస్తూ పార్టీ ఉత్తర్వులు జారీ చేసింది. డీసీసీ కమిటీలో తనకు స్థానం కల్పించినందుకు ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్ రెడ్డి, ఎమ్మెల్యే కూచుకుళ్ల రాజేష్ రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు డా. చిక్కుడు వంశీ కృష్ణ, ఎంపీ మల్లురవి ఆశీర్వాదంతో ఈ అవకాశం దక్కిందని కృష్ణారెడ్డి వారికి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతం, ప్రజా సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని అన్నారు.

## 26న ఉచిత కంటి ఆపరేషన్ శిబిరం

**ముద్ర ప్రతినిధి, నాగర్ కర్నూల్:**

జిల్లా కేంద్రంలో ఉచిత కంటి చికిత్స మరియు ఆపరేషన్ శిబిరం ఈ నెల 26న నిర్వహించనున్నారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, జిల్లా అంధత్వ నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఈ శిబిరం జరుగనుంది. పాత కలెక్టరేట్ భవనంలోని గది నెంబర్ 102లో నిర్వహించనున్న ప్రత్యేక కంటి పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా క్యాటరాక్ట్ఆ పరేషన్లు చేయనున్నారు జిల్లాలోని ఏనుగొండలో ఉన్న లయన్ రామ్ రెడ్డి కంటి ఆసుపత్రిలో నిర్వహించబడతాయి. రోగులను ప్రత్యేక అంబులెన్స్ ద్వారా అక్కడికి తరలించనున్నారు. శిబిరానికి హాజరయ్యే రోగులు ముందుగా బీపీ, షుగర్ పరీక్షలు చేయించుకుని రిపోర్టులతో రావాలని సూచించారు. అదేవిధంగా ఆధార్ కార్డు, రేషన్ కార్డు, ఓటర్ ఐడీ వంటి గుర్తింపు పత్రాల జిరాక్స్ కాపీలు, ఫోన్ నెంబర్ తీసుకురావాలని తెలిపారు. మరిన్ని వివరాలకు 9440876556, 7386940480 నంబర్లను సంప్రదించవచ్చు.

## విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు

**జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్**

**ముద్ర, జోగులాంబ గద్వాల ప్రతినిధి:**



అధికారులు, ఇతర సిబ్బంది తమ విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని, కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ హెచ్చరించారు. శుక్రవారం ఐజ పిహెచ్ సి ను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. నిర్లక్ష్యంగా ఉన్న 9 మందికి షోకాజు నోటీసులు ఇవ్వాలని డీఎంహెచ్‌వో సంధ్య కిరణ్మయికి ఫోన్లో ఆదేశించారు. ఒకరిని సస్పెండ్ చేస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలోనే ప్రసవాలు ఎక్కువగా జరిగేలా అవగాహన కల్పించాలని, సబ్ సెంటర్స్ లోను అవసరమైన వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. అనంతరం అయిజ పట్టణంలోని అగ్రోస్ రైతు సేవా కేంద్రాన్ని, ఐజ లోని లక్ష్మీ శ్రీనివాస గ్యాస్ ఏజెన్సీ కార్యాలయాన్ని సందర్శించారు. కేజీబీవీని సందర్శించి అక్కడ వంటగదిలో వండిన పదార్థాలను పరిశీలించి, మెనూ ప్రకారం వంటలు చేయకుంటే తగు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తరగతి గదిలో విద్యార్థులతో మాట్లాడారు. వారికి అందజేస్తున్న ఆహారం, ఇతర సౌకర్యాలపై వాకబు చేశారు. ఏమైనా సమస్యలు ఉంటే విద్యార్థులు తన దృష్టికి తీసుకురావాలని, తప్పకుండా పరిష్కరిస్తామని ఈ సందర్భంగా కలెక్టర్ పేర్కొన్నారు.

## కార్యవర్గం ఎన్నిక

**ముద్ర, తాండూర్:**

వికారాబాద్ జిల్లా తాండూర్ పట్టణంలో నూతన వీర శైవ యువ దళ్ ప్రకటించారు. .గౌరవ అధ్యక్షుడిగా అగ్గనుర్ సంకేత్, అధ్యక్షుడిగా వాలీ వినోద్ కుమార్ బాధ్యతలు స్వీకరించారు.ఉపాధ్యక్షులుగా మద్రికి చంద్రకాంత్, సడిగి వినోద్ కుమార్, బిర్కడ్ శివకుమార్, ప్రధాన కార్యదర్శిగా కోటం త్రిశూల్ సహాయ కార్యదర్శులుగా తుప్పుడు రవి కుమార్, ఫసారం గణేష్, హెరూర్ రాకేష్ ఎంపికయ్యారు.కోశాధికారిగా మడపతి సిద్దయ్య స్వామి ఎంపిక అయ్యారు.అలాగే కార్యవర్గ సభ్యులుగా ఆడికి శ్రీశాంత్, గదిగి కిరణ్ కుమార్, మాడపతి నాగేంద్రప్రసాద్, అన్నారం దినేష్ కుమార్, ముదెళ్ళి ప్రశాంత్, గంగిమళ్ళ మహేష్ కుమార్, గౌనూర్ సందీప్ కుమార్, కెరెళ్ళి రాహుల్, ముత్తిరి వీరేశం, దోమ సతీష్ కుమార్, మఠం జగదీశ్వర్ స్వామి, సుంకరి సందీప్ కుమార్, బిర్కడ్ ప్రమోద్, గాండ్ల వినోద్ కుమార్, గాండ్ల పరమేశ్వర్, బంటారం జగదీశ్వర్, గూళి సైతేష్, కారంజి కార్తీక్, మంచాల నందీశ్వర్ లు ఎంపికయ్యారు.

## రంజాన్ నమాజ్ కు ముస్తాబైన ఈద్గా లు

### నేడే ఈద్ ఉల్ ఫితర్

**ముద్ర ప్రతినిధి, నాగర్ కర్నూల్:**

రంజాన్ ప్రత్యేక నమాజ్ కోసం ఈద్గా లు ముస్తాబయ్యాయి. జిల్లా కేంద్రంలోని శ్రీపురం రోడ్డు నగల ఈద్గా వద్ద మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ప్రతి ఏడాది లాగే ఏర్పాట్లను వక్ఫ్ బోర్డు పర్యవేక్షణలో జరుపుతున్నారు. పెయింటింగ్ తో పాటు పెండాల్ వేయడం నీటి వసతి ఏర్పాటు చేస్తున్నారు.

**పండగను ఆనందంగా జరుపుకోవాలి**

పవిత్ర రంజాన్ పండగను జిల్లాలోని ప్రజలు ఆనందంగా జరుపుకోవాలని నాగర్ కర్నూల్ జిల్లా శాసనసభ్యులు డాక్టర్ రాజేష్ రెడ్డి అన్నారు. ఈద్–ఉల్–ఫితర్



సందర్భంగా ఆయన ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలిపారు.

**రంజాన్ కిట్లు పంపిణీ**

**ముద్ర, తాండూర్:**

వికారాబాద్ జిల్లా తాండూర్ పట్టణంలోని 27వ వార్డులోని నిరుపేద ముస్లిం కుటుంబాలకు రంజాన్ కిట్లను పంపిణీ చేసిన బాలాజీ నర్సింగ్ హోమ్ అధినేత డాక్టర్ సంపత్ కుమార్. టిఆర్ఎస్ నాయకులు కృష్ణ, నాయకులు పాల్గొన్నారు.

## ముగిసిన జాతీయ సేవా పథకం శిబిరం

**ముద్ర ప్రతినిధి, నాగర్ కర్నూల్:**

పాలెం వ్యవసాయ కళాశాల విద్యార్థులు నిర్వహించిన జాతీయ సేవా పథకం ప్రత్యేక శిబిరం ఇంద్రకల్‌లో శుక్రవారంతో విజయవంతంగా ముగిసింది. ఏడు రోజులుగా ఎన్.ఎస్.ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్లు వి. శ్రీరమ్య, ఎన్.నవత పర్యవేక్షణలో శిబిరం క్రమశిక్షణతో సాగింది. ముగింపు వేడుకలకు ముఖ్య అతిథిగా విచ్చేసిన పాలెం వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ కె. సుహాసిని కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమానికి లెక్చరర్లు , విద్యార్థులు సిబ్బంది పాల్గొన్నారు.

## సీడ్ బాల్స్ తయారీ

**ముద్ర ప్రతినిధి, నాగర్ కర్నూల్:**

ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాలలో సీడ్ బాల్స్ తయారీ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ మదన్ మోహన్ తెలిపారు. తెలంగాణ నేషనల్ గ్రీన్ క్రాప్, కళాశాల ఏకో క్లబ్,వృక్ష శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు.

## ఉచిత కంటి వైద్య శిబిరం

**ముద్ర, తాండూర్ :**

యాలాల మండలం అక్కంపల్లి లో లొంక నర్సింహులు యువసేన ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు సర్పంచ్ రాములు తెలిపారు.

## 28లోపు ఎన్నికల ఖర్చు వివరాలు సమర్పించాలి

**ముద్ర ప్రతినిధి, నాగర్ కర్నూల్ :**



మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులందరూ తమ ఎన్నికల ఖర్చుల ఆదాయ–వ్యయ వివరాలను తప్పనిసరి గా సమర్పించాలని మున్సిపల్ కమిషనర్ బి. నాగిరెడ్డి తెలిపారు. గెలిచిన వారు, ఓడిపోయిన వారు అనే తేడా లేకుండా ప్రతి అభ్యర్థి ఎన్నికల లెక్కింపు తేదీ నుంచి 45 రోజుల్లోపు తమ ఖర్చుల వివరాలను రిటర్నింగ్ అధికారికి సమర్పించాల్సి ఉంటుందని తెలిపారు. ఈ నేపథ్యంలో, మీ ఎన్నికల లెక్కింపు తేదీ ఆధారంగా 45 రోజుల గడువు మార్చి 28, 2026తో ముగుస్తుందని అధికారులు స్పష్టం చేశారు. అందువల్ల, అభ్యర్థులు మార్చి 28లోపు తమ ఆదాయ–వ్యయ వివరాలను సమర్పించాలని సూచించారు. గడువు లోపు వివరాలు సమర్పించని పక్షంలో, ఎన్నికల నియ మాల ప్రకారం అభ్యర్థులను అనర్హులుగా ప్రకటించే అవకాశం ఉండడంతో పాటు భవిష్యత్ ఎన్నికల్లో పోటీ చేయడంపై కూడా నిషేధం విధించబడవచ్చని హెచ్చరించారు. ఖర్చుల వివరాలు సమర్పించడానికి అవసరమైన ఫార్మాట్, మార్గదర్శకాలు మున్సిపల్ కార్యాలయం లో అందుబాటులో ఉంటాయని తెలిపారు.

## ఎన్నికల హామీలు అమలు చేయాలి





**ముద్ర ప్రతినిధి, నాగర్ కర్నూల్:**

రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని బీజేపీ నాయకులు అదనపు కలెక్టర్ అమరేందర్ కు వినతిపత్రాన్ని సమర్పించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు వేముల నరేందర్ రావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రభుత్వం హామీలను ఉటంకిస్తూ, గ్రామీణ ప్రాంతాల్లో పారిశుద్ధ్యం, వీధి దీపాలు, మౌలిక వసతులు మెరుగుపరచాలని సూచించారు. అలాగే నివాస, ఆదాయ, కుల ధృవీకరణ పత్రాల జారీని వేగవంతం చేయాలని కోరారు. కేఎల్ఐ పంప్‌సెట్ మోటార్‌ను మరమ్మతు చేసి తిరిగి వినియోగంలోకి తేవాలని కోరారు. కల్వకుర్తి ఎత్తిపోతల పథకం ద్వారా చివరి మండలాలకు కూడా నీటి సరఫరా చేయాలని విజ్ఞప్తి చేశారు. సర్వారెడ్డిపల్లి ఫుడ్ ప్రాసెసింగ్ ఇండస్ట్రియల్ ఏరియాను అభివృద్ధి చేయాలని, మ్యాంగో ప్రాసెసింగ్ యూనిట్ పనులను వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేశారు. అలాగే పాలమూరు ఎత్తిపోతల పథకానికి పూర్తిస్థాయి బడ్జెట్ కేటాయించాలని కోరారు. ఈ సందర్భంగా జిల్లా ప్రజా సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని బీజేపీ నాయకులు అధికారులను విజ్ఞప్తి చేశారు.

**నారాయణపేట లో..**

6 గ్యారంటీల అమలు ప్రజా సమస్యలను పరిష్కరించాలని శుక్రవారం నారాయణపేట కలెక్టరేట్ లో రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్రీను కు పలు సమస్యలతో కూడిన వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీరేందర్ గౌడ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్త శుద్ధి ఉంటే ఆరు గ్యారెంటీలకు చట్టబద్ధత కల్పించాలన్నారు. బిజెపి జిల్లా అధ్యక్షులు సత్యా యాదవ్, కే.రతంగ్ పాండురెడ్డి, తిరుపతి రెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ కొండా శ్వేత సత్యయాదవ్, వైస్ చైర్మన్ మంజుల జి ఆర్ రెడ్డి, కౌన్సిలర్ లు సత్య రఘుపాల్ రెడ్డి, కమలా పూర్ ప్రభాకర్ , రాఘవేందర్, సర్పంచ్ లు కే.నాగిరెడ్డి, చంద్ర శేఖర్ గౌడ్, రఘురామయ్య గౌడ్, నరేందర్ చారి, పేట మండల బిజెపి అధ్యక్షులు జ్యోతి సాయి బన్న తదితరులు పాల్గొన్నారు.

## ఎస్.ఎస్.సి పరీక్షలపై కట్టుదిట్టమైన నిబంధనలు

**అదనపు కలెక్టర్ అమరేందర్ ఆదేశాలు**

**ముద్ర ప్రతినిధి నగర్ కర్నూల్:**



జిల్లాలో నిర్వహించబడనున్న ఎస్.ఎస్.సి పబ్లిక్ పరీక్షల నిర్వహణపై రెవిన్యూ అదనపు కలెక్టర్ అమరేందర్ కీలక సూచనలు జారీ చేశారు. శుక్రవారం జూమ్ మీటింగ్ ద్వారా జిల్లాలోని పదో తరగతి పరీక్షా కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్‌లు, సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులపై కఠినంగా ఫ్రిస్కింగ్ నిర్వహించాలని, ఫోన్లు మరియు ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించరాదని స్పష్టం చేశారు. పరీక్షా సిబ్బంది కూడా మొబైల్ ఫోన్‌ల వినియోగాన్ని పూర్తిగా నిలిపివేయాలని, ప్రతి పరీక్షా రోజున “నో ఫోన్” సర్టిఫికేట్‌ను విధి రిజిస్టర్‌లో నమోదు చేయాలని సూచించారు. ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు పరీక్షా కేంద్రంలోకి ప్రవేశించే ముందు తమ మొబైల్ ఫోన్‌లను వాహనాల్లోనే జమ చేయాలని ఆదేశించారు. క్లెరికల్ సిబ్బంది, రిలీవర్లు పరీక్ష పూర్తయ్యే వరకు చీఫ్ సూపరింటెండెంట్ గదిని విడిచిపెట్టకూడదని, అన్ని వాహనాలు పరీక్షా కేంద్రం బయటే పార్క్ చేయాలని సూచించారు. చీఫ్ సూపరింటెండెంట్‌లు, డిపార్ట్మెంటల్ ఆఫీసర్లు తరచూ పర్యవేక్షణ నిర్వహించి, అనధికార వ్యక్తులు కేంద్రాల్లోకి ప్రవేశించకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు డీఈవోతత ఏ. రమేష్ కుమార్, పరీక్షల నిర్వహణ అధికారి రాజశేఖర్ రావు తదితరులు పాల్గొన్నారు.

## నాగర్‌కర్నూల్ నుంచి గోవా టూర్

**ముద్ర ప్రతినిధి నాగర్ కర్నూల్ :**

తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఆధ్వర్యంలో నాగర్‌కర్నూల్ డిపో నుంచి గోవా పర్యటనను ఏర్పాటు చేశారు. ఈ టూర్ ఈ నెల 27న ప్రారంభం కానుంది. మూడు రోజుల పాటు కొనసాగే ఈ పర్యటనలో గోవాలోని ముఖ్యమైన పర్యాటక ప్రదేశాలను సందర్శించే అవకాశం కల్పిస్తున్నారు. సూపర్ లగ్జరీ బస్సులో సౌకర్యవంతమైన ప్రయాణం కల్పిస్తామని నిర్వాహకులు తెలిపారు. ఈ గోవా టూర్‌కు ఒక్క వ్యక్తికి రూ.3500 మాత్రమే ఖర్చు అవుతుంది. తక్కువ ఖర్చుతో మంచి అనుభవాన్ని పొందే అవకాశం ఉందని అధికారులు పేర్కొన్నారు. ఆసక్తి గల వారు వెంటనే నమోదు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాల కోసం 9490411590, 9490411591 నంబర్లను సంప్రదించవచ్చు. ఈ అవకాశాన్ని వినియోగించుకొని కుటుంబంతో కలిసి గోవా అందాలను ఆస్వాదించాలని నిర్వాహకులు కోరుతున్నారు.

## ఆర్మీ, పోలీస్ ఉద్యోగాలకై ఉచిత శిక్షణ

**ముద్ర, నారాయణపేట:**

జిల్లా కేంద్రంలోని శ్రీ వేద సరస్వతి జూనియర్ కళాశాల లో వారియర్స్ డిఫెన్స్ అకాడమీ, లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత క్లాసులను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఉచిత శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకొని ఉద్యోగాలు సాధించాలని ఆకాంక్షించారు. వారియర్స్ డిఫెన్స్ అకాడమీ డైరెక్టర్ ఆంజనేయులు ఆర్మీ మాట్లాడుతూ శిక్షణా తరగతుల నిర్వహణ కోసం లయన్స్ క్లబ్ ఆఫ్ నారాయణపేట అధ్యక్షురాలు లయన్ సరితా హరినారాయణ భట్టాడ్, లయన్ రవికుమార్ గౌడ్, శ్రీ వేద సరస్వతి జూనియర్ కాలేజ్ ప్రిన్సిపల్ శేషమ్మ సహకారం అందించడం జరిగిందన్నారు. నిరుద్యోగ యువత ఈ యొక్క అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బాలు, చక్రి, రాము తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఈటల రాజేందర్ జన్మదిన వేడుకలు

**ముద్ర కూకట్‌పల్లి:**



మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ జన్మదిన వేడుకలు ఆయన కార్యాలయం వద్ద శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు ముఖ్య అతిథిగా పాల్గొని, ఈటల రాజేందర్‌కు శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు కంచి మహేందర్ యాదవ్, ప్రీతం రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, మల్లేష్, వరలక్ష్మి , సులోచనతో పాటు కూకట్‌పల్లి నియోజకవర్గంలోని సీనియర్ బీజేపీ నాయకులు, యువమోర్చా కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

## అహింస బలహీనత కాదు.. అత్యున్నతమైన శక్తి

**ముద్ర, శేరిలింగంపల్లి:**

“అహింస బలహీనత కాదు, అది అత్యున్నతమైన శక్తి–ఈ మహత్తర విలువను జైన సమాజం అద్భుతంగా ఆచరిస్తోంది” అని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, శేరిలింగంపల్లి అసెంబ్లీ నియోజకవర్గ కాంగ్రె స్ పార్టీ ఇంచార్జ్ వి. జగదీశ్వర్ గౌడ్ అన్నారు. శుక్రవారం శేరిలింగంపల్లి నియోజక వర్గంలోని నల్లగండ్ల డివిజన్‌లో నల్లగండ్ల హుడా ప్రాంతంలో నిర్మించిన శ్రీ దిగంబర్ జైన్ జినాలయ ఆలయ ప్రారంభోత్సవ కార్యక్రమంలో జైన సమాజ సభ్యులు మరియు స్థానిక కాలనీ ప్రజలతో కలిసి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## బుడగ జంగాల కుటుంబాలకు అండగా ఉంటాం

**ముద్ర, కూకట్ పల్లి:**

అర్హులైన ప్రతి బుడగ జంగాల కుటుంబానికి నివాస స్థలాలు ఏర్పాటు చేసేం దుకు కృషి చేస్తామని టీపీసీసీ ఉపాధ్యక్షులు, కూకట్‌పల్లి కాంగ్రెస్ ఇన్‌చార్జ్ బండి రమేష్ భరోసా ఇచ్చారు. కూకట్‌పల్లిలోని శ్రీ హేమ దుర్గా పార్టీ కార్యాలయంలో బాధితులు ఆయనను కలిసి తమ గోడును వెళ్లబోసుకున్నారు. వెంటనే ఎమ్మార్వో స్వామితో ఫోన్లో మాట్లాడారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఎక్కడైనా ఖాళీ స్థలం ఉంటే పరిశీలించి, వారికి నివాస యోగ్యమైన స్థలాన్ని చూపించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు లక్ష్మయ్య, గొట్టిముక్కల వెంకటేశ్వరరావు, శ్రీను, రాము, తదితరులు పాల్గొన్నారు.

## ఆలయ అభివృద్ధికి సహకరిస్తా..

**ముద్ర, కూకట్‌పల్లి :**

వివేకానంద నగర్, అల్లాపూర్ గాయత్రీ నగర్ డివిజన్లలో వేంచేసి ఉన్న శ్రీ కనకదుర్గ నాగదేవత సహిత పోచమ్మ దేవాలయ అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని జనసేన పార్టీ కూకట్‌పల్లి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ ముమ్మారెడ్డి ప్రేమకుమార్ అన్నారు. ఆలయ కమిటీ చైర్మన్ పులిగోల్ల శ్రీనివాస్ యాదవ్, ప్రెసిడెంట్ కాయితి యాదవ రెడ్డి, ప్రధాన కార్యదర్శి కల్వల ఏడుకొండలు, జనసేన నాయకుడు పవన్ నాయుడు ఆహ్వానం మేరకు ప్రేమ కుమార్ శుక్రవారం అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ నిర్మాణ పనులను పరిశీలించిన ఆయన ప్రాంగణంలోని ఫ్లోరింగ్ కోసం అవసరమైన గ్రానైట్‌ను అందజేస్తానని హామీ ఇచ్చారు. జనసేన నాయకులు ఆత్మూరి మోహన్, పాదం సూర్య, జయమ్మ శ్రీను, గణేశుల నాగేశ్వరరావు, జెల్లా రవి, సూర్యనారాయణ, లలిత మాత గ్రూప్ సభ్యులు పాల్గొన్నారు.

## జర్నలిస్టుల సంక్షేమానికి భరోసా

**ముద్ర, ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా ప్రతినిధి :**

జర్నలిస్టుల సంక్షేమమే లక్ష్యంగా సంఘం పనిచేస్తుందని సంఘం అధ్యక్షుడు వాకిట అశోక్ తెలిపారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని సురవరం ప్రతాపరెడ్డి ప్రెస్ భవన్ లో పాలమూరు జర్నలిస్టుల సంక్షేమ సంఘం విధివిధానాలు రూపకల్పన కమిటీ తదితర విషయాలపై మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అశోక్ కుమార్ మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలోని వర్కింగ్ జర్నలిస్టులందరినీ అన్ని కేటగిరీలు, విభాగాల వారిని సంఘములో సభ్యులుగా చేర్చుకొని ఆపద సమయంలో వారికి అండగా ఉంటామని తెలిపారు. సభ్యత్వం తీసుకున్న ప్రతి ఒక్కరికీ యాక్సిడెంటల్ ఇన్సూరెన్స్ పాలసీ సౌకర్యం కల్పించనున్నట్లు వెల్లడించారు. అనంతరం కార్యదర్శి మల్లు మధుసూదన్ రెడ్డి సంఘం విధివిధానాలను వివరించారు. సంఘం కోశాధికారి జిల్లెల రఘు, ఉపాధ్యక్షులు పల్లె ముని యాదయ్య, సహాయ కార్యదర్శి ఎం. తిరుపతయ్య, కార్యవర్గ సభ్యులు కే. రమాకాంత్ రెడ్డి, సతీష్ కుమార్, కే. కేశవులు, సంతోష్ కుమార్, సతీష్ కుమార్ రెడ్డి, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

**ధ్యానం & శ్వాస వ్యాయామాలు**

రోజూ కొద్దిసేపు ధ్యానం చేయడం అలవాటు చేసుకోండి. ఇది మనసును స్థిరంగా ఉంచి, ఆందోళనను తగ్గిస్తుంది.



# పవర్ హౌస్‌గా కరీంనగర్..

### - రాష్ట్ర రాజకీయాల్లో కీలక ముద్ర



**ముద్ర, కరీంనగర్:**

కరీంనగర్ అంటేనే ఉద్యమాల గడ్డ. నాడు భూస్వాములపై తిరుగుబాటు చేసినా.. తర్వాత రజాకార్లపై తిరగబడినా.. తొలి తరం తెలంగాణ ఉద్యమమైనా... మలిదశ తెలంగాణ పోరాటమైనా.. జగిత్యాల జైత్ర యాత్ర అయినా.. నక్సల్ ఉద్యమమైనా.. తర్వాత జరిగిన మావోయిస్టు ఉద్యమమైనా కరీనంగర్ వాసులు ఉండాల్సిందే. తాజాగా రాజకీయాల్లోనూ ఉమ్మడి కరీంనగర్ జిల్లా నేతలు రాష్ట్ర రాజకీయాల్లో తనదైన ముద్ర వేసుకుంటున్నారు. దీంతో తెలంగాణ రాజకీయాల్లో ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రత్యేక గుర్తింపు పొందుతోంది. కేంద్రం, రాష్ట్ర స్థాయిలో జిల్లా నేతలకు కీలక పదవులు దక్కాయి.. దక్కుతున్నాయి. బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీలలో ఈ ప్రాంతం ప్రభావం స్పష్టంగా కనిపిస్తోంది.

**కేంద్ర మంత్రి.. రాష్ట్ర మంత్రులు..**

కరీంనగర్ నుంచి బండి సంజయ్ కేంద్ర మంత్రిగా ఉన్నారు. కీలకమైన హోంశాఖ సహాయ మంత్రిగా మోదీ 3.0 క్యాబినెట్‌లో స్థానం దక్కించుకున్నారు. తెలంగాణలో పార్టీని బలోపేతం చేసినందుకు ఆయనకు దక్కిన గుర్తింపు, గౌరవంగా చెప్పొచ్చు. ఇక తెలంగాణలో 2023 అసెంబ్లీ ఎన్నికల తర్వాత ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు మూడు మంత్రి పదవులు దక్కాయి. మంథని ఎమ్మెల్యే దుద్దిళ శ్రీధర్ బాబు కీలకమైన ఐటీ, పరిశ్రమలు, శాసన సభ వ్యవహారాల శాఖ మంత్రిగా ఉన్నారు. పొన్నం ప్రభాకర్ బీసీ సంక్షేమం, రవాణా శాఖ మంత్రిగా, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ సాంఘి క సంక్షేమ శాఖ మంత్రిగా ఉన్నారు.

**అసెంబ్లీలో, పార్టీలో కీలక పదవులు..**

ఇక అధికాక కాంగ్రెస్‌కు చెందిన వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌కు విప్ పదవి దక్కింది. తన పదవికి తగినట్లుగా ఆయన కార్యదక్షత చూపుతున్నారు. తాజాగా పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణరావు, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్‌ను కూడా విప్ పదవులు వరించాయి. దీంతో అసెంబ్లీలో కరీంనగర్ శక్తి మరింత పెరిగింది. ఇక మానకొండూర్ ఎమ్మెల్యే కాంగ్రెస్ ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్నారు. ఇక బీఆర్ఎస్‌లో కేటీఆర్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఉన్నారు. హుజూరాబాద్ మాజీ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ బీజేపీలో కీలక నాయకుడిగా ఉన్నారు. ఈ పదవులు మూడు పార్టీల్లో కరీనంగర్ జిల్లా బలాన్ని నిరూపిస్తున్నాయి.

కరీంనగర్ ప్రాంతం రాజకీయంగా చురుకైన మట్టి కలిగి ఉంది. స్థానిక నాయకులు పార్టీలకు అంకితమై, గ్రామీణ–పట్టణ ప్రజల మద్దతుతో ఎదిగారు. బండి సంజయ్‌కు యువతలో మంచి పట్టు ఉంది. కేటీఆర్ టెక్నాలజీలో యువ ఉద్యోగులను ఆకట్టుకుంటున్నారు. ఈ ట్రెండ్ రాష్ట్ర రాజకీయాలకు కొత్త ఊపు ఇస్తూ, జిల్లాను 'పవర్‌హౌస్'గా మార్చుతోంది.

## ఉపాధ్యాయునిపై పోక్సో కేసు నమోదు చేయాలి

### - పీడీఎస్ యూ జిల్లా అధ్యక్షుడు వెంకటేష్

**ముద్ర ప్రతినిధి, నిర్మల్:**



నిర్మల్ రూరల్ మండలం కొండాపూర్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థినులపై లైంగిక వేధింపులకు పాల్పడిన ఉపాధ్యాయునిపై పోక్సో కేసు నమోదు చేయాలని పీడీఎస్ యూ నిర్మల్ జిల్లా అధ్యక్షుడు సింగారి వెంకటేష్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. తరగతి గదుల్లో పిల్లలకు పాఠాలు చెప్పాల్సిన గురువు దారి తప్పి వికృత చేష్టలతో ఉపాధ్యాయ వృత్తికే మచ్చ తీసుకొస్తున్నారన్నారు. జిల్లా కేంద్రాన్ని అనుకుని ఉన్న పాఠశాలలో వేధింపులకు పాల్పడటం బాధా కరమని పేర్కొన్నారు.

## ఉద్యాన పంటలపై అవగాహన

**మహదేవపూర్, ముద్ర:**

కాటారం మండలంలోని గంగారం లో శుక్రవారం ఉద్యాన పంటలపై అవగా హన సదస్సు నిర్వహించారు. జిల్లా ఉద్యానవన శాఖ అధికారి అనిల్ కుమార్ ఉద్యాన పంటలు సాగు చేయడం వల్ల వచ్చే దిగుబడి గురించి వివరించారు.

## ఎస్పీ ఆధ్వర్యంలో ఇఫ్తార్



**ముద్ర ప్రతినిధి, నిర్మల్:**

రంజాన్ ముగింపు సందర్భంగా ఎస్పీ జానకి షర్మిళ ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం ముస్లిం లకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ సమాజంలో సోదరభావం మరింత బలపడాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో నిర్మల్ ఏఎస్పీ సాయి కిరణ్, ముస్లిం మత పెద్దలు, పోలీసు అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# విప్ విజయరమణా రావుకు ఘన స్వాగతం

**ముద్ర, కరీంనగర్:**



ప్రభుత్వ విప్ గా నియమితులై తొలి సారిగా పెద్దపల్లికి వెళ్తున్న ఎమ్మెల్యే విజయరమణా రావుకు కరీంనగర్ లో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘన స్వాగతం పలికారు. కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇంచార్జి వెలిచాల రాజేందర్ రావు ఆధ్వర్యంలో కాంగ్రెస్ మేయర్ అభ్యర్థి ఆకుల నర్మద నర్సన్న, కార్పొరేటర్లు, సర్పంచ్‌లు, నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో శుక్రవారం సాయంత్రం జిల్లా సరిహద్దు బైపాస్ రోడ్డు, హౌసింగ్ బోర్డ్ కాలనీలోని మాజీ కార్పొరేటర్ ఆకుల ప్రకాష్ ఇంటి వద్ద విజయ రమణారావు కు అపూర్వ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా విజయ రమణారావుకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం విజయ రమణా రావు మాట్లాడుతూ తనకు ఈ అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. పెద్దపల్లి తో పాటు కరీంనగర్ నగరంలో కూడా పార్టీ బలోపే తానికి ప్రత్యేక కృషి చేస్తానని పేర్కొన్నారు. కరీంనగర్ కాంగ్రెస్ నాయకులకు ఎల్ల వేళలా అందుబాటులో ఉంటానన్నారు. విజయ రమణారావుకు కరీంనగర్ నియోజకవర్గ ప్రజల తరపున వెలిచాల రాజేందర్ రావు ప్రత్యేక అభినందనలు తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాం క్షించారు. ప్రజాసేవలో నిరంతరం నిమగ్నమై ప్రజల ఆద రాభిమానాలు మరింత పొందాలని రాజేందర్ రావు పేర్కొ న్నారు. ఈ కార్యక్ర మంలో కాంగ్రెస్ మేయర్ అభ్య ర్థి ఆకుల నర్మద నర్సయ్య, స్థానిక కార్పొ రేటర్ ఆకుల నందిని ఉదయ్, కార్పొరేటర్లు గంట శ్రీనివాస్, పడాల శ్రీజ అజయ్, గుమ్మడి రాజకుమార్, పడిశెట్టి వసంత లక్ష్మి భూమయ్య, మాజీ కార్పొరేటర్ ఆకుల ప్రకాష్, పట్టణ కాంగ్రెస్ మహిళా అధ్యక్షు రాలు రజిత రెడ్డి, నాయకులు సత్య నారాయణ రావు, సుదర్శన్, తోట రాజేం దర్, నరసింహచారీ, రేగొండ సందీప్, వే ముల శ్రీనివాస్, తిప్పారపు శ్రీనివాస్, జ ల్లోజు శ్రీనివాస్, దుగ్గు మహేందర్, పోరెడ్డి శ్రీధర్, బత్తిని కన్నయ్య గౌడ్, అట్టెపు వేణు, వాసు గౌడ్, ఇమ్రాన్, సూఫీయాన్, కపిల్ మాధవ్, ఆస్తాపురం తిరుమల, జ్యోతి రెడ్డి, హసీనా బేగం, శిల్ప, కనకరాజు, కార్తీక్, కౌశిక్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల హామీలను నెరవేర్చాలి

### - ఎంపీ జీ నగేష్

**బోథ్, ముద్ర:**



కాంగ్రెస్ పార్టీ 2023 ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీ లను వెంటనే అమలు చేయాలని ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేష్ డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బీజేపీ జిల్లా అధ్యక్షుడు పతంగే బ్రహ్మానంద్ తదితర పార్టీ నాయకులతో కలిసి తో కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. అనంతరం ఆదిలాబాద్ కలెక్టర్ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిన పార్టీ క్షమాపణ చెప్పి వెంటనే హామీలను అమలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. రైతు భరోసా నిధులను వెంటనే విడుదల చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రంలో రూ. వేల కోట్ల నిధులతో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపడుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఫొటోలు పెట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా నాయకులు, కౌన్సిలర్లు, వివిధ మండలాల అధ్యక్షులు పాల్గొన్నారు.

## సర్కారు బడుల్లోనే నాణ్యమైన విద్య



**ముద్ర ప్రతినిధి, నిర్మల్:** ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య పొందవచ్చని కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. నిర్మల్ గ్రామీణ మండలం రత్నాపూర్ కాండ్లి జెడ్పీ సెకండరీ పాఠశాలను శుక్రవారం కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు ఆహ్లాదకర వాతావరణం కల్పించేలా పాఠశాల ఆవరణలో పచ్చదనం పెంపొందించాలని సూచించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఉపాధ్యాయులు, సిబ్బంది సమయ పాలన పాటిస్తూ విధుల్లో అంకిత భావంతో పనిచేయాలని పేర్కొన్నారు. పదో తరగతి విద్యార్థులతో మాట్లాడి పరీక్షలను ఎటువంటి భయం లేకుండా ప్రశాంతంగా రాయాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, పెన్నులు తదితర సామగ్రిని పంపిణీ చేశారు. ఆమె వెంట డీఈవో భోజన్న, తహసీల్దార్ ప్రభాకర్, ఎంఈవో వెంకటేశ్వర్ రావు, సర్పంచ్ హరీష్ తదితరులు ఉన్నారు.

## ప్రజా సంక్షేమాన్ని మరిచిన కాంగ్రెస్



**ముద్ర ప్రతినిధి, నిర్మల్:** కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమాన్ని మరిచిపోయిందని బీజేపీ రాష్ట్ర నాయకులు రావుల రాంనాథ్ ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం బీజేపీ నాయకులు కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. అనంతరం కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను పూర్తిగా విస్మరించిందన్నారు. ఎన్నికలకు ముందు హామీల వర్షం కురిపించి, ఇప్పుడు వాటిని తుంగలో తొక్కిందని విమర్శించారు. ప్రభుత్వ వైఖరిని ప్రజలు గమనిస్తున్నారని, వారే బుద్ధి చెబుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు మేడిసిమ్మె రాజు, జిల్లా ప్రధాన కార్యదర్శులు కరిపే విలాస్, నల్లా రవీందర్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు కొండ్ర రాజరెడ్డి, ఆఫీస్ సెక్రెటరీ రాచకొండ సాగర్, జిల్లా మీడియా కన్వీనర్ రమేష్, పట్టణ అధ్యక్షులు ఆకుల కార్తీక్, సుంకరి సాయి, వివిధ మండలాల అధ్యక్షులు మార గంగారెడ్డి, నరేందర్, కాల్వ నరేష్, రంజిత్, బీజేపీ కౌన్సిలర్లు, సర్పంచ్ లు తదితరులు పాల్గొన్నారు.

## ప్రమాద బాధితులకు తొలగనున్న ముప్పు

### - నిర్మల్ లో ట్రామా కేర్ సెంటర్ ఏర్పాటుకు ఆమోదం

**ముద్ర ప్రతినిధి, నిర్మల్:** ప్రమాదంలో గాయపడి ప్రాణాపాయ స్థితిలో ఉన్నవారికి ఇక్కట్లు తొలిగిపోనున్నాయి. ట్రామా కేర్ విధానంలో భాగంగా మూడో లెవెల్ ట్రామా కేర్ సెంటర్ నిర్మల్ లో ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ప్రమాదం సంభవించినప్పుడు తొలి గంటలో ప్రత్యేకించి 20 నుంచి 30 నిముషాల లోపు చికిత్స అందితే ప్రాణాపాయం సంభవించకుండా కాపాడవచ్చు. ఐతే సమీపంలో సరైన సౌకర్యాలు లేకపోవడంతో ప్రమాద బాధితులు మృత్యు వాత పడుతున్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ రాష్ట్ర ట్రామా కేర్ పాలసీ రూపకల్పన చేసింది. ఇందులో భాగంగా మూడు స్థాయిల్లో మొత్తం 17 కేంద్రాలను ట్రామా కేర్ సెంటర్లుగా ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. నిర్మల్ లోని ప్రభుత్వ వైద్య కళాశాలలో ట్రామా కేర్ సెంటర్ ఏర్పాటు చేసేందుకు సంకల్పించారు. ఇందుకు అవసరమైన చర్యలను చేపట్టేందుకు ఏర్పాట్లు జరుగుతున్నట్లు సమాచారం. నిర్మల్ లో ఏర్పాటు చేయబోయే పోస్ట్ ట్రామా సర్వీస్ సెంటర్ ద్వారా చికిత్స జరుగుతున్న సమయంలో అవసరమైతే ప్రైవేటు వైద్య కేంద్రాల ద్వారా కూడా సాయం పొందేందుకు విధివిధానాలు ఖరారు చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ ట్రామా కేర్ సెంటర్ ఏర్పాటైతే జిల్లాలోని 13 మండలాల ప్రజలకు ప్రమాద స్థితిలో చికిత్స అందే అవకాశం కలుగుతుంది.

## ఉగాది వేడుకల్లో నిర్మల్ కవులు




**ముద్ర ప్రతినిధి, నిర్మల్:** రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో గురువారం రవీంద్ర భారతిలో నిర్వహించిన శ్రీ పరాభవ ఉగాది వేడుకల్లో నిర్మల్ కు చెందిన కవులు డా.దామెర రాములు, డా.తుమ్మల దేవరావు తమ కవితాగానం చేశారు. తెలంగాణ మాగాణి గురించి దామెర రాములు తన కవితలో వివరించారు. ఇక "కాలం కాస్త స్తంభించి పోనీ" కవితలో ప్రస్తుతం జరుగుతున్న యుద్ధం, వనరుల కోసం పెరిగిన యుద్ధ కాంక్ష గురించి వివరించారు. ఈ కవిత్వం ప్రస్తుత యుద్ధ వాతావరణాన్ని ప్రతిబింబించేలా ఉంది. వీరిలో దామెర రాములు వృత్తి వైద్యం కాగా, ప్రవృత్తి కవిత్వం. తుమ్మల దేవరావు వృత్తి రీత్యా ప్రభుత్వ ఉపాధ్యాయులు. నిర్మల్ కు చెందిన కవులు రాష్ట్ర రాజధాని లోని రవీంద్ర భారతి వేదికగా కవితా గానం చేసి ఉగాది పురస్కారం పొందడంతో స్థానిక కవులు హర్షం వ్యక్తం చేశారు.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
శనివారం 21-03-2026
www.mudranews.in | @mudranews



**సమయ నిర్వహణ**

పనులను ప్రాధాన్యతల ప్రకారం ప్లాన్ చేసుకోండి. ఇది గందరగోళాన్ని తగ్గించి, ఒత్తిడిని నియంత్రిస్తుంది.



# గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని కొనసాగించాలి

**- తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొండమడుగు నర్సింహ్మ**




ముద్ర ప్రతినిధి, భువనగిరి : మోదీ ప్రభుత్వం వ్యవసాయ కార్మికుల, పేదల పొట్టగొట్టడానికి తీసుకువచ్చిన విబి – జి రామ్ జి చట్టాన్ని రద్దు చేసి మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని కొనసాగించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొండమడుగు నర్సింహ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా ఉపాధి హామీ కార్మికులు పనిచేసిన పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం భువనగిరి మండల పరిధిలోని తాజ్ పూర్ గ్రామంలో ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న కార్మికుల పని ప్రదేశాన్ని జిల్లా ఉపాధ్యక్షుడు పల్లెర్ల అంజయ్యతో కలిసి సందర్శించారు. తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు, చీమలకొండూరు సర్పంచ్ పల్లెర్ల అంజయ్య మాట్లాడుతూ నాలుగు నెలలకు పైగా కార్మికులు చేసిన పనికి డబ్బులు చెల్లించకపోతే కుటుంబాలు ఏ విధంగా గడుస్తాయని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.

ఈ కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ రామస్వామి, ఉపాధి కూలీలు బోమ్మారపు లావణ్య, శిరిష, లక్ష్మి, స్వాతి, సంగీత, ధనలక్ష్మి, క్రిష్ణ, రాంపల్లి శ్రీలత, లావణ్య, మమత, పల్లెపాటి శోభారాణి, లక్ష్మి, ర్యాకల లావణ్య, వరిగంటి రమాదేవి, లక్ష్మి, లావణ్య, గుండ్లపల్లి జ్యోతి, బీటుకూరు నర్సమ్మ పాల్గొన్నారు.

# జనాభా లెక్కలు దేశాభివృద్ధికి కీలకం

**- జిల్లా కలెక్టర్, ప్రధాన జనాభా గణన అధికారి తేజస్ నంద్ లాల్ పవార్**




ముద్ర ప్రతినిధి, కోదాడ: రాబోయే జనాభా లెక్కలు దేశ అభివృద్ధికి, ప్రభుత్వ పథకాల సమర్థ అమలుకు కీలకమని జిల్లా కలెక్టర్, ప్రధాన జనాభా గణన అధికారి తేజస్ నంద్ లాల్ పవార్ తెలిపారు. అధికారులు పూర్తి అవగాహనతో క్షేత్రస్థాయిలో బాధ్యతగా పని చేసి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన సూచించారు. జిల్లాలో జనాభా గణన–2027ను సమర్థవంతంగా నిర్వహించేందుకు జిల్లా, మండల, మున్సిపల్ స్థాయి సెక్షన్ క్లర్క్ లు, టెక్నికల్ అసిస్టెంట్లకు మార్చి 20, 22, 23 తేదీలలో ఇళ్ల జాబితా, గృహ గణన శిక్షణ కార్యక్రమాన్ని శుక్రవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనాభా గణన నిర్వహణకు అవసరమైన విధి విధానాలు, మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలన్నారు. జనాభా గణన ద్వారా లభించే గణాంకాలు ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు, మౌలిక సదుపాయాల ప్రణాళికలకు ఎంతో ఉపయోగకరమని పేర్కొన్నారు. ఈసారి జనాభా గణనను దేశంలో తొలిసారిగా డిజిటల్ విధానంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. మొబైల్ యాప్ లు, వెబ్ పోర్టల్ ద్వారా గణన చేపడతారని, ప్రజలు స్వయంగా తమ వివరాలను ఆన్లైన్లో నమోదు చేసుకునే అవకాశం కల్పించనున్నట్లు వెల్లడించారు.

అనంతరం జిల్లా అదనపు కలెక్టర్ కె. సీతారామారావు, సీపీఓ కిషన్ మాట్లాడుతూ అన్ని శాఖల సమన్వయంతో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గణాంక అధికారి వి. రామారావు, ఉప గణాంక అధికారి ఎం. రాజేష్, బి.కోటేశ్వరరావు, పర్యవేక్షకులు దున్న శ్యామ్, మండల ప్రణాళికా గణాంక అధికారులు, టెక్నికల్ అసిస్టెంట్లు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు .

## మానవత సేవా సారథి అవార్డు అందుకున్న ఉపాధ్యాయుడు నీలం శేఖర్




ముద్ర ప్రతినిధి, భువనగిరి : రామన్నపేట మండలంలోని ఎన్నారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జీవశాస్త్ర ఉపాధ్యాయులు నీలం శేఖర్ ఉగాది విశిష్ట సేవ పురస్కారాలలో మానవతా సేవా సారథి అవార్డు అందుకున్నారు. హైదరాబాద్ కళావేదిక ప్రాంగణంలో ప్రాగ్నిక ఆర్ట్స్ అకాడమీ, గంగోత్రి కల్చరల్ ఫౌండేషన్ వారు ఆ సంస్థ వ్యవస్థపాక అధ్యక్షులు ప్రవీణ్ పారిజాత ఉమ్మడి తెలుగు రాష్టాలో ఉపాధ్యాయులలో ముగ్గురిని గుర్తించి వారికి అవార్డు అందించి సన్మానించారు. ఈ సందర్భంగా నీలం శేఖర్ కు ఎంఇఓ గవ్వ జ్యోతి, దొడ్డి స్వామి, శేఖర్, సురేందర్ రెడ్డి, బాసరాజు యాదగిరి, మట్టా రెడ్డి, తీగల జాన్ రెడ్డి, కమలాదేవి, భవాని, సీనా రెడ్డి, మణి, సైదులు, రవి కుమార స్వామి మధు బాబు అభినందనలు తెలిపారు.

## సమయానుసారం టీకాలు వేయించాలి



ముద్ర, మోత్కూర్: సమయానుసారం పిల్లలకు టీకాలు వేయించాలని జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ రామకృష్ణ అన్నారు. మోత్కూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి ఐదు సంవత్సరాల లోపు వయసు గల శిశు మరణాల పైన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారుల మరణాలను నివారించ డానికి తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఏ వయసుకు వేయించవలసిన టీకాలు ఆ వయసులోనే వేయించాలని, గర్భిణీలకు సకాలంలో అన్ని పరీక్షలు చేయించడం, తగిన పోషకాహారం తీసుకునే లాగా చూడడం వంటి వాటి పైన దృష్టి సారించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో మోత్కూరు గుండాల, ఆత్మకూరు, వేముల కొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు సంబంధించిన వైద్యులు సంబంధిత ఏఎన్ఎం లు, ఆశాలు సూపర్వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

## పక్షవాత బాధితుడికి వీల్ చైర్ అందజేత



ముద్ర, మోత్కూర్: మోత్కూర్ మున్సిపాలిటీ 6వ వార్డు అరేగూడెంలో సమాల రామస్వామి రెడ్డి గత 7 సంవత్సరాల నుండి పక్షవాతంతో బాధపడుతూ మంచానికి పరిమితం కావడంతో ఆయనకు మున్సిపల్ చైర్మన్ గడ్డం స్వప్న సోమ నర్సయ్య వీల్ చైర్ అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడమే మనిషికి నిజమైన సంతృప్తి అని పదవులు కాదు ముఖ్యం ప్రజాసేవే లక్ష్యం అని అన్నారు. ఈ కార్యక్రమం లో కాంగ్రెస్ సీనియర్ నాయకులు బద్దం నాగార్జున రెడ్డి, వార్డు సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## జీపీ కార్మికులకు దుస్తులు అందజేత



ముద్ర ప్రతినిధి, భువనగిరి : భువనగిరి మండల కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ అధ్యక్షుడు షేక్ షానూర్ బాబా రంజాన్ పండుగ సందర్భంగా మండలంలోని వడపర్తి, మన్నెవారీపంపు గ్రామాలలోని పారిశుధ్య కార్మికులకు శుక్రవారం వడపర్తి గ్రామంలో దుస్తులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పారిశుధ్య కార్మికులు షేక్ షానూర్ బాబాకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎస్ కే.సలీం పాషా, మల్లయ్య, రసూల్ పాషా, జమాల్, జహంగీర్ తదితరులు ఉన్నారు.

## సిలిండర్లను గ్రామాల్లోనే అందించాలి



ముద్ర, మోత్కూర్: మోత్కూర్ మండల పరిధిలోని గ్రామాలలోనే వంట గ్యాస్ సిలిండర్లు డెలివరీ చేయాలని సీపీఎం మండల కార్యదర్శి గుండు వెంకటనర్సు డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన మోత్కూర్ లో విలేకరులతో మాట్లాడుతూ గ్యాస్ కొరత లేదని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ, గ్రామాలలోని చాలా మంది మోత్కూర్ కార్యాలయం ముందు గ్యాస్ కోసం క్యూ కడుతున్నారని అన్నారు. వినియోగదారులకు గ్రామాలలోనే సిలిండర్లు డెలివరీ చెయ్యాలని గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులను కోరారు.

## ప్రజలందరికీ రంజాన్ శుభాకాంక్షలు: మంత్రి ఉత్తమ్



ముద్ర ప్రతినిధి, కోదాడ: ముస్లిం సోదర, సోదరీమణులకు, రాష్ట్ర ప్రజలకు రంజాన్ పండుగ సందర్భంగా రాష్ట్ర ఆహార, పౌరసరఫరాలు మరియు భారీ నీటి పారుదల శాఖ మంత్రి నల్లమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఉపవాస దీక్షలు, ప్రార్థనలు, దాన ధర్మాల ద్వారా ఈ పవిత్ర మాసం సహనాన్ని, సేవాభావాన్ని, సౌభ్రాతృత్వాన్ని పెంపొందిస్తుందని పేర్కొన్నారు. రంజాన్ పండుగ శాంతి, ఐక్యతకు ప్రతీకగా నిలుస్తుందని, ప్రతి ఒక్కరూ ఆనందంగా సామరస్యంతో ఈ పండుగను జరుపుకోవాలని ఆయన సూచించారు. సమాజంలో ప్రేమ, పరస్పర గౌరవం మరింత బలపడాలని, అందరికీ ఆరోగ్యం, సంతోషం కలగాలని ఈ సందర్భంగా మంత్రి ఆకాంక్షించారు.

## జిల్లా ప్రజలకు రంజాన్ శుభాకాంక్షలు: కలెక్టర్



ముద్ర ప్రతినిధి, కోదాడ: రంజాన్ పండుగ సందర్భంగా సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నంది లాల్ పవర్ జిల్లా ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ముస్లింలు ఉపవాస దీక్షలు, ప్రార్థనలు, దాన ధర్మాల (జకాత్) ద్వారా ఈ పవిత్ర మాసం సహనాన్ని, సేవాభావాన్ని, సౌభ్రాతృత్వాన్ని పెంపొందిస్తుందని పేర్కొన్నారు. రంజాన్ పండుగ శాంతి, సౌహార్దం, ఐక్యతకు ప్రతీకగా నిలుస్తుందని, ప్రతి ఒక్కరూ ఆనందంగా, మత సామరస్యంతో ఈ పండుగను ఆనందంగా జరుపుకోవాలని ఆయన సూచించారు. సమాజంలో ప్రేమ, పరస్పర గౌరవం మరింత బలపడాలని, అందరికీ ఆరోగ్యం, సంతోషం కలగాలని కలెక్టర్ ఆకాంక్షించారు.

# కాంగ్రెస్ పాలనతో ప్రజలకు ఇబ్బందులు

**- బీజేపీ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు గొంగిడి మనోహర్ రెడ్డి**

**- కలెక్టరేట్ ఎదుట బీజేపీ ధర్నా**




ముద్ర ప్రతినిధి, భువనగిరి : కాంగ్రెస్ చేతగాని పాలనతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని బీజేపీ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు గొంగిడి మనోహర్ రెడ్డి అన్నారు. శుక్రవారం బీజేపీ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద జిల్లా అధ్యక్షుడు ఊట్కూరి అశోక్ గౌడ్ అధ్యక్షతన, జిల్లాలోని స్థానిక సమస్యలపై ధర్నా కార్యక్రమం నిర్వహించారు.

ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన మనోహర్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం కోసం అమలుకు నోచుకోలేని పథకాలు ఇస్తామని చెప్పి నెరవేర్చడంలో విఫలం చెందిందని, ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని ముఖ్యంగా డబుల్ బెడ్ రూములు, నిరుద్యోగ భృతి, చేయూత వితంతు, వృద్ధాప్య, వికలాంగుల పింఛన్ రూ.4 వేలు, 6 వేలు, రైతు భరోసా, యువతకు జాబ్ క్యాలెండరు, మహిళలకు 2500, దళితులకు మూడు ఎకరాల పొలం ఇంకా ఎన్నో హామీలను ఇచ్చి ప్రజలను మోసం చేస్తున్నారని చెప్పారు.

ఈ కార్యక్రమంలో బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పడమటి జగన్ మోహన్ రెడ్డి, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు జాయినపల్లి శ్యాంసుందర్ రెడ్డి, పట్నం శ్రీనివాస్, వేముల నరేష్, గూడూరు నరోత్తం రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శులు కొప్పుల యాదిరెడ్డి, చంద మహేందర్ గుప్తా, కాదూరి అచ్చయ్య, జిల్లా కోశాధికారి సోమ నర్సయ్య, జిల్లా కార్యదర్శులు తడిసిన మల్లారెడ్డి, కామిటికారి కృష్ణ, లక్ష్మీనారాయణ, మేడి కోటేష్, జిల్లా వివిధ మోర్చా అధ్యక్షులు ఫకీర్ రాజేందర్రెడ్డి, పట్నం కపిల్, కస్తూరి మాధురి, జిల్లా మీడియా కన్వీనర్ ఆకుతోట రామకృష్ణ, ఏలె చంద్రశేఖర్, పాదారాజు ఉమా శంకర్ రావు, పట్టణ ప్రధాన కార్యదర్శి ఉడుత భాస్కర్, రాజు, లోకేష్ పాల్గొన్నారు.

# ఏప్రిల్ లో మహనీయుల జ్ఞాన పాదయాత్ర



ముద్ర ప్రతినిధి, భువనగిరి : ఏప్రిల్ 10 నుంచి 14 వరకు మహనీయుల జయంతి ఉత్స వాలలో భాగంగా తెలంగాణ పొలిటికల్ యువజన సమితి ఆధ్వర్యంలో మహ నీయుల జ్ఞాన పాదయాత్ర నిర్వహిస్తున్నట్లు జిల్లా అధ్యక్షుడు తంగళ్ళపల్లి గిరిధరాచారి తెలిపారు. శుక్రవారం జిల్లా కలెక్టరేట్ లో అదనపు కలెక్టర్లు భాస్కరరావు, వెంకారెడ్డి చేతుల మీదుగా పాదయాత్ర కరపత్రంను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ మలిదశ ఉద్యమంలో ప్రాణత్యాగం చేసిన శ్రీకాంత చారి స్వస్థలం పొడిచేడు గ్రామం నుండి 22 గ్రామాల మీదుగా యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రం వరకు భువనగిరిలో అంబేద్కర్ విగ్రహం వద్ద పాదయాత్ర ముగుస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు, జిల్లా నాయకులు నమోజ్ రాజు చారి, బూడిద ప్రశాంత్, కొం గరీ మహేష్, తొర్రి సురేష్ ,మహంకాళి సురేష్ చారి, పడిగం శ్రీనివాస్, కొంచెం రాజు బూడిద నాగరాజు, కానుగంటి ప్రేమ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## మృతి చెందిన ఉపాధ్యాయుడి కుటుంబానికి ఆర్థిక సాయం



ముద్ర, మోత్కూర్: ఇటీవల గుండెపోటుతో మరణించిన ఎస్జీటి ఉపాధ్యాయుడు కూరెల్ల ఎల్లయ్య కుటుంబ సభ్యులను పరామర్శించి టియు టీఎస్ పిఆర్ పిటియుసి సంక్షేమ నిధి నుండి రాష్ట్ర సంఘం తరపున ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్ రెడ్డి లక్ష రూపాయల చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో పి ఆర్ టి యుటిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుంకరి బిక్షం గౌడ్, రాష్ట్ర ఆడిట్ కమిటీ చైర్మన్ సోమిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ చైర్మన్ కోమటిరెడ్డి నర్సింహారెడ్డి, యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షుడు కుంట్ల అమరేందర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి గడసంతల మధుసూదన్, పిఆర్ టియు మాసపత్రిక రాష్ట్ర ఉప సంపాదకులు ధర్మారం వెంకటయ్య, జిల్లా క్రీడల చైర్మన్ బూడిద శ్రీనివాస్, మండల అధ్యక్షులు జంపాల రాజు, ప్రధాన కార్యదర్శి గొడుగు బాలరాజు, మండల కార్యదర్శి కూరెల్ల రవి, జిల్లా ఉపాధ్యక్షులు మందుల కృష్ణయ్య, మోత్కూరు అధ్యక్షులు గాదె వెంకటేశ్వర్లు, అడ్డగూడూర్ అధ్యక్ష కార్యదర్శులు రవీందర్, యాకస్వామి, తుర్కపల్లి అధ్యక్షులు బాషెట్టి విష్ణు, గుండాల ఎంఈఓ అగ్గిరాములు, నరేష్, సుధాకర్, యాదగిరి, ఆవుల వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపాలిటీలో అభివృద్ధి పనులపై దృష్టి సారించాలి

**- జిల్లా అదనపు కలెక్టర్ భాస్కర్ రావు**



ముద్ర ప్రతినిధి, భువనగిరి : మున్సిపాలిటీ పరిధిలో పెండింగ్ లో ఉన్న అభివృద్ధి పనులపై ప్రత్యేక దృష్టి సారించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు మున్సిపల్ కమిషనర్లకు సూచించారు. శుక్రవారం ఆయన ఛాంబర్లో మున్సిపల్ కమిషనర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరు మున్సిపాలిటీలలో అభివృద్ధి పనులు వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. పారిశుధ్యం విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని, ప్రతి వీధి శుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. చెత్త సేకరణ, పారవేతలో సమర్థవంతమైన విధానాలు పాటించాలని తెలిపారు. ఇంటి పన్ను వసూళ్లపై దృష్టి పెట్టాలని, వంద శాతం పన్ను వసూలు చేయాలని, లక్ష్యాలను నిర్దిష్ట గడువులోగా పూర్తి చేయాలని కమిషనర్లకు సూచించారు. మున్సిపల్ కార్యకలాపాలను మరింత సమర్థవంతంగా నిర్వహిస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఆయన పేర్కొన్నారు. అధికారులు సమన్వయంతో పనిచేస్తూ మున్సిపాలిటీ సమగ్ర అభివృద్ధికి కృషి చేయాలని అదనపు కలెక్టర్ సూచించారు.

ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్లు పాల్గొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
21.03.2026 శనివారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



### ఆరోగ్యకరమైన ఆహారం

సమతుల ఆహారం తీసుకోవడం ద్వారా శరీరానికి అవసరమైన శక్తి లభిస్తుంది. ఇది మానసిక స్థితిని కూడా మెరుగుపరుస్తుంది.



# యూరియా, గ్యాస్ కొరత సృష్టిస్తే చర్యలు

- అదనపు కలెక్టర్ నగేష్ హెచ్చరిక

**ముద్ర ప్రతినిధి, మెదక్ :**



యూరియా, గ్యాస్ కొరతను కృత్రిమంగా సృష్టిస్తే చర్యలు తప్పవని అదనపు కలెక్టర్ నగేష్ హెచ్చరించారు. పాపన్నపేట మండల కేంద్రం లోని రైతు అగ్రో సెంటర్, ప్యాక్స్ యూరియా, గ్యాస్ గోదాములను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఎరువులు, మందుల రికార్డులు, గ్యాస్ బుకింగ్ రికార్డులను పరిశీలించారు. జిల్లాలో ఎలాంటి ఎరువులు, మందులు, గ్యాస్ కొరత లేదని తెలిపారు. కృత్రిమ కొరత సృష్టిస్తే చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. రైతులు, వినియోగదారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు.

**విద్యార్థులకు మెనూ తప్పనిసరి అమలు**

విద్యార్థులకు మెనూను తప్పనిసరిగా అమలు చేయాలని అదనపు కలెక్టర్ నగేష్ సూచించారు. టేక్మాల్ మండల కేంద్రంలో విస్తృతంగా పర్యటించి ఆగ్రో సేవా కేంద్రం, గ్యాస్ గోదామును పరిశీలించారు. అనంతరం కేజీవీబీ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసి స్టోర్ రూమ్, కిచెన్, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. పాఠశాలలో నాణ్యమైన భోజనం, ఉచిత విద్య అందించాలని తెలిపారు. విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పించాలన్నారు. విద్యార్థులతో కలిసి భోజనం రుచి చూసిన ఆయన, ఆగ్రో సేవా కేంద్రంలో పలు రికార్డులు, స్టాక్ వివరాలను పరిశీలించారు. రైతులకు అవసరమైన మందులు, ఎరువులు అందుబాటులో ఉంచాలని, యూరియాను త్వరితగతిన అందించాలని సూచించారు. గ్యాస్ వినియోగదారులు గ్యాస్ సమస్యపై చింతించాల్సిన అవసరం లేదని, జిల్లాలో సరిపడ సిలిండర్లు ఉన్నాయని తెలిపారు. గ్యాస్ సమస్యను సృష్టిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## హామీల అమలులో ప్రభుత్వం విఫలం

- మాజీ ఎంపీ బూర నర్సయ్య గౌడ్ ఆరోపణలు



**ముద్ర ప్రతినిధి, సిద్దిపేట :**

కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలు, ముఖ్యంగా 6 గ్యారెంటీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని మాజీ ఎంపీ బూర నర్సయ్య గౌడ్ మండిపడ్డారు. హామీలు అమలు చేయాలని కోరుతూ శుక్రవారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు బైరి శంకర్ ముదిరాజ్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట నిర్వహించిన ధర్నాలో ఆయన పాల్గొన్నారు. అనంతరం పరిపాలన అధికారి రాజ్‌కుమార్‌కు హామీలు అమలు చేయాలని కోరుతూ వినతిపత్రం సమర్పించి మాట్లాడారు. రుణమాఫీ, నిరుద్యోగ భృతి, మహిళలకు నెలకు రూ. 2,500 వంటి హామీలను ప్రభుత్వం నెరవేర్చలేదని విమర్శించారు. ఆరు గ్యారెంటీలు, 420 హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తోందని ఆరోపించారు. రైతులకు హామీ ఇచ్చిన విధంగా రుణమాఫీ పూర్తిగా అమలు కాలేదని, రైతన్నను నిలువునా మోసం చేస్తున్నారని ధ్వజమెత్తారు. గ్యారెంటీలను అమలు చేసే వరకు పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో వంగ రామచంద్రారెడ్డి, కొత్తపల్లి వేణుగోపాల్, బాసంగారి వెంకట్, కాసన గొట్టు సంతోష్, గాడిపల్లి భాస్కర్, విభీషణ్ రెడ్డి, తొడుపునూరి వెంకటేశం, మనోహర్, ప్రసాద్, అశోక్, శ్రీనివాస్, సత్యనారాయణ, కెమ్మసారం సంతోష్, సునీల్, కార్తీక్ కనకరాజు, ఉమారెడ్డి, పద్మ తదితరులు పాల్గొన్నారు.

## హామీలను అటకెక్కించిన బడ్జెట్

**ముద్ర ప్రతినిధి, సిద్దిపేట :**



రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం తాను ఇచ్చిన హామీలను అటకెక్కించిందని, బడ్జెట్‌లో కేటాయింపులు చేయకుండా హామీలను విస్మరించిందని సీపీఎం సిద్దిపేట జిల్లా కార్యదర్శి అముదాల మల్లారెడ్డి విమర్శించారు. శుక్రవారం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన రూ. 3,24,234 కోట్ల బడ్జెట్‌లో పేదలకు ఇచ్చిన హామీలకు కేటాయింపులు చేయకుండా ప్రజలను మభ్యపెడుతున్నారని అన్నారు. బడ్జెట్‌లో మహాలక్ష్మి పథకంలో భాగంగా మహిళలకు ₹2,500, నిరుద్యోగ యువతకు నిరుద్యోగ భృతి, ఆశ వర్కర్లకు జీతాల పెంపు, వృద్ధాప్య, వితంతు, వికలాంగుల పెన్షన్ల పెంపు, ఉద్యోగుల పీఆర్సీ వంటి అనేక వాగ్దానాలకు కేటాయింపులు చేయకుండా మొండి చేయి చూపిందని విమర్శించారు. ఇది ప్రజలను మోసగించే బడ్జెట్ అని పేర్కొన్నారు. ఈ బడ్జెట్ పేదల బడ్జెట్ కాకుండా పెద్దల బడ్జెట్‌గా మారిందని వ్యాఖ్యానించారు.

## బడ్జెట్‌లో విద్యారంగానికి అన్యాయం

- ఏఐపీఎస్యూతో మన్నె కుమార్

**ముద్ర ప్రతినిధి, సిద్దిపేట :**



తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో విద్యారంగానికి తీవ్ర అన్యాయం జరిగిందని అఖిల భారత ప్రగతిశీల విద్యార్థి సంఘం (ఏఐపీఎస్యూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మన్నె కుమార్ అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ దేశ భవిష్యత్తు నాలుగు గోడల మధ్యే ఉంటుందని, వారి భవిష్యత్తు కోసం కేంద్ర బడ్జెట్‌లో 10 శాతం, రాష్ట్ర బడ్జెట్‌లో 30 శాతం నిధులు కేటాయించాలని గతంలోనే విద్యారంగ నిపుణులు, మేధావులు కొఠారి కమిషన్ సిఫార్సుల్లో పేర్కొన్నారని తెలిపారు. అయితే నేడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వాటిని బేఖాతరు చేస్తూ ఇష్టారీతిగా వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. 2026-27 ఆర్థిక సంవత్సరానికి ప్రతిపాదించిన రూ. 3,24,234 కోట్ల బడ్జెట్‌లో విద్య, మానవ వనరులకు కేటాయించింది కేవలం రూ. 26,674 కోట్లు మాత్రమేనన్నారు. ఇది మొత్తం బడ్జెట్‌లో 8.2 శాతమేనని, దీని వల్ల విద్యారంగ సమస్యల పరిష్కారానికి తాత్కాలిక ఉపశమనం కూడా లభించే అవకాశంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఇప్పటికే స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ రాకపోవడంతో చాలా మంది విద్యార్థులు చదువులు మధ్యలో ఆపివేసే పరిస్థితులు నెలకొన్నాయని తెలిపారు. ప్రభుత్వం వెంటనే పునరాలోచన చేసి విద్యారంగానికి అధిక నిధులు కేటాయించాలని ఏఐపీఎస్యూ డిమాండ్ చేసింది.

## నిరాశపరిచిన రాష్ట్ర బడ్జెట్

- పిఆర్టీయు రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు మల్లారెడ్డి

**ముద్ర ప్రతినిధి, మెదక్ :**



అసెంబ్లీలో ఆర్థిక మంత్రి మల్లు బట్టి విక్రమార్క ప్రవేశపెట్టిన బడ్జెట్ ఉద్యోగ, ఉపాధ్యాయులకు నిరాశపరిచిందని పిఆర్టీయు రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు మల్లారెడ్డి తెలిపారు. ప్రభుత్వ. పాఠశాలను బలోపేతం చేస్తామని ప్రకటించిన రాష్ట్ర ప్రభుత్వం ఈ బడ్జెట్లో విద్యకు సరిపోవు కేటాయింపులు కేటాయించకపోవడం విచారకరమన్నారు. బడ్జెట్లో పెండింగ్ బిల్లులు, పిఆర్సి ప్రస్తావన లేకపోవడం శోచనీయమన్నారు. కొఠారి కమిషన్ ప్రకారం ప్రభుత్వ పాఠశాల బాగోగులు, గ్రామీణ ప్రాంతానికి చెందిన చాలా ఎక్కువ మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలో విద్యాలభ్యసిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలలు మెరుగుపడాలంటే 15 శాతం నిధులు కేటాయించాల్సిన అవసరం ఉందన్నారు. రెండేళ్లుగా పదవీ విరమణ పొందిన ఉద్యోగ, ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులు, పెండింగ్ డీఏ బకాయిల గురించి ఈ బడ్జెట్లో ప్రస్తావన లేకపోవడం విచారకమన్నారు.

## పాముకాటుతో బాలిక మృతి

**ముద్ర ప్రతినిధి, సంగారెడ్డి :**



సంగారెడ్డి జిల్లా, హత్నూర మండలం కాసాల గ్రామంలో శుక్రవారం పాముకాటుతో ఓ బాలిక మృతి చెందింది. కుటుంబీకులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మాచినూరు సింధుజ (17) దౌల్తాబాద్‌లోని ప్రైవేట్ కళాశాలలో ఒకేషనల్ కోర్సు చదువుతోంది. ఉగాది పండుగ సందర్భంగా ఇంటిని శుభ్రం చేస్తుండగా పాముకాటుకు గురైంది. తొలుత ఎలుక కరిచినట్లు అనుకుని సాయంత్రం వరకు పట్టించుకోలేదు. అనంతరం నురగలు రావడంతో హుటాహుటిన సంగారెడ్డి ఆసుపత్రికి తరలించగా, మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందినట్లు కుటుంబీకులు తెలిపారు.

# డిజిటల్ హెల్త్ ప్రొఫైల్‌కు శ్రీకారం

- సిబ్బందికి శిక్షణ

**ముద్ర ప్రతినిధి, సంగారెడ్డి :**



సంగారెడ్డి జిల్లాలో పైలెట్ ప్రాజెక్టుగా డిజిటల్ హెల్త్ ప్రొఫైల్ అమలుకు శ్రీకారం చుట్టగా, సంబంధిత సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. రోగుల పూర్తి వైద్య వివరాలను డిజిటల్ రూపంలో నమోదు చేసే విధంగా అన్ని ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ప్రావీణ్య సూచించారు. డిజిటల్ హెల్త్ ప్రొఫైల్ అమలుకు సంబంధించి డాటా ఎంట్రీ ఆపరేటర్లు, మెడికల్ ఆఫీసర్లు, స్పెషలిస్ట్ డాక్టర్లకు శిక్షణ కార్యక్రమాన్ని శుక్రవారం సంగారెడ్డి జిల్లా మెడికల్ కళాశాల కాన్ఫరెన్స్ హాల్లో కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడారు. సంగారెడ్డి డివిజన్‌లో పైలెట్ ప్రాజెక్టుగా డిజిటల్ హెల్త్ ప్రొఫైల్‌ను ప్రారంభిస్తున్నామని తెలిపారు. జీజీహెచ్, జోగిపేట్, పటాన్‌చెరు ఏరియా ఆసుపత్రులు, సదాశివపేట సీహెచ్సీతో పాటు సంగారెడ్డి డివిజన్ పరిధిలోని 15 పీహెచ్సీలలో సోమవారం నుంచి ఈ ప్రాజెక్ట్ అమలుకు అవసరమైన అన్ని ఏర్పాట్లను సిద్ధం చేయాలని సూచించారు. సంబంధిత సిబ్బంది తమ సిస్టమ్స్, మొబైల్ ఫోన్లలో అవసరమైన సాఫ్ట్‌వేర్ లేటెస్ట్ వెర్షన్‌లో ఉందో లేదో ముందుగానే పరిశీలించాలని, అందరికీ లాగిన్ సదుపాయం ఉండేలా చూసుకోవాలన్నారు. ఇంటర్నెట్ సౌకర్యం లేని చోట వెంటనే ఏర్పాటు చేయాలని ఆదేశించారు. రోగి ఆసుపత్రికి వచ్చిన మొదటి దశ నుంచి చికిత్స పూర్తయ్యే వరకు ఓపీ, మెడికల్ ఆఫీసర్, ల్యాబ్, ఫార్మసీ తదితర విభాగాల్లో రోగి వైద్య చరిత్రను డిజిటల్ రూపంలో నమోదు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. రోగులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా సేవలు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఎంఅండ్‌హెచ్ఓ వసంతరావు, జీజీహెచ్ సూపరింటెండెంట్ మురళీకృష్ణ, డాక్టర్ శశాంక్, స్పెషలిస్ట్ డాక్టర్లు, మెడికల్ ఆఫీసర్లు, డాటా ఎంట్రీ ఆపరేటర్లు, టెక్నికల్ సిబ్బంది పాల్గొన్నారు.

## జీవ ఇంధన పరిశోధనలో సంఘమిత్రకు డాక్టరేట్ ప్రదానం

**ముద్ర ప్రతినిధి, సిద్దిపేట :**



విద్యారంగంలో ఎంతో ప్రతిష్టాత్మకమైన బిర్లా ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ (బిట్స్) విశ్వవిద్యాలయంలో జీవ ఇంధనంపై పరిశోధన చేసిన సామ నర్ర సంఘమిత్రకు డాక్టరేట్ పట్టా ప్రదానం చేశారు. సంఘమిత్ర గతంలో ఉస్మానియా విశ్వవిద్యాలయం మెకానికల్ ఇంజనీరింగ్ విభాగంలో ఎం.టెక్ పూర్తి చేసి, అనంతరం హైదరాబాద్ బిట్స్‌లో పరిశోధక విద్యార్థిగా పీహెచ్‌డీలో చేరారు. 'డెవలప్మెంట్ అండ్ ఇన్వెస్టిగేషన్ ఆఫ్ మైక్రో అల్గే బయోడీజిల్ బ్లెండ్స్ ఆల్టర్నేట్ ప్యూయల్ ఫర్ సీఐ ఇంజన్' అనే అంశంపై ఆమె పరిశోధనలు చేశారు. సిద్దిపేట ప్రియదర్శిని నగర్ కాలనీకి చెందిన సంఘమిత్ర, హైదరాబాద్‌లోని బిట్స్ మెకానికల్ ఇంజనీరింగ్ విభాగంలో సందీప్ ఎస్ దేశ్ముఖ్ మార్గదర్శకత్వంలో పరిశోధన చేసి థీసిస్ సమర్పించారు.

## విద్యా రంగానికి కేటాయింపులు పెంచాలి

- టిపిటిఎఫ్ డిమాండ్

**ముద్ర ప్రతినిధి, మెదక్:**

బడ్జెట్ లో విద్యారంగానికి కేటాయింపులు నిరాశాజనకంగా ఉన్నాయని టిపిటిఎఫ్ మెదక్ జిల్లా అధ్యక్షులు కె. యాదగిరి, జిల్లా ప్రధాన కార్యదర్శి పి. వెంకట్ రామ్ రెడ్డి పేర్కొన్నారు. అసెంబ్లీలో ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క ప్రవేశపెట్టిన 3,24,234 కోట్ల బడ్జెట్ లో విద్యారంగానికి 26,674 కోట్లు మాత్రమే కేటాయింపులు చేశారు. అంటే మొత్తం బడ్జెట్ లో కేవలం 8.22% మాత్రమేనని అన్నారు. రాష్ట్రంలో ఉద్యోగుల, ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లుల విలువ దాదాపు 11 వేల కోట్ల రూపాయల వరకు ఉందని వీటి గురించి రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్ లో ఎలాంటి కేటాయింపులు చేయలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతిపక్ష పార్టీలు, ప్రజా సంఘాలు, విద్యా వేత్తలు కూడా బడ్జెట్ పెంపుదల కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్ ప్రతిపాదనలకు సవరణ చేసి అధిక నిధులు కేటాయించకపోతే విద్యా ఉద్యమాలను తీవ్రతరం చేస్తామన్నారు.

## ఘనంగా కుస్తీ పోటీలు

**ముద్ర ప్రతినిధి,సంగారెడ్డి:**

ఆందోల్ నియోజకవర్గ పరిధిలోని టేక్మాల్ మండల పరిధిలోని ఏల్లుపేట గ్రామంలో ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని ప్రతి ఏటా నిర్వహించే నల్ల పోచమ్మ,దుర్గమ్మ,గ్రామ దేవతల జాతర మహోత్సవలో భాగంగా రెండవ రోజు శుక్రవారం ఉదయం గ్రామ దేవతామూర్తుల దేవాలయాల చుట్టూ డప్పు చప్పులతో చిందుల విన్యాసాలతో కుల మతాలకు అతీతంగా పచ్చి మట్టి కుండలతో బోనాలు కుదించి అందులో పెరుగు నైవేద్యాన్ని పెట్టి శివసత్తుల నృత్యలతో గ్రామ పురవీధుల గుండా గ్రామదేవతలకు బోనాల ఊరేగింపు నిర్వహించారు. అంతాపూర్ గ్రామానికి చెందిన గంగాధర్ పైల్వాన్ కుస్తీ గెలుపొందాడు. గెలుపొందిన కుస్తీ ఫైల్వాన్ కు గ్రామ సర్పంచ్ మాదవి నరసింహారెడ్డి,ఉప సర్పంచ్ కుమ్మరి లక్ష్మయ్య చేతుల మీదుగా శాలువా కప్పి ఐదు తులాల వెండి కడెంను బహుకరించారు.

## జోగిపేటలో తోఫాల పంపిణీ

**ముద్ర ప్రతినిధి,సంగారెడ్డి:**

ఆందోల్ నియోజకవర్గ పరిధిలోని జోగిపేట మున్సిపాలిటీలోని 11వ వార్డులో ముస్లిం సోదర సోదరీ మణులకు రంజాన్ పండుగ సందర్భంగా ఈద్ కా తోఫా పంపిణీ చేసిన 11వ వార్డ్ కౌన్సిలర్ గూడెం కల్పనా నాగరాజు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు మదారి నాగరాజు,కడల కృష్ణకుమార్, బక్కమొల్ల మల్లేశం,మదరి సంతోష్ కుమార్, అతినారం మురళి యాదవ్, 11వ వార్డ్ ప్రజలు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## బడ్జెట్ లో కార్మిక వర్గానికి మొండి చేయి

**ముద్ర ప్రతినిధి, మెదక్:**



రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ లో కార్మిక వర్గానికి మొండి చేయి చూపారని బీఆర్టీయు జిల్లా అధ్యక్షుడు జుబేర్ అహ్మద్ అన్నారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి కార్మిక వర్గానికి అనేక హామీలు ఇచ్చిందని ఇచ్చింది. బడ్జెట్లో నిధులు కేటాయింపు లేకుండా ఏ విధంగా నెరవేరుతాయని ప్రశ్నించారు. ఇప్పటికీ మూడు బడ్జెట్లు ప్రవేశపెట్టిన రాష్ట్ర ప్రభుత్వం ఈ బడ్జెట్లో ఉద్యోగ, కార్మిక వర్గానికి నిధుల కేటాయింపు జరగలేదన్నారు. ఆశాలు అంగన్ వాడీలకు, ఫీల్డ్ అసిస్టెంట్లకు 18 వేల రూపాయల చొప్పున, మధ్యాహ్న భోజన కార్మికులకు వివోఏలకు, ఆర్పిలకు 10 వేల రూపాయలు, మున్సిపల్ కార్మికులకు, కాంట్రాక్టు ఔట్సోర్సింగ్ కార్మికులకు 24 వేల రూపాయలు, అసంఘటిత కార్మికుల సంక్షేమానికి సంక్షేమ బోర్డు, ఆటో కార్మికులకు పదివేల రూపాయల భృతి ఇవ్వాలని డిమాండ్ చేశారు.

## అంకెల గారడీ బడ్జెట్

- సీపీఎం జిల్లా కార్యదర్శి నర్సమ్మ

**ముద్ర ప్రతినిధి, మెదక్ :**



తెలంగాణ బడ్జెట్ అంకెల గారడీ అని సీపీఎం జిల్లా కార్యదర్శి కె. నర్సమ్మ విమర్శించారు. కొత్త ప్రాజెక్టులు, మౌలిక వసతుల కోసం కేటాయించింది కేవలం 14.5 శాతం మాత్రమే. వ్యవసాయానికి 23,179 కోట్లు, విద్యకు 26,674 కోట్లు గతం కంటే తగ్గిందన్నారు. ప్రజా వైద్యం, ఆరోగ్యంకు 13,679 కోట్లు సరిపోవన్నారు. ఇందిరమ్మ ఇళ్లకు కేవలం 5,500 కోట్లు మాత్రమే కేటాయించారు. లక్షలాది మందికి ఇళ్లు కట్టడానికి ఈ నిధులు ఏ మూలకు సరిపోవన్నారు. మొత్తంగా పరిశీలిస్తే రాష్ట్ర ప్రభుత్వం అంకెలకే పరిమితమైందన్నారు. ప్రజలకు ఉపయోగపడే విధంగా బడ్జెట్ లేదన్నారు. నిధుల ఖర్చులో వైఫల్యం చెందిందన్నారు. ప్రభుత్వం పునరాలోచించి బడ్జెట్ కేటాయింపులు ముఖ్య రంగాలకు పెంచాలని ఆమె ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## పరీక్ష కేంద్రాల్లోకి మొబైల్ ఫోన్లకు అనుమతి లేదు

- కలెక్టర్ పి.ప్రావీణ్య

**ముద్ర ప్రతినిధి, సంగారెడ్డి,**




జిల్లాలో కొనసాగుతున్న పదవ తరగతి పరీక్షల సందర్భంగా పరీక్ష కేంద్రాల్లోకి మొబైల్ ఫోన్లకు అనుమతి లేదని జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య స్పష్టం చేశారు.నిబంధనలు కచ్చితంగా పాటించాలని అధికారులకు ఆదేశించారు. జిల్లాలో కొనసాగుతున్న పదవ తరగతి పరీక్షలను పారదర్శకంగా,కట్టుదిట్టంగా నిర్వహించేందుకు అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు.శుక్రవారం కలెక్టర్ క్యాంప్ కార్యాలయం నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా చీఫ్ సూపరింటెండెంట్లు, ఎంఈఓలు,డిపార్ట్మెంటల్ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె దిశానిర్దేశం చేశారు. పరీక్ష కేంద్రాల్లోకి ఎవరూ మొబైల్ ఫోన్లు తీసుకురావద్దని,కేంద్రంలో ఉన్న సిబ్బంది సహా ఎవరి వద్దా మొబైల్ ఫోన్లు ఉండకూడదని స్పష్టం చేశారు.పరీక్ష ప్రారంభానికి ముందు ప్రతి హాలును క్షుణ్ణంగా పరిశీలించి చూడాలని సూచించారు. అన్ని కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి పర్యవేక్షణ కొనసాగుతున్నట్లు తెలిపారు. ప్రతి పరీక్ష కేంద్రానికి ఫ్లయింగ్ స్క్వాడ్‌లను నియమించి నిరంతరం తనిఖీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పరీక్షల నిర్వహణలో ఏమైనా సమస్యలు ఉన్నాయా అని అధికారులను అడిగి తెలుసుకొన్నారు. ఈసమావేశంలో జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు, ఎంఈఓలు,చీఫ్ సూపరింటెండెంట్లు, డిపాట్మెంటల్ అధికారులు పాల్గొన్నారు.

## అలరించిన ఉగాది కవి సమ్మేళనం

- పాల్గొన్న నందిని సిధారెడ్డి

**ముద్ర ప్రతినిధి, మెదక్:**



తెలంగాణ రచయితల సంఘం మెదక్ జిల్లా ఆధ్వర్యంలో ఉగాది కవి సమ్మేళనం తెలంగాణ భవన్ లో శుక్రవారం నిర్వహించారు. ఈ కవి సమ్మేళనంలో ముఖ్యఅథితులుగాతెలంగాణ సాహిత్య అకాడమీ తొలి అధ్యక్షులు నందిని సిధారెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ కానుగు రాధిక, తెరసం రాష్ట ఉపాధ్యక్షులు దేవేందర్ రెడ్డి పాల్గొన్నారు. తె ర.సం. జిల్లా అధ్యక్షురాలు కవిత మాట్లాడుతూ.. .తెలంగాణలో నందిని సిధారెడ్డికి కేంద్ర సాహిత్య పురస్కారం వరించడం గర్వకారణం అన్నారు. చైర్ పర్సన్ రాధిక మాట్లాడుతూ.. మన మెతుకు సీమ బిడ్డకు కేంద్ర సాహిత్య పురస్కారం వరించడం మనందరికీ గర్వకారణం అన్నారు. కవులుగా మేమందరం గర్వపడుతున్నామన్నారు. అనంతరం సిధారెడ్డి ఘనంగా సన్మానించారు.నందిని సిద్ధారెడ్డి మాట్లాడుతూ ఈ పురస్కారం కవులందరికీ వరించినట్టేనని అందరికీ ధన్యవాదములు అన్నారు. అనంతరం కవులు వినిపించిన కవితలతో సభ మార్మోగింది. ఈ సమ్మేళనంలో కవులు, టివిఎన్జీఓ కేంద్ర కమిటీ సభ్యురాలు అనురాధ, ఎం.డి ఇక్బాల్, కవయిత్రి అంజలి, ఉపాధ్యాయులు ఆంజాగౌడ్, సినీ గేయ రచయిత సాయి సిరి, బుర్ర సంతోష్, వెంకటేశం, రాగుల మల్లేశం, దుర్గరాములు, నవీన తేదితరులు పాల్గొన్నారు.

## 'ఇందిరమ్మ బీమాతో ప్రభుత్వానికి ప్రత్యేక గుర్తింపు'

**ముద్ర ప్రతినిధి, మెదక్ :**

ఇందిరమ్మ కుటుంబ జీవిత భీమా పథకంను ప్రవేశపెట్టి రాష్ట్రంలోని సుమారు 1.15 కోట్ల కుటుంబాలకు భద్రత కల్పించడం కాంగ్రెస్ ప్రభుత్వ దూరదృష్టిని ప్రతిబింబిస్తుందని రాజీవ్ గాంధీ పంచాయతీ రాజ్ సంఘటన్ జాతీయ కన్వీనర్ మహేందర్ రెడ్డి పేర్కొన్నారు. దేశంలోనే ప్రత్యేకంగా పేద, ధనిక తేడా లేకుండా ప్రతి కుటుంబానికి రూ. 5లక్షల భీమా అందించడం ద్వారా అనుకోని పరిస్థితుల్లో కుటుంబాలకు ఆర్థిక రక్షణ కల్పించబడుతుందన్నారు.

పాజిటివ్ వ్యక్తులతో సమయం గడపడం
మిమ్మల్ని ప్రోత్సహించే వ్యక్తులతో ఎక్కువ సమయం గడపండి. ఇది మీలో ధైర్యాన్ని పెంచి, నెగటివిటీని తగ్గిస్తుంది.





# నిలిచిపోయిన మెట్రో రైళ్లు..

- 30 నిమిషాలపాటు ప్రయాణికులకు నరకం

**ముద్ర డెస్క్ :**

నిత్యం వేలాది మందిని గమ్యస్థానాలకు చేర్చే హైదరాబాద్ మెట్రో రైలు సేవల్లో నేడు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ముఖ్యంగా నగరంలో అత్యంత రద్దీగా ఉండే నాగోల్ రాయదుర్గం మార్గంలో సాంకేతిక లోపం తలెత్తడంతో రైళ్లు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. దీంతో ఆఫీసులకు, కళాశాలలకు వెళ్లే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ ఉదయం రద్దీ సమయంలో నాగోల్ నుండి రాయదుర్గం వెళ్లే మార్గంలో ఒక్కసారిగా మెట్రో రైళ్లు నిలిచిపోయాయి. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. సిగ్నలింగ్ వ్యవస్థలో లేదా విద్యుత్ సరఫరాలో తలెత్తిన సాంకేతిక సమస్యే దీనికి ప్రధాన కారణం. రైళ్లు స్టేషన్ల మధ్యలో, పట్టాలపైనే నిలిచిపోవడంతో లోపల ఉన్న ప్రయాణికులు ఉక్కపోతతో, ఆందోళనతో గడిపారు. రైళ్లు కదలకపోవడంతో ప్రయాణికులు మెట్రో కోచ్‌లలోనే సుమారు 30 నిమిషాల పాటు చిక్కుకుపోయారు. సోషల్ మీడియా వేదికగా పలువురు ప్రయాణికులు తమ గోడును వెళ్లబోసుకున్నారు. రైల్వే స్టేషన్లలో కూడా రద్దీ విపరీతంగా పెరిగిపోయి, ప్రయాణికుల మధ్య తోపులాట వంటి దృశ్యాలు కనిపించాయి. ముఖ్యంగా అమీర్‌పేట్, ప్రకాష్ నగర్, హైటెక్ సిటీ స్టేషన్లలో రద్దీని నియంత్రించడం సిబ్బందికి కష్టతరంగా మారింది. మెట్రో సాంకేతిక బృందం యుద్ధ ప్రాతిపదికన రంగంలోకి దిగి మరమ్మతులు చేపట్టింది. సుమారు 30 నిమిషాల కృషి తర్వాత సాంకేతిక లోపాన్ని సరిదిద్దారు. అనంతరం మెట్రో రైలు సేవలు తిరిగి ప్రారంభమయ్యాయని, ప్రస్తుతం సర్వీసులు యధావిధిగా నడుస్తున్నాయని హైదరాబాద్ మెట్రో రైలు సంస్థ అధికారికంగా ప్రకటించింది. ప్రయాణికులకు కలిగిన అంతరాయానికి సంస్థ విచారం వ్యక్తం చేసింది.

# భద్రాచలం దేవస్థానం అభివృద్ధికి మాస్టర్ ప్లాన్

- మూడు దశల్లో అభివృద్ధి పనులు
- మాస్టర్ ప్లాన్‌పై చర్చించిన మంత్రులు పొంగులేటి, సురేఖ, తుమ్మల, వాకాటి



**ముద్ర, భద్రాచలం :**

తెలంగాణలోని ప్రముఖ పుణ్యక్షేత్రం భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానం అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం భద్రాచలాన్ని అంతర్జాతీయ స్థాయి ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు కట్టుబడి ఉందని రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, కొండా సురేఖ, తుమ్మల నాగేశ్వరరావు, వాకాటి శ్రీహరి తెలిపారు. శుక్రవారం హైదరాబాద్ సచివాలయంలోని మంత్రి కొండా సురేఖ కార్యాలయంలో భద్రాచలం దేవస్థాన అభివృద్ధి మాస్టర్ ప్లాన్‌పై సమీక్ష సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ, ఆగమ శాస్త్రం ప్రకారం భక్తుల భావాలను దృష్టిలో ఉంచుకుని ఆలయాన్ని మూడు దశల్లో అభివృద్ధి చేయాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. దీర్ఘకాల దృష్టితో సుమారు 200 సంవత్సరాల అవసరాలను దృష్టిలో పెట్టుకుని ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు తెలిపారు. ఈ మాస్టర్ ప్లాన్‌కు తుది రూపు ఇవ్వడానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో చర్చించనున్నట్లు పేర్కొన్నారు. వచ్చే ఏడాది జరిగే గోదావరి పుష్కరాలు నాటికి పుష్కర ఘాట్‌తో పాటు మొదటి దశ పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. భద్రాచలాన్ని తెలంగాణలోనే అతిపెద్ద ఆధ్యాత్మిక హబ్‌గా అభివృద్ధి చేయడమే లక్ష్యమని మంత్రులు తెలిపారు. భద్రాచలం సమీపంలోని రామవరం ప్రాంతంలో ట్రైబల్ మ్యూజియం ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. అలాగే పుష్కరాల సందర్భంగా కొరివి వీరభద్రస్వామి దేవాలయం మరియు మల్లూరు నరసింహా స్వామి దేవాలయంలను కూడా అభివృద్ధి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో పార్లమెంట్ సభ్యుడు బలరాం నాయక్, ఎమ్మెల్యే తెల్లం వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

# దీదీ కోటపై కమలనాథుల గురి!

**ముద్ర డెస్క్ :**

పశ్చిమ బెంగాల్ రాజకీయ క్షేత్రం మరోసారి రణరంగాన్ని తలపిస్తోంది. గత 15 ఏళ్లుగా ముఖ్యమంత్రి కుర్చీలో తిరుగులేని శక్తిగా వెలుగుతున్న తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీకి ఈసారి ఎలాగైనా చెక్ పెట్టాలని బీజేపీ అధిష్టానం 'ఆపరేషన్ బెంగాల్' పేరుతో భారీ వ్యూహాన్ని సిద్ధం చేసింది.

**వరుస విజయాలకు బ్రేక్ వేసేలా..**

2011 నుంచి బెంగాల్ రాజకీయాలను శాసిస్తున్న మమతా బెనర్జీ, వరుసగా మూడు సార్లు విజయం సాధించి హ్యాట్రిక్ కొట్టారు. అయితే, ఈసారి పరిస్థితి భిన్నంగా ఉంటుందని కాషాయ దళం భావిస్తోంది. గత ఎన్నికల్లో ఓటమి నుంచి పాఠాలు నేర్చుకున్న బీజేపీ, ఈసారి కేవలం భావోద్వేగ అంశాలకే పరిమితం కాకుండా, క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేయడంపై దృష్టి సారించింది.

**కమలనాథుల సరికొత్త వ్యూహం..**

ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకతను ప్రధాన ఆయుధంగా మలుచుకోవడం.బూత్ స్థాయి నుంచి పార్టీ క్యాడర్‌ను పటిష్టం చేస్తూ, తృణమూల్ దాడులను తట్టుకునేలా యంత్రాంగాన్ని సిద్ధం చేయడం... అమిత్ షా, జేపీ నడ్డా వంటి అగ్రనేతలు నేరుగా బెంగాల్ రాజకీయ వ్యవహారాలను పర్యవేక్షిస్తూ, ఎప్పటికప్పుడు దిశానిర్దేశం చేస్తున్నారు.

**సవాల్‌గా మారిన 'దీదీ' ఇమేజ్..**

బీజేపీ ఎన్ని ఎత్తుగడలు వేస్తున్నా, మమతా బెనర్జీకి ఉన్న మాస్ ఇమేజ్, మహిళా ఓటు బ్యాంక్ కమలనాథులకు సవాల్‌గా నిలుస్తోంది. "దీదీని గద్దె దించడం ఖాయం" అని కాషాయం నాయకులు ధీమా వ్యక్తం చేస్తుండగా, "బెంగాల్ గడ్డపై మరోసారి తృణమూల్ జెండానే ఎగురుతుంది" అని టీఎంసీ నేతలు ధీటుగా బదులిస్తున్నారు. మొత్తానికి 'ఆపరేషన్ బెంగాల్' సక్సెస్ అవుతుందా? లేదా మమత తన అజేయమైన రికార్డును కొనసాగిస్తారా? అన్నది ఇప్పుడు దేశ వ్యాప్తంగా ఉత్కంఠ రేపుతోంది.

# ఇక కొత్త విద్యావిధానం

- టెన్త్ పరీక్షలు ఉండవు
- రాష్ట్రంలో వంద పబ్లిక్ స్కూళ్లు
- నర్సరీ నుంచి ఇంటర్ వరకు ఒకే విధానం
- మీడియా చిట్ చాట్‌లో సీఎం రేవంత్ రెడ్డి





**ముద్ర, తెలంగాణ బ్యూరో :**

తెలంగాణ కొత్త విద్యావిధానంలో టెన్త్ పరీక్షలు ఉండవని, పన్నెండో తరగతి వరకూ ఒకే పద్ధతిలో బోధన ఉంటుందని సీఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు. సీఎం రాష్ట్ర విద్యావ్యవస్థలో తీసుకురాబోతున్న విప్లవాత్మక మార్పుల గురించి కీలక వ్యాఖ్యలు చేశారు. కొత్త విద్యా విధానంలో టెన్త్ పరీక్షలు ఉండవని ప్రకటించారు. విద్యావ్యవస్థను పూర్తిస్థాయిలో మార్చి అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా సిద్ధం చేస్తామన్నారు. ఇటీవల ప్రభుత్వం నియమించిన కమిటీ నూతన విద్యావిధానంపై నివేదిక ఇచ్చింది. సీఎం రేవంత్ రెడ్డి ప్రస్తావించిన ముఖ్యమైన మార్పు వన్ బోర్డ్ ఫర్ ఆల్ క్లాసెస్ . అంటే ప్రస్తుతం ఉన్న వేర్వేరు బోర్డులను కలిపి ఒకే గొడుగు కిందకు తీసుకువచ్చి, విద్యా విధానాన్ని సరళీకృతం చేయాలని ప్రభుత్వం యోచిస్తోంది. జాతీయ విద్యా విధానం ప్రకారం భవిష్యత్తులో టెన్త్ బోర్డు పరీక్షల ప్రాముఖ్యతను తగ్గించి, విద్యార్థులపై ఒత్తిడి లేకుండా సెమిస్టర్ పద్ధతి ,ఇతర మూల్యాంకన పద్ధతులను ప్రవేశపెట్టే ఆలోచనలో ఉన్నట్లుగా తెలుస్తోంది.

### కార్పొరేట్ కు దీటుగా

తెలంగాణలోని ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్థాయికి దీటుగా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని గతంలో సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. పదేళ్లుగా నిర్లక్ష్యానికి గురైన విద్యా రంగాన్ని ప్రక్షాళన చేస్తామని, ఇందుకోసం బడ్జెట్‌లో భారీగా నిధులు కేటాయిస్తున్నామని తెలిపారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. ఇక్కడ కులమతాలకు అతీతంగా విద్యార్థులందరికీ ఒకే చోట నాణ్యమైన విద్య, వసతి కల్పిస్తామని చెబుతూ వస్తున్నారు. కేవలం డిగ్రీలు పట్టా పుచ్చుకోవడం కాకుండా, విద్యార్థులకు చేతినిండా పని దొరికేలా యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ ని ప్రతిష్టాత్మకంగా తీసుకువస్తున్నారు. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా కోర్సులను రూపొందించి, విద్యార్థులకు నైపుణ్య శిక్షణ ఇస్తామని చెప్పారు. దీనివల్ల చదువు పూర్తికాగానే యువతకు ఉద్యోగ అవకాశాలు మెరుగుపడతాయని, నిరుద్యోగ సమస్యను రూపుమాపవచ్చని ధీమా వ్యక్తం చేశారు. టాటా లాంటి దిగ్గజ సంస్థల భాగస్వామ్యంతో ఐటీఐలను కూడా అప్‌గ్రేడ్ చేస్తున్నట్లు పేర్కొన్నారు.

### మేం రాజీపడం

పాఠశాలల్లో చదివే విద్యార్థుల ఆరోగ్యం, పౌష్టికాహారం విషయంలో ప్రభుత్వం రాజీ పడబోదని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ముఖ్యంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకు కూడా మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయాలని నిర్ణయించినట్లు చెప్పారు. అలాగే, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా పాఠశాలల నిర్వహణ బాధ్యతలను మహిళా సంఘాలకు అప్పగించామని, తద్వారా స్థానికంగా పర్యవేక్షణ మెరుగుపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. సీఎం చేసిన పరీక్షల రద్దు అంశంపై ప్రభుత్వం త్వరలో క్లారిటీ ఇవ్వనుంది.

# ఆరు గ్యారెంటీలకు గోరీ

- హామీల అమలుపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదు
- ఇందిరమ్మ, రాజీవ్ గాంధీ పేరుతో ఉన్న పథకాలకూ నిధుల్లేవు
- రాష్ట్ర బడ్జెట్ పై బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు ఆరోపణ



**ముద్ర, తెలంగాణ బ్యూరో :**

ప్రభుత్వం తాను ప్రవేశపెట్టిన రాష్ట్ర బడ్జెట్ లో ఆరు గ్యారంటీలకు గోరి కట్టిందని బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు విమర్శించారు. ఆరు గ్యారంటీల అమలు విషయంలో ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని ఆరోపించారు. టెండర్ల మీద ఉన్న ప్రేమ పేదల మీద లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం ప్రవేశపెట్టిన వార్షిక బడ్జెట్ పై ఆయన బీఆర్ఎస్ ఎల్పీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. ఇందిరమ్మ, రాజీవ్ గాంధీ పేరుతో పథకాలు ఉన్నా నిధులు మాత్రం కేటాయింపు లేదని ఎద్దేవా చేశారు. బడ్జెట్ ను చూస్తుంటే భట్టి బడ్జెట్ బోగస్ బడ్జెట్ అని అర్థమవుతోందన్నారు. గతంలో నిధులు ఖర్చు చేయని పథకాలకు మళ్లీ నిధులు కేటాయించారని మీ ప్రభుత్వంలో స్కాములు తప్ప స్కీములు ఉన్నాయా అని ప్రశ్నించారు. పెట్టుబడులు, ఉద్యోగాల కల్పనపై శ్వేతపత్రం ఇవ్వాలని డిమాండ్ చేసినా పట్టించుకోలేదని మండిపడ్డారు. ఈ బడ్జెట్ లో సకల జనులకు దక్కింది గుండు సున్నా మాత్రమే అన్నారు. ఈ ప్రభుత్వం మూడేళ్లు కూడా నిండకముందే రూ. 3 లక్షల కోట్ల అప్పు చేసిందన్నారు. బీఆర్ఎస్ హయాంలో తలసరి ఆదాయ వృద్ధి 12.1శాతం తలసరి ఉంటే మీ పాలనలో అది 10.2 శాతం ఉందని ఇది కాంగ్రెస్ పరిపాలన వైఫల్యానికి నిదర్శనం అన్నారు. వెనుక ఫిరాయింపు ఎమ్మెల్యేలను కూర్చొబెట్టుకుని భట్టి రాజ్యాంగ విలువల గురించి మాట్లాడటం సిగ్గుచేటన్నారు. సీఎం రేవంత్ రెడ్డి తుగ్లక్ పాలనతో రాష్ట్ర అభివృద్ధి పడిపోయిందన్నారు. క్యూర్, ప్యూర్, రేర్ పేరుతో, హైదారాబాద్ ను మూడు ముక్కలు చేయడంతో రాష్ట్ర ప్రభుత్వం మూడు ముక్కలాట ఆడుతోందని ఆరోపించారు. ఇది క్యూర్ మోడల్ కాదు చోరీ మోడల్ అని ఎద్దేవా చేశారు. కూల్చడం మీద ఉన్న ప్రేమ నిర్మాణాలపై లేదన్నారు.

# రాష్ట్రంలో విపత్తుల శిక్షణా కేంద్రం

- అంతర్జాతీయ ప్రమాణాలతో ఏర్పాటు
- డిజాస్టర్ మేనేజిమెంట్‌పై సమీక్షలో మంత్రి పొంగులేటీ



**ముద్ర, తెలంగాణ బ్యూరో :**

రాష్ట్రంలో అంతర్జాతీయ ప్రమాణాలతో రాష్ట్ర విపత్తుల నిర్వహణ శిక్షణా కేంద్రాన్ని ఏర్పాటుకు అవసరమైన ప్రతిపాదనలను సిద్ధం చేయాలని రాష్ట్ర రెవెన్యూ, శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. ఇందుకోసం సంబంధిత విభాగాల నుంచి ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేసుకొని కార్యాచరణ రూపొందించాలని సూచించారు. దీనిపై సీఎం రేవంత్ రెడ్డితో చర్చించి తుది నిర్ణయం తీసుకుంటామని ప్రకటించారు. శుక్రవారం సచివాలయంలోని తన కార్యాలయంలో విపత్తుల నిర్వహణా విభాగం, ఫైర్ సర్వీసెస్, ఎస్‌డిఆర్‌ఎఫ్, హైడ్రా, ఐ సిసిసి విభాగాలతో మంత్రి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రభుత్వ శాఖలకు విపత్తు నిర్వహణపై ఒకే విధమైన శిక్షణను అందించడం, శాస్త్రీయ పద్ధతుల ద్వారా ప్రాణ నష్టాన్ని, ఆర్థిక నష్టాలను కనిష్ట స్థాయికి తగ్గించడం, క్షేత్రస్థాయిలో, ముఖ్యంగా జిల్లాల్లో విపత్తులను ఎదుర్కొనే సామర్థ్యాన్ని పెంపొందించడం. విపత్తుల నివారణకు సంబంధించి ఇది ఒక అత్యున్నత పరిశోధన, పాలసీ సపోర్ట్ కేంద్రంగా పనిచేస్తుందన్నారు. విపత్తులు సంభవించినప్పుడు కేవలం సహాయక చర్యలకే పరిమితం కాకుండా, ముందస్తు సన్నద్ధతతో నష్టాన్ని తగ్గించే లక్ష్యంతో 'స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ * ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. విపత్తుల నిర్వహణలో తెలంగాణను దేశానికే ఆదర్శంగా నిలిపేందుకు అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఎటువంటి విపత్తులనైనా ఎదుర్కొనేలా అత్యాధునిక పరికరాలను కొనుగోలు చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. వరదలు, అగ్నిప్రమాదాలు వంటి అత్యవసర పరిస్థితుల్లో త్వరితగతిన స్పందించడానికి కచ్చితమైన సమాచార వ్యవస్థ, రియల్ టైమ్ మానిటరింగ్, సాధ్యమయ్యేలా విపత్తు ముందస్తు హెచ్చరిక వ్యవస్థలు, డ్రోన్‌లు, హైస్పీడ్ బోట్లు వంటివాటిని కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో రాష్ట్ర విపత్తుల నిర్వహణ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి దానకిశోర్ , అగ్నిమాపకశాఖ డైరెక్టర్ విక్రమాన్ సింగ్, హైడ్రా కమీషనర్ రంగనాథ్, ఐసిసిసి డైరెక్టర్ కమల్‌హాసన్‌రెడ్డి, స్పెషల్ పోలీస్ బెటాలియన్ అడిషనల్ డిజీ సంజయ్ జైన్ పాల్గొన్నారు.

# రేవంత్ వ్యూహం.. విపక్షం విలవిల!

- దూకుడు మీద రేవంత్
- అయోమయంలో కేటీఆర్
- పాత అస్త్రాలు.. విమర్శలతో బీఆర్ఎస్
- కొత్త వ్యూహాలతో రేవంత్
- మూసీ మీద పట్టు సాధించని కేటీఆర్ టీం
- విమర్శలతోనే తిప్పికొట్టిన రేవంత్
- సింగిల్ హ్యాండ్.. అయినా సీఎందే పైచేయి



**ముద్ర, తెలంగాణ బ్యూరో :**

రాష్ట్ర రాజకీయాల్లో అధికార కాంగ్రెస్ దూకుడు పెంచుతోంది. ప్రధానంగా సీఎం రేవంత్ వ్యూహాలు ఫలిస్తున్నాయి. సింగిల్ హ్యాండ్ తో రేవంత్ విపక్షాలను ఇరుకున పెడుతున్నట్లుగా మారింది. అంతేకాదు.. పాత అంశాలు.. ఎప్పుడో ఉండే విమర్శలతో ప్రధాన విపక్షం బీఆర్ఎస్ అష్టకష్టాలు పడుతుంటే.. కొత్త వ్యూహాలతో రేవంత్ మాత్రం దూకుడు తగ్గించడం లేదు. అసెంబ్లీలోనూ.. అంతర్గతంగా.. ఆరు బయట ఎక్కడైనా కాంగ్రెస్ టీం ఇప్పుడు సక్సెస్ అవుతూ ఉంది. శాసనసభలో గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై జరిగిన చర్చ, అధికార కాంగ్రెస్ , ప్రతిపక్ష బీఆర్ఎస్ మధ్య ఒక రసవత్తర యుద్ధానికి వేదికైంది. అయితే, ఈ పోరులో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తనదైన శైలిలో విరుచుకుపడుతూ బీఆర్ఎస్ శ్రేణులను ఆత్మరక్షణలో పడేశారు. ముఖ్యంగా కేటీఆర్ వంటి వారు ఉన్నప్పటికీ, రేవంత్ రెడ్డిని ధీటుగా ఎదుర్కోవడంలో బీఆర్ఎస్ విఫలమైంది. రేవంత్ రెడ్డి అటు రాజకీయ విమర్శలతో పాటు, ఇటు పాలనాపరమైన అంశాలను కూడా ప్రస్తావిస్తూ గులాబీ పార్టీని ఇరకాటంలో పెట్టారు.

### పాత అస్త్రాలతోనే కేటీఆర్.. కొత్త వ్యూహంతో రేవంత్

ఈ చర్చలో కేటీఆర్ ప్రసంగం అంతా పాత ఆరోపణల చుట్టూనే తిరిగింది. ఆరు గ్యారెంటీల అమలు, రుణమాఫీ వంటి అంశాలపై ఆయన చేసిన విమర్శలను మంత్రులు అప్పటికప్పుడు తిప్పికొట్టారు. ముగిసిన అధ్యాయం లాంటి అంశాలను మళ్ళీ మళ్ళీ ప్రస్తావించడం వల్ల ప్రజల్లోకి వెళ్లాల్సిన గట్టి సందేశం పలచబారిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. మరోవైపు, రేవంత్ రెడ్డి అత్యంత వ్యూహాత్మకంగా వ్యవహరించారు. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలోని లోపాలను ఎండగడుతూనే, తమ ప్రభుత్వం భవిష్యత్తులో చేయబోయే పనులపై తెలంగాణ రైజింగ్ 2047 వంటి విజన్ డాక్యుమెంట్లను ప్రస్తావించి సభను తన వైపు తిప్పుకున్నారు.

### మూసీ ప్రాజెక్టుపై రివర్స్ అటాక్

ముఖ్యంగా మూసీ పునరుజ్జీవనంపై బీఆర్ఎస్ చేస్తున్న విమర్శలను రేవంత్ రెడ్డి అత్యంత చాకచక్యంగా తిప్పికొట్టారు. గతంలో కేసీఆర్, కేటీఆర్ మూసీ నదిపై చేసిన వ్యాఖ్యల తాలూకు వీడియోలను సభలో ప్రదర్శించి, వారి ద్వంద్వ వైఖరిని ఎండగట్టారు. అక్రమ కట్టడాలను బుల్డోజర్లతో కూల్చాలని అప్పుడు చెప్పింది మీరు కాదా అని రేవంత్ ప్రశ్నించినప్పుడు, బీఆర్ఎస్ సభ్యుల దగ్గర సరైన సమాధానం లేకపోయింది. కేటీఆర్ కేవలం సోషల్ మీడియా వేదికగా చేసే విమర్శలను సభలోనూ పునరావృతం చేయడం వల్ల, రేవంత్ వేసిన ప్రత్యూహాల ముందు అవి నిలబడలేకపోయాయి.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కేటీఆర్ ఎప్పటిలాగే తక్కువ అంచనా వేయడం వల్లే ఈ పరిస్థితి తలెత్తిందని భావిస్తున్నారు. రేవంత్ రెడ్డి కేవలం వాక్చాతుర్యంతోనే కాకుండా, గణాంకాలు పాత రికార్డులతో సిద్ధమై రావడంతో బీఆర్ఎస్ శిబిరంలో గందరగోళం నెలకొంది. పైగా, ప్రతిపక్ష నాయకుడు కేసీఆర్ సభకు హాజరు కాకపోవడాన్ని రేవంత్ తీవ్రంగా తప్పుబట్టారు. రూ. 1.06 కోట్ల జీత భత్యాలు తీసుకుంటూ సభకు రాకపోవడంపై ఆయన చేసిన వ్యాఖ్యలు బీఆర్ఎస్‌కు ఇబ్బందికరంగా మారాయి.

### గెలుపు సవాల్‌తో రేవంత్ స్పీడ్

రాజకీయంగా రేవంత్ రెడ్డి ఒక అడుగు ముందుకు వేసి, మరోసారి గెలిచి చూపిస్తాం అని విసిరిన సవాల్ కాంగ్రెస్ శ్రేణుల్లో ఉత్సాహాన్ని నింపింది. అసెంబ్లీలో చర్చా సమయం ఎక్కువ తీసుకున్నప్పటికీ, ప్రజలకు కనెక్ట్ అయ్యేలా మాట్లాడటంలో రేవంత్ రెడ్డి సక్సెస్ అయ్యారు. కానీ, బీఆర్ఎస్ తరపున మాట్లాడిన నాయకులు కేవలం పాత చింతకాయ పచ్చడి లాంటి విమర్శలకే పరిమితం కావడంతో, అసెంబ్లీ వేదికగా రేవంత్ రెడ్డిని కట్టడి చేసే అవకాశం చేజారిపోయింది. రాబోయే రోజుల్లో అయినా కేటీఆర్ తన వ్యూహాన్ని మార్చుకోకపోతే, అసెంబ్లీలో రేవంత్ రెడ్డిని ఢీకొట్టడం కష్టమేనని స్పష్టమవుతోంది.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
21.03.2026 శనివారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



**తప్పులను అంగీకరించడం**
చేసిన తప్పుల నుంచి నేర్చుకోవడం అలవాటు చేసుకోండి. ఇది భయాన్ని తగ్గించి, ఎదుగుదలకు దారి చూపిస్తుంది.



# రైస్ మిల్లులపై ప్రభుత్వం ఉక్కు పాదం

- **రిలిక్ ఆగ్రో రైస్ మిల్లు సీజ్**

**ముద్ర, వనపర్తి :**

వనపర్తి జిల్లాలో ప్రభుత్వం నుండి ధాన్యాన్ని తీసుకొని దుర్వినియోగం చేసిన రైస్ మిల్లర్ల పై ఉక్కు పాదం మోపుతున్నారు. అందులో భాగంగానే శుక్రవారం వనపర్తి మండలం నాచహళ్లి గ్రామంలోని రిలిక్ ఆగ్రో రైస్ మిల్లు లో తనిఖీలు నిర్వహించగా ధాన్యం నిల్వలో భారీగా వ్యత్యాసం ఉన్నట్లు గుర్తించిన స్థానిక ఎమ్మార్వో రమేష్ రెడ్డి సదరు రైస్ మిల్ పై కేసు నమోదు చేశామని తెలిపారు.

వనపర్తి జిల్లాలోని రిలిక్ ఆగ్రో ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ వారికి ప్రభుత్వం రబీ 2022 - 23 సీజన్ కు సంబంధించిన ధాన్యం నిల్వలను తమ స్వప్రయోజనాల కోసం వినియోగించుకొని, ప్రభుత్వం కేటాయించిన ధాన్యం 15678.640 టన్నులకు గాను మిల్లరు 10661.475 టన్నులకు బియ్యం మర ఆడించి ఇవ్వాల్సి ఉండగా కేవలం 1089.288 టన్నులు ప్రభుత్వానికి అప్పగించారు. మిల్లులో ఉండాల్సిన మిగిలిన ధాన్యం 14076.746 టన్నులకు గాను మిల్లు లో కేవలం 3563.760 టన్నులు మాత్రమే ఉండడంతో డిఫాల్ట్ ధాన్యం పై ఎఫ్ ఐఆర్ నెంబర్ :163/2024 వనపర్తి రూరల్ పోలీస్ స్టేషన్ లో నమోదు చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం హై కోర్ట్ తెలంగాణ ఆదేశాల ప్రకారం 10310.091 టన్నుల వద్ల బకాయిలకు రూ.31 కోట్లు ప్రభుత్వాని కి చెల్లించ కుండా తప్పించు కుంటున్నారనే నేపథ్యంలో సంబంధిత మిల్లుకు పలుమార్లు నోటీసులు జారీ చేసి బకాయిలు చెల్లించవలసిందిగా కోరినప్పటికీ సంబంధిత రైస్ మిల్లు యజమానులు బకాయిలు చెల్లించ కుండా తెలంగాణ రాష్ట్ర హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసి చేశారు . ఆర్టి పిటిషన్ను విచారించిన హైకోర్టు సంబంధిత మిల్లర్ కు అనుకూలంగా ఎలాంటి ఆదేశాలు జారీ చేయలేదు అయినప్పటికీ కోర్టు కేసు కోర్టులో ఉందన్న ధీమాతో ఒకవేళ చెల్లించకుండా కాలయాపన చేస్తున్నారు. రైస్ మిల్లుల పెండింగ్ బకాయిల పై పలు రాష్ట్రస్థాయి సమావేశాలలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పౌరసరఫరాల శాఖ మంత్రులు ఆదేశించినప్పటికీ సంబంధిత రైస్ మిల్లర్లు కాలయాపన చేస్తున్నారని అందువలన రైస్ మిల్లర్లపై రెవెన్యూ రికవరీ చట్టం అమలు చేయ వలసిందిగా సంబంధిత శాఖలకు ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ ఆదేశాల ప్రకారం స్థానిక తాసిల్దార్ మిల్లును సందర్శించి ఆయా శాఖల జిల్లా అధికారుల సమక్షంలో రెవిన్యూ రికవరీ చట్టం కింద పంచనామా నిర్వహించి, మిల్లులో ఉన్న 6.6 కోట్ల చరాస్తులను జప్తు చేసినట్లు తెలిపారు.

# ముంచుకొస్తోన్న గ్యాస్ సంక్షోభం

**ముద్ర, డెస్క్:**


పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు పెరుగుతున్న నేపథ్యంలో ఖతార్‌లోని రాస్ లఫాన్ ఇండస్ట్రియల్ సిటీపై ఇరాన్ దాడులు ప్రపంచ ఇంధన మార్కెట్లను కుదిపేశాయి. ప్రపంచ ఎల్ఎన్జీ సరఫరాలో కీలకమైన ఈ కేంద్రం దెబ్బతినడంతో గ్యాస్ సరఫరాలో అంతరాయం ఏర్పడే ప్రమాదం ఉంది. రాస్ లఫాన్ ప్రపంచ గ్యాస్ వాణిజ్యంలో కీలకమైన కేంద్రంగా గుర్తింపు పొందింది. ప్రతి ఏడాది సుమారు 77 మిలియన్ టన్నుల ఎల్ఎన్జీ ఇక్కడి నుంచి ఉత్పత్తి అవుతుంది. దాదాపు 30 దేశాలకు గ్యాస్ ఎగుమతి అవుతోంది. జపాన్, చైనా, దక్షిణ కొరియా, యూరప్ దేశాలతో పాటు భారత్ కూడా ఈ సరఫరాపై భారీగా ఆధారపడుతోంది. ప్రపంచ ఎల్ఎన్జీ సరఫరాలో దాదాపు 20 శాతం ఇక్కడి నుంచే జరుగుతుంది. భారత్ గ్యాస్ అవసరాల్లో సుమారు 50 శాతం దిగుమతులపై ఆధారపడి ఉంది. అందులో 40 నుంచి 47 శాతం ఖతార్ నుంచే వస్తుంది. అంటే మొత్తం వినియోగంలో దాదాపు ఐదో వంతు గ్యాస్ ఖతార్ నుంచే వస్తోంది. ఈ సరఫరా ఆగిపోతే దేశంలో గ్యాస్ కొరత తీవ్రమవుతుంది.

రాస్ లఫాన్ పూర్తిగా దెబ్బతింటే దీని పునర్నిర్మాణానికి సంవత్సరాల సమయం పట్టవచ్చు. దీంతో గ్లోబల్ గ్యాస్ సరఫరాలో భారీ లోటు ఏర్పడి ధరలు ఆకాశాన్ని తాకే పరిస్థితి నెలకొంటుంది. ఈ పరిస్థితుల్లో భారత్ ప్రత్యామ్నాయ ఇంధన వనరులపై దృష్టి సారిస్తోంది.

# పాకిస్తాన్ తోనే అమెరికాకు అణుముప్పు..

- **ఇంటెలిజెన్స్ సంచలన నివేదిక..**

**ముద్ర డెస్క్ :**



ముద్ర డెస్క్ :
ఇంటెలిజెన్స్ నివేదికలో అమెరికాకు ఐదు దేశాల నుంచి ముప్పు ఉంది. మొదటిది రష్యా. రెండోది చైనా.. చైనా నంబర్ వన్ కాడానికి అమెరికాను దెబ్బకొట్టాలని చూస్తోంది. ఇప్పటికే అమెరికా చుట్టూ ఉన్న దేశాల్లో సైన్యాన్ని మోహరిస్తోంది. ఇక తర్వాత అమెరికాను భయపెడుతున్న దేశం ఉత్తరకొరియా, నాలుగో దేశం ఇరాన్. అయితే ఇరాన్‌పై 2025 జూన్‌లో జరిపిన దాడిలో ఇరాన్ అణు కార్యక్రమాలు నిలిపేసిందిన తులసీ గబ్బార్డ్ పేర్కొన్నారు. అయినా అమెరికా తాజాగా యుద్ధం చేస్తోంది. ఇక ఐదో దేశం పాకిస్తాన్. పాకిస్తాన్ వద్ద ప్రస్తుతం 3 వేల అణు మిస్సైళ్లు ఉన్నాయి, రాబోయే సంవత్సరాల్లో 16 వేలకు పెరిగే అవకాశం ఉంది. ఈ మిస్సైళ్లలో లాంగ్‌రేంజ్ వాహకాలు అమెరికా మెయిన్‌ల్యాండ్‌ను చేరుకునే సామర్థ్యం కలిగి ఉన్నాయి. అత్యాధునిక టెక్నాలజీతో పేలుడు పదార్థాలు, అణు ఆయుధాలు లాంచ్ చేసే వ్యవస్థలను అభివృద్ధి చేస్తోంది. ఇది అమెరికా 'వెన్నులో వణుకు' పుట్టించే స్థాయికి చేరింది. అమెరికా పాకిస్తాన్‌ను రష్యా ప్రభావాన్ని తగ్గించడానికి, తాలిబాన్లు, అల్‌ఖైదా దెబ్బతీసేందుకు ఉపయోగించుకుంది. 2001 భారత పార్లమెంట్ దాడికి పాక్ పాత్ర ఉన్నా, అమెరికా మద్దతు ఇచ్చింది. ఇటీవల ఇరాన్ దాడులకు పాక్ బేస్‌లు వాడింది. ఐఎంఎఫ్ రుణాలు, ఆర్మీ చీఫ్ ఆసిమ్ మునీర్‌కు ఆహ్వానాలు, షెహబాజ్ షరీఫ్‌తో సంబంధాలు కొనసాగుతున్నాయి. చైనాకు చెక్, ఖనిజాల సేకరణ కోసం పాక్‌ను సహాయం చేస్తోంది. పాకిస్తాన్ ప్రత్యేకత ఏమిటంటే, అమెరికా సన్నిహిత సంబంధాలు ఉన్నా అణు సామర్థ్యం అదుపు తప్పే ప్రమాదం ఉంది.తులసీ గబ్బార్డ్ పాకిస్తాన్‌ను అమెరికా వాడుకుని తొలగించుకునే పరిస్థితి రాకుండా చూడాలని హెచ్చరించారు. ఈ అణు పెరుగుదల భారత్‌కు కూడా సవాలు, ఎందుకంటే పాక్ భారత ఎదుగుదలను అడ్డుకోవడానికి అమెరికా సాయంతో కుట్రలు చేస్తోంది. ట్రంప్ పాక్ నాయకులను ఆహ్వానించడం విరుద్ధంగా ఉన్నా, ఈ నివేదిక భవిష్యత్ విధానాల్లో మార్పు తీసుకువస్తుంది. ప్రపంచ అణు సమతుల్యతకు ఇది కొత్త ఆందోళన.

# హైదరాబాద్‌లో రేర్ ఎర్త్ పర్మినెంట్ మ్యాగ్నెట్స్ తయారీ ప్లాంట్

**ముద్ర, హైదరాబాద్:**

భారత ప్రభుత్వ శాస్త్ర, సాంకేతిక విభాగం పరిధిలోని స్వయంప్రతిపత్తి కలిగిన సంస్థ అయిన హైదరాబాద్‌లోని ఇంటర్నేషనల్ అడ్వాన్స్‌డ్ రీసెర్చ్ సెంటర్ ఫర్ పౌడర్ మెటలర్జీ అండ్ న్యూ మెటీరియల్స్(ఏఆర్‌సీఐ)లో ఎన్డీఎఫ్ఈబీ (నియోడైమియంఐరన్‌బోరాన్) రేర్ ఎర్త్ పర్మినెంట్ మ్యాగ్నెట్స్ తయారీ కోసం ఒక పైలట్ ప్లాంట్ ఏర్పాటు చేశారు. ఈ పైలట్ ప్లాంట్‌ను భారత ప్రభుత్వ శాస్త్ర, సాంకేతిక విభాగం కార్యదర్శి ప్రొఫెసర్ అభయ్ కరాండికర్, ఏఆర్‌సీఐ డైరెక్టర్ డాక్టర్ ఆర్. విజయ్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో భారత ప్రభుత్వ శాస్త్ర, సాంకేతిక విభాగం మాజీ కార్యదర్శి, ఏఆర్‌సీఐ గవర్నింగ్ కౌన్సిల్ చైర్మన్ ప్రొఫెసర్ అశుతోష్ శర్మ, మిధాని, మాజీ సీఎండీ, టెక్నికల్ రివ్యూ కమిటీ మెంబర్ డాక్టర్ ఎస్.కె.ఝా, అనుసంధాన్ నేషనల్ రీసెర్చ్ ఫౌండేషన్(ఏఎన్ఆర్ఎఫ్) సీఈవో డాక్టర్ శివకుమార్ కళ్యాణరామన్‌తో పాటు వివిధ పరిశ్రమలు, జాతీయ సంస్థల నుంచి ప్రతినిధులు పాల్గొన్నారు. ఏఆర్‌సీఐలో ఏర్పాటు చేసిన ఈ ప్లాంట్ స్ట్రిప్‌కాస్ట్ అల్లాయ్ నుంచి ఫినిష్ సింటర్డ్ మాగ్నెట్స్ వరకు పూర్తి స్థాయి తయారీ విధానాన్ని అవలంబిస్తుంది. దృఢమైన, స్వయం సమృద్ధి కలిగిన తయారీ వ్యవస్థ అభివృద్ధికి వీలు కల్పిస్తుంది.

అరుదైన ఖనిజాల రంగంలో స్వయం సమృద్ధిని సాధించడానికి, ప్రపంచ అరుదైన ఖనిజాల వాల్యూ చైన్‌లో భారతదేశ స్థానాన్ని బలోపేతం చేయడానికి ఈ పైలట్ ప్లాంట్ ఒక ముఖ్యమైన అడుగు. ఎలక్ట్రిక్ వాహనాలు, పునరుత్పాదక ఇంధన వ్యవస్థలు, ఎలక్ట్రానిక్స్, అధునాతన తయారీ సాంకేతికతలలో ఎన్‌డీఎఫ్ఈబీ అయస్కాంతాలు అత్యవసరమైన భాగాలు.



ఈ సందర్భంగా ప్రొఫెసర్ అభయ్ కరాండికర్ మాట్లాడుతూ ప్రపంచ సరఫరా గొలుసులో తలెత్తే లోపాలు, స్వచ్ఛ ఇంధనం, అధునాతన తయారీ రంగాలలో భారతదేశంలో పెరుగుతున్న డిమాండ్ దృష్ట్యా అరుదైన ఖనిజాలలో వ్యూహాత్మక స్వయంప్రతిపత్తిని నిర్మించడంలో ఈ ప్లాంట్ ఒక ముఖ్యమైన అడుగు అని పేర్కొన్నారు. వికసిత్ భారత్2047 దిశగా పయనిస్తున్న వేళ, వనరుల పరిమితులను అధిగమించడం, కీలక సాంకేతికతలలో స్వదేశీ సామర్థ్యాలను బలోపేతం చేయడం మన అభివృద్ధి వ్యూహంలో ప్రధానమని ఆయన అన్నారు. ఇలాంటి సదుపాయాల ఏర్పాటు ఇతర దేశాలపై ఆధారపడటాన్ని తగ్గించడమే కాకుండా, ఆటుపోట్లకు తట్టుకునే సామర్థ్యాన్ని, పోటీతత్వాన్ని పెంచుతాయన్నారు. సంస్థాగత విధానాలు, మిషన్‌ఆధారిత కార్యక్రమాల ద్వారా పరిశోధనలను భారీ ఆవిష్కరణలుగా మార్చడానికి ఒక అనుకూలమైన వ్యవస్థను నిర్మిస్తున్నామన్నారు. సరికొత్త సాంకేతికతలలో భారతదేశాన్ని ప్రపంచ అగ్రగామిగా నిలబెట్టడంలో భాగస్వాములు కావాలని పరిశ్రమలు, అంకుర సంస్థలు, విద్యాసంస్థలను ప్రొఫెసర్ అభయ్ కరాండికర్ ఆహ్వానించారు.

ప్రస్తుతం రేర్ ఎర్త్ మాగ్నెట్ సరఫరా గొలుసులు ప్రపంచవ్యాప్తంగా కేవలం కొన్ని చోట్ల మాత్రమే కేంద్రీకృతమై ఉన్నాయని, ఇది అభివృద్ధి చెందుతున్న దేశాలకు ఇబ్బందికరంగా మారిందని గుర్తు చేశారు. ఖనిజాల నుంచి అయస్కాంతాల తయారీ వరకు వాల్యూ చైన్ అంతటా స్వదేశీ సామర్థ్యాలను స్థాపించడం వల్ల సరఫరా భద్రత, పోటీతత్వం, సాంకేతిక నాయకత్వం పెరుగుతాయని, ఖర్చు తగ్గుతుందని అన్నారు.

సాంకేతికత ధ్రువీకరణ, సులభతర ప్రక్రియ, పరిశ్రమల సహకారం, ప్రదర్శన, స్వదేశీ ఆవిష్కరణలను వాణిజ్య తయారీ స్థాయికి తీసుకెళ్లడం, డీప్‌టెక్ స్టార్టప్‌లు, ప్రైవేట్ రంగ భాగస్వామ్యానికి మద్దతు ఇవ్వడానికి ఈ పైలట్‌స్కేల్ ప్లాంట్ ఒక కీలక వేదికగా ఉపయోగపడుతుందన్నారు.

ఏఆర్‌సీఐ గవర్నింగ్ కౌన్సిల్ చైర్మన్ ప్రొఫెసర్ అశుతోష్ శర్మ మాట్లాడుతూ పరిశోధన స్థాయి నుంచి తయారీ స్థాయికి మారడమే ఈ పైలట్ ప్లాంట్‌ను నిజంగా విశిష్టమైనదిగా చేస్తుందన్నారు. దీనిలోని సరళత నిరంతర ఆవిష్కరణలకు, ప్రక్రియ ఆప్టిమైజేషన్‌కు, ఉత్పత్తి అభివృద్ధికి వీలు కల్పిస్తుందన్నారు.

ఏఎన్ఆర్ఎఫ్ సీఈఓ డాక్టర్ శివకుమార్ కళ్యాణరామన్ మాట్లాడుతూ భారతదేశపు ఈవీ వ్యవస్థతో సహా కీలక సాంకేతికతలను వేగవంతం చేయడానికి 'మిషన్ ఫర్ అడ్వాన్స్‌మెంట్ ఇన్ హైఇంపాక్ట్ ఏరియాస్'(ఎంఏహెచ్ఏ) చేపట్టిన కార్యక్రమాల గురించి వివరించారు. అనువర్తిత పరిశోధనలలో చురుకుగా పాల్గొనవలసిందిగా ప్రైవేట్ రంగాన్ని ఆహ్వానించారు.

ఏఆర్‌సీఐ డైరెక్టర్ డాక్టర్ ఆర్. విజయ్ మాట్లాడుతూ అరుదైన ఖనిజాల వెలికితీత నుంచి అయస్కాంత తయారీ వరకు ఏఆర్‌సీఐ పూర్తిస్థాయి 'మినరల్‌టుమార్కెట్' వ్యవస్థను అభివృద్ధి చేస్తోందని, ఇది పరిశ్రమలతో అనుసంధానాన్ని బలోపేతం చేస్తుందని తెలిపారు.

కాగా, ఈ పైలట్ ప్లాంట్ పరిశ్రమల భాగస్వామ్యాన్ని ప్రేరేపిస్తుందని, ఆవిష్కరణలను ప్రోత్సహిస్తుందని, స్వదేశీ అరుదైన ఖనిజ అయస్కాంతాల సాంకేతికతల వాణిజ్యీకరణకు మద్దతు ఇస్తుందని నిపుణులు భావిస్తున్నారు. ఇది భారతదేశంలో ఎలక్ట్రిక్ వాహనాల వ్యవస్థ, అధునాతన మెటీరియల్స్ తయారీ వృద్ధికి కూడా దోహదపడుతుంది. ఆత్మనిర్భర్ భారత్‌ను సాధించేందుకు వికసిత్ భారత్ 2047 సంకల్పాన్ని సాకారం చేసుకోవడానికి ఇది ఒక కీలక అడుగు.


# విద్యారంగంపై చిన్నచూపు

- **అరకొర నిధుల కేటాయింపు**
- **మూడోసారి కూడా కాంగ్రెస్ తానిచ్చిన హామీనీ నెరవేర్చుకోలేక పోయింది**
- **కేటాయింపులు పెంచాలి**

**ముద్ర, తెలంగాణ బ్యూరో:**

రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన 2026-27 వార్షిక బడ్జెట్‌లో విద్యారంగానికి తక్కువ నిధులు కేటాయించిందని బాలల హక్కుల సంక్షేమ సంఘం (బీహెచ్ఎస్ఎస్) నేతలు విమర్శించారు. మొత్తం రూ.3,24,234 కోట్ల బడ్జెట్‌లో విద్యకు కేవలం రూ.26,674 కోట్లు మాత్రమే కేటాయించారని, ఇది మొత్తం బడ్జెట్‌లో 8.22 శాతం మాత్రమేనని పేర్కొన్నారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ గుండు కిష్టయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఇంజమూరి రఘునందన్ మాట్లాడుతూ గత ఏడాది కంటే కేవలం 0.63 శాతం మాత్రమే పెరుగుదల కనిపించిందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో విద్యారంగానికి 15 శాతం నిధులు కేటాయిస్తామని హామీ ఇచ్చినా, వరుసగా మూడోసారి ఆ హామీని నిలబెట్టుకోలేకపోయిందని విమర్శించారు.

2024-25లో 7.3 శాతం, 2025-26లో 7.57 శాతం, ప్రస్తుత బడ్జెట్‌లో 8.22 శాతం మాత్రమే కేటాయించడం ద్వారా విద్యారంగానికి తగిన ప్రాధాన్యం ఇవ్వలేదని పేర్కొన్నారు. విద్యా కమిషన్ సిఫార్సుల ప్రకారం కనీసం 18 శాతం నిధులు కేటాయించాల్సి ఉన్నప్పటికీ, ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంటిగ్రేటెడ్, పబ్లిక్ స్కూళ్ల పేరుతో కొత్త కార్యక్రమాలను ప్రకటిస్తున్నప్పటికీ, ఇప్పటికే ఉన్న పాఠశాలల బలోపేతంపై దృష్టి పెట్టడం లేదన్నారు. తరగతి గదుల నిర్మాణం, ఉపాధ్యాయుల నియామకం, మౌలిక వసతులు, సానిటేషన్, కంప్యూటర్లు, గ్రంథాలయాలు, క్రీడా సదుపాయాలు వంటి అంశాలు తగిన నిధులపై ఆధారపడి ఉంటాయని గుర్తు చేశారు. విద్యారంగానికి కనీసం 20 శాతం నిధులు కేటాయించాలని పౌర సమాజం, విద్యావేత్తలు, బాలల హక్కుల సంఘాలు గత కొంతకాలంగా కోరుతున్నా ప్రభుత్వం స్పందించకపోవడం విచారకరమన్నారు. ప్రభుత్వం బడ్జెట్‌ను సమీక్షించి విద్యారంగానికి కేటాయింపులు పెంచాలని డిమాండ్ చేశారు. అయితే పాఠశాలల్లో ఉదయం అల్పాహారం, ఇంటర్ వరకు మధ్యాహ్న భోజనం అమలు చేయాలనే ప్రభుత్వ ప్రతిపాదనను స్వాగతిస్తున్నట్లు పేర్కొన్నారు.





# ఈశాన్య భారత్‌లో విదేశీ కుట్రలు..

- **మాథ్యూ వాండైక్.. ఆరుగురు ఏజెంట్ల అరెస్టుతో బట్టబయలు!**

**ముద్ర డెస్క్ :**



భారత్‌లో ఇప్పుడు అమెరికా సీఐఏ ఏజెంట్ మాథ్యూవాండైక్, అతని ఆరుగురు ఏజెంట్ల గురించే చర్చ జరుగుతోంది. పాస్‌పోర్టులతో భారత్‌కు వచ్చి.. అక్రమంగా, అనధికారికంగా మిజోరామ్‌కు వెళ్లి.. అక్కడి నుంచి మయన్మార్‌కు వెళ్లారు. అక్కడ ఉగ్రవాదులకు డ్రోన్ టెక్నాలజీ, బాంబు టెక్నాలజీ, యుద్ధం చేసే టెక్నాలజీ నేర్పించారు. ఈ విషయాన్ని ఎన్ఐఏ పసిగట్టింది. మాథ్యూవాండైక్ కోల్‌కతాలో అరెస్ట్ అయ్యాడు. ఉక్రెయిన్‌కు చెందిన పెట్రో హిల్‌బా, తాడా సిల్వియా, ఇవాన్ సుక్‌మనోస్కీ లక్నోలో పట్టుపడ్డారు. స్టిఫానోస్కీ మరియాన్, హోచ్‌క్ మాక్‌స్లిం, కమిన్‌స్కీ విక్టర్ ఢిల్లీలో అరెస్ట్ అయ్యారు. వీళ్లు ఈగల్ వీసాలపై భారత్‌కు వచ్చారు.

**మాథ్యూ వాండైక్ రేజీమ్ చేంజ్ నిపుణుడు..**

వాండైక్ 2011 కైరో విప్లవంలో పాల్గొని, లిబియాలో గద్దాఫీకి వ్యతిరేక గెరిల్లాలకు మద్దతు ఇచ్చి అరెస్టయ్యాడు. సిరియాలో బషర్ అల్-అస్ద్ ప్రతికూల దళాలు (నినేవే ప్లాన్, ప్రొటక్షన్ యూనిట్) తయారు చేశాడు. ఇప్పుడు మయన్మార్‌లో 150 రహస్య మార్గాల్లో ముస్లిం, క్రైస్తవ ఉగ్రవాదులకు శిక్షణ ఇచ్చాడు. స్టిఫానోస్కీ మరియాన్ 2023 నుంచి క్రైస్తవ ఉగ్ర సంస్థలు ఏర్పాటు చేశాడు.

**టార్గెట్ మిజోరాం–మణిపూర్..**

మిజోరాం, మణిపూర్ నుంచి మయన్మార్‌కు 1670 కి.మీ. ఓపెన్ సరిహద్దు (1987 ఎంఎన్ఎఫ్ ఒప్పందం) తెరిచి ఉండడంతో ఉగ్రవాదులు రాకపోకలు. 2,000 మంది విదేశీయులు శిక్షణ ఇచ్చారు. డ్రోన్ శిక్షణ పొందినవారు ఆస్సాం రైఫిల్స్‌పై దాడి చేశారు. మణిపూర్ ఇM కేంద్రానికి ఫిర్యాదు చేసి, ఇంటలిజెన్స్ చీఫ్ మిజోరాం పర్యటించారు.

**చారిత్రక తప్పిదాలు..**


1987 ఎంఎన్ఎఫ్ ఒప్పందంతో సరిహద్దులు ఓపెన్ చేయడం, 2011 మన్మోహన్ ప్రభుత్వం టూరిజం కోసం సెక్యూరిటీ సడలించడం వల్ల విదేశీయులు (డేనియల్ స్టీఫెన్ వంటివారు) ప్రవేశం మొదలైంది. అమెరికా రాయబారి గోరేటి మిజోరాం సందర్శన తర్వాత ఈ కుట్రలు బయటపడ్డాయి. ఈ అరెస్టులు ఏడాదిన్నర కుట్రలను బయటపెట్టాయి. బంగ్లాదేశ్ (షేక్ హసీనా పడిపోవడం), మయన్మార్ సైనిక పాలితం, భారత ఈశాన్య రాష్ట్రాలను కలిపి క్రైస్తవ దేశం ఏర్పాటు చేయాలని లక్ష్యం. మోదీ ప్రభుత్వం సరిహద్దు కంచెలు వేయాలని ప్రయత్నిస్తున్నా, స్థానిక సంస్థల వ్యతిరేకత ఉంది. ఇది భారత ఐక్యతకు సవాలు, ఇంటలిజెన్స్ నిఘా మరింత బలపడాలి.

# ప్రతిభ కు దక్కిన ఫలితం

- **పాలమూరు కే వన్నె తెచ్చిన యెన్నం**
- **ఎమ్మెల్యే యెన్నం కు విప్ పదవి దక్కడం పాలమూరుకు గర్వకారణం**
- **ప్రతిభకు కట్టిన పదవి అని కాంగ్రెస్ శ్రేణుల సంబరాలు**

**ముద్ర, ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా ప్రతినిధి :**

మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి కి అసెంబ్లీ లో ప్రభుత్వ విప్ గా నియమించడం ప్రతిభకు పట్టం కట్టినట్లయింది. ఎమ్మెల్యే గా ఎన్నికైనా దగ్గర నుంచి ఆయన తన నియోజకవర్గం అభివృద్ధి పైనే దృష్టి సారించారు. పాలమూరు లో విద్యాభివృద్ధికి విశేష కృషి అందిస్తున్నారు. నియోజకవర్గం లో తన పరిధి లో విద్యా నిధి ఏర్పాటు చేసి పేద విద్యార్థుల విద్య పై భరోసా కల్పించారు.ఇప్పటికే ఈ నిధికి ఎమ్మెల్యే వేతనం నుంచి ప్రతి నెలా రూ. లక్ష విరాళం ఇస్తున్నారు. ఈ నిధి నుంచి పేద విద్యార్థుల చదువుకు అవసరం అయ్యే విధంగా డబ్బులు స్ అందిస్తున్నారు. ఏ ఎమ్మెల్యే చేయని ఈ సాహసానికి ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి గా విరాళాలు అందజేస్తున్నారు. విద్య సంస్థలు,వివిధ పారిశ్రామికవేత్తలు,ఉద్యోగస్థులు తమ వంతు సహాయంగా విరాళాలు అందించి ఎమ్మెల్యే ఆశయసాధనకు మద్దతుగా నిలుస్తున్నారు. ఈ విరాళాలతో విద్యార్థుల కు అవసరమైన స్టడీ మెటీరియల్ తో పాటు డబ్బు సాయం అందుతోంది. ఇదొక్కటే కాకుండా ఐఐటి లో సీటు సంపాదించుకునేందుకు ప్రత్యేక శిక్షణ ఇప్పిస్తున్నారు.145 మంది విద్యార్థులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకుంటున్నారు.ఇదొక్కటే కాకుండా నియోజకవర్గం అభివృద్ధి కోసం తీవ్రంగా కృషి చేస్తున్నారు. ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ని విజయతీరాలకు చేర్చడం లో ఎమ్మెల్యే సఫలీకృతులయ్యారు. మేయర్ పదవి కోసం అధిష్టానం తో కొట్లాడి తాను అనుకున్న విధంగా ముదిరాజ్ ఆడబిడ్డకు కట్టబెట్టడం లో తన పంతం నెగ్గించుకున్నారు. దీంతో బాటు తన అనుచరునికి డిప్యూటీ మేయర్ పదవి వచ్చేటట్లు వ్యూహం రచించారు. మున్సిపల్ కార్పొరేషన్ లో చరిత్ర తిరగరాశారు.ఇదేకాక రాష్ట్రం లో ఏ జిల్లా లో లేని విధంగా జర్నలిస్ట్ ల సంక్షేమాని కి తన వంతు సహాయంగా ప్రతి నెలా రూ. లక్ష అందించనున్నారు.నియోజకవర్గం లో ఇలా స్వచ్ఛంద్ర కార్యక్రమాలపై ఆయన దృష్టి పెట్టారు. ఆయన చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలు ఇతర నియోజక వర్గాల ఎమ్మెల్యే లకు ఆదర్శం గా నిలుస్తున్నారు. ఇవన్నీ దృష్టిలో పెట్టుకున్న సీఎం రేవంత్ రెడ్డి ఆయన కు అసెంబ్లీ లో ప్రభుత్వ విప్ పదవి కట్టబెట్టారు. ఈ పదవికి ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి వన్నె తెచ్చే అవకాశం ఉంది. రేవంత్ రెడ్డి తీసుకున్న నిర్ణయానికి పాలమూరు కాంగ్రెస్ శ్రేణులు సంబరాల్లో మునిగిపోయారు. యెన్నం కు విప్ రావడం పాలమూరు నియోజకవర్గానికి మంచిరోజులు వచ్చాయని కాంగ్రెస్ సీనియర్ నేతలు అంటున్నారు.



సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
21.03.2026 శనివారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



**స్వయంగా విశ్రాంతి తీసుకోవడం**

అవసరమైనప్పుడు విరామం తీసుకోవడం చాలా ముఖ్యం. ఇది మీ మానసిక శక్తిని పునరుద్ధరిస్తుంది.





## బెంగళూరు మళ్లీ కప్ కొట్టగలదా?

**ముద్ర, స్పోర్ట్స్ డెస్క్:**

ఐపీఎల్‌లో అత్యధిక అభిమానులున్న జట్లలో ఒకటిగా రాయల్ చాలెంజర్స్ బెంగళూరు గుర్తింపు పొందింది. ఎన్నో సంవత్సరాల నిరాశ తర్వాత 2025 సీజన్‌లో ఈ జట్టు తొలి సారి ట్రోఫీని గెలుచుకుని చరిత్ర సృష్టించింది. ఇప్పుడు డిఫెండింగ్ ఛాంపియన్‌గా ఈ సీజన్‌లో మరింత ఆత్మవిశ్వాసంతో బరిలోకి దిగుతోంది. గత సీజన్‌లో చూపించిన అద్భుత ప్రదర్శనను ఈసారి కూడా కొనసాగించాలనే లక్ష్యంతో జట్టు సిద్ధమవుతోంది. జట్టులో కీలక ఆటగాడిగా విరాట్ కోహ్లీ మరోసారి ప్రధాన ఆకర్షణగా నిలుస్తున్నాడు. ఐపీఎల్ చరిత్రలో అత్యుత్తమ బ్యాటర్లలో ఒకడైన కోహ్లీ, ఈసారి కూడా జట్టుకు కీలకంగా మారనున్నాడు. అతనితో పాటు వెంకటేష్ అయ్యర్, రోమారియో షెఫర్డ్, కృనాల్ పాండ్యా వంటి ఆటగాళ్లు బ్యాటింగ్ మరియు ఆల్‌రౌండ్ విభాగాల్లో జట్టుకు బలం ఇస్తున్నారు. దీంతో ఆర్సీబీ బ్యాటింగ్ లైనప్ ఈ సీజన్‌లో మరింత స్ట్రాంగ్‌గా కనిపిస్తోంది. గత సీజన్‌లో జట్టు విజయానికి ప్రధాన కారణం సమష్టి ప్రదర్శనే. ప్రతి మ్యాచ్‌లో ఎవరో ఒకరు బాధ్యత తీసుకుని జట్టును గెలిపించారు. అదే ఫార్ములాను ఈసారి కూడా కొనసాగించాలని ఆర్సీబీ ప్లేయర్లు భావిస్తున్నారు. ముఖ్యంగా కీలక మ్యాచ్‌లలో స్థిరంగా ఆడితే మరోసారి ఫైనల్‌కు చేరుకోవడం కష్టమేమీ కాదని అభిమానులు అంచనా వేస్తున్నారు. బౌలింగ్ విభాగంలో భువనేశ్వర్ కుమార్, హేజిల్‌వుడ్ వంటి అనుభవజ్ఞులు ఉండడం జట్టుకు ప్లస్ పాయింట్‌గా మారింది. వీరు తమ అనుభవాన్ని ఉపయోగించి కీలక సమయంలో వికెట్లు తీస్తే ఆర్సీబీకి మరోసారి టైటిల్ గెలిచే అవకాశం ఉంది. బ్యాటింగ్, బౌలింగ్ రెండింటిలోనూ సమతుల్యం కొనసాగితే ఈ సీజన్‌లో కూడా బెంగళూరు జట్టు బలమైన పోటీ ఇవ్వడం ఖాయం.

## వన్డే వరల్డ్ కప్‌పై బీసీసీఐ ఫోకస్..

- **ఐపీఎల్‌లో రాణించే ఆటగాళ్లపై సెలక్టర్ల దృష్టి**

**ముద్ర, స్పోర్ట్స్ డెస్క్:**

ఐపీఎల్ 2026 సీజన్ ప్రారంభానికి ఇంకా కొన్ని రోజులు మాత్రమే మిగిలి ఉండగా, మరోవైపు బీసీసీఐ మాత్రం రాబోయే వన్డే ప్రపంచకప్‌పై దృష్టి పెట్టింది. వచ్చే ఏడాది జరగనున్న ఈ మెగా టోర్నీని దృష్టిలో ఉంచుకుని సెలక్షన్ కమిటీ ఇప్పటికే ప్రణాళికలు సిద్ధం చేసినట్లు సమాచారం. దాదాపు 20 మంది ఆటగాళ్లతో కూడిన ప్రాబబుల్స్ జాబితాను కూడా రూపొందించినట్లు క్రికెట్ వర్గాలు చెబుతున్నాయి. ఐపీఎల్‌లో ఈ ఆటగాళ్ల ప్రదర్శనను సెలక్టర్లు దగ్గరుండి గమనించనున్నారని తెలుస్తోంది. ప్రతి సెలక్టర్ వారానికి కనీసం ఒక మ్యాచ్ అయినా ప్రత్యక్షంగా వీక్షించాలని నిర్ణయించినట్లు సమాచారం. ఇలా ఐపీఎల్ మొత్తం కాలంలో కీలక ఆటగాళ్ల ఫామ్‌పై స్పష్టమైన అంచనా వేయాలని సెలక్షన్ కమిటీ భావిస్తోంది. ముఖ్యంగా బౌలింగ్ విభాగంలో జస్‌ప్రీత్ బుమ్రా, మహ్మద్ సిరాజ్, ప్రసిద్ధ్ కృష్ణ, అర్ష్‌దీప్ సింగ్, హార్దిక్ పాండ్య వంటి ఆటగాళ్ల ఆటతీరుపై ప్రత్యేక దృష్టి పెట్టనున్నట్లు తెలుస్తోంది. గాయం కారణంగా హర్షిత్ రాణా ఇప్పటికే టోర్నీ నుంచి తప్పుకోవడం సెలక్టర్లకు ఒక సవాలుగా మారింది. ఐపీఎల్ ముగిసిన తర్వాత అఫ్గానిస్థాన్‌తో భారత్ ఒకే ఒక్క టెస్టు మ్యాచ్ ఆడనుంది. ఇది వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్‌లో భాగం కాకపోయినా, సీనియర్ ఆటగాళ్లందరూ ఈ మ్యాచ్‌లో పాల్గొనే అవకాశాలు ఉన్నాయని సమాచారం. రాబోయే టెస్టు సిరీస్‌లను దృష్టిలో ఉంచుకుని బుమ్రా, సిరాజ్, ప్రసిద్ధ్ కృష్ణ వంటి పేసర్లను వరుసగా ఆడించే యోచనలో సెలక్టర్లు ఉన్నట్లు తెలుస్తోంది. ఇక చీఫ్ సెలక్టర్ అజిత్ అగార్కర్ పదవీకాలం పొడిగింపుపై వచ్చిన వార్తలపై కూడా బీసీసీఐ స్పందించింది. తన పదవీకాలాన్ని వచ్చే వన్డే ప్రపంచకప్ వరకు పొడిగించాలని ఆయన కోరినట్లు వచ్చిన వార్తలు నిజం కాదని బోర్డు వర్గాలు తెలిపాయి. అజిత్ అగార్కర్ పదవీకాలం ఈ ఏడాది సెప్టెంబర్ వరకు ఉండగా, ఆ తర్వాత భవిష్యత్ నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని సమాచారం



## ఐపీఎల్‌కు మూడో స్థానం.. డబ్ల్యూసీఏ ర్యాంకులపై విమర్శలు

**ముద్ర, స్పోర్ట్స్ డెస్క్:**

సంపదపరంగా ప్రపంచంలోనే అత్యంత విలువైన టీ20 లీగ్‌గా గుర్తింపు పొందిన ఐపీఎల్‌కు వరల్డ్ క్రికెటర్స్ అసోసియేషన్ (WCA) మూడో ర్యాంకు ఇవ్వడం చర్చనీయాంశంగా మారింది. ప్రపంచంలోనే అత్యధిక పారితోషికం అందించే లీగ్ అయినప్పటికీ ఐపీఎల్‌ను మూడో స్థానంలో ఉంచడంపై అభిమానులు సోషల్ మీడియాలో తీవ్రంగా స్పందిస్తున్నారు. డబ్ల్యూసీఏ విడుదల చేసిన ర్యాంకుల్లో ది హండ్రెడ్ లీగ్‌కు మొదటి స్థానం దక్కగా, దక్షిణాఫ్రికాలో జరిగే ఎస్ఏ20 లీగ్ రెండో స్థానంలో నిలిచింది. ఐపీఎల్‌కు మాత్రం మూడో స్థానం మాత్రమే దక్కింది. ది హండ్రెడ్ లీగ్‌లో టాప్ ప్లేయర్‌కు వచ్చిన పారితోషికం రూ.4.81 కోట్లు మాత్రమే ఉండగా, ఐపీఎల్‌లో మాత్రం రూ.25 కోట్లకు పైగా ఆటగాళ్లు అమ్ముడవుతున్నారని అభిమానులు పేర్కొంటున్నారు. ఇదే విషయాన్ని ప్రస్తావిస్తూ ఐపీఎల్‌ను మూడో స్థానంలో ఉంచడం సరైంది కాదని విమర్శలు చేస్తున్నారు. ఈ ర్యాంకులను ప్రకటించేందుకు డబ్ల్యూసీఏ పలు అంశాలను పరిగణనలోకి తీసుకుంది. ఆటగాళ్ల జీతభత్యాలు, భద్రత, హక్కుల రక్షణ, వృత్తిపరమైన ప్రమాణాలు వంటి అంశాల ఆధారంగా మొత్తం 100 పాయింట్లలో ర్యాంకులు ఇచ్చింది. ఆటగాళ్లు, వారి సంఘాలు, ఏజెంట్ల నుంచి సర్వే ఫీడ్‌బ్యాక్ తీసుకున్న తర్వాతే ఈ జాబితాను రూపొందించినట్లు తెలిపింది.

## ఇరాన్‌లో కఠిన శిక్షలు..

- **యువ రెజ్లర్‌తో పాటు ముగ్గురికి మరణశిక్ష**

**ముద్ర, స్పోర్ట్స్ డెస్క్:**

ఇరాన్‌లో ప్రభుత్వ వ్యతిరేక నిరసనల నేపథ్యంలో కఠిన చర్యలు కొనసాగుతున్నాయి. 2025 డిసెంబర్‌లో జరిగిన నిరసనల్లో పాల్గొన్నారనే ఆరోపణలతో 19 ఏళ్ల యువ రెజ్లర్ సాలేహ్ మహమ్మద్ తోసహ్ సహ్ ముగ్గురికి మరణశిక్ష అమలు చేసినట్లు సమాచారం. ఈ ఘటన అంతర్జాతీయంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

అధికార వర్గాలు తెలిపిన వివరాల ప్రకారం, నిరసనల సమయంలో ఇద్దరు పోలీసుల హత్యకు ఈ ముగ్గురే కారణమని న్యాయస్థానం తేల్చింది. అయితే ఈ కేసులో జరిగిన విచారణపై మానవ హక్కుల సంస్థలు తీవ్రంగా అభ్యంతరం వ్యక్తం చేస్తున్నాయి. సరైన న్యాయపరమైన అవకాశాలు ఇవ్వకుండా వేగంగా విచారణ జరిపి శిక్షను అమలు చేశారని ఆరోపిస్తున్నారు.

ఈ ఘటనను అంతర్జాతీయ మానవ హక్కుల సంస్థలు తీవ్రంగా ఖండించాయి. విచారణ పారదర్శకంగా జరగలేదని, నిందితులకు తమ వాదనలు వినిపించుకునే అవకాశం కూడా ఇవ్వలేదని పేర్కొన్నాయి. ముఖ్యంగా యువ రెజ్లర్‌కు న్యాయం జరగలేదని కార్యకర్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ప్రస్తుతం ఇరాన్‌లో మరణశిక్షల సంఖ్య మరింత పెరిగే అవకాశముందనే భయం వ్యక్తమవుతోంది.



ఈ విషయంపై అంతర్జాతీయ సమాజం వెంటనే స్పందించాలని మానవ హక్కుల సంస్థలు డిమాండ్ చేస్తున్నాయి. దేశంలో జరుగుతున్న పరిణామాలు మానవ హక్కుల పరిరక్షణపై మళ్లీ ప్రపంచవ్యాప్తంగా చర్చకు దారితీస్తున్నాయి.



## సూర్యవంశీపై పరాగ్ ఆసక్తికర వ్యాఖ్యలు

**ముద్ర, స్పోర్ట్స్ డెస్క్:**

వైభవ్ సూర్యవంశీ ప్రస్తుతం భారత యువ క్రికెట్‌లో అత్యంత చర్చనీయాంశంగా మారిన పేరు. చిన్న వయసులోనే దూకుడైన బ్యాటింగ్‌తో గుర్తింపు తెచ్చుకున్న ఈ 15 ఏళ్ల ఆటగాడు అండర్-19 స్థాయిలో అద్భుత ప్రదర్శనతో అందరి దృష్టిని ఆకర్షించాడు. ముఖ్యంగా అండర్-19 ప్రపంచకప్ ఫైనల్లో 175 పరుగుల సంచలన ఇన్నింగ్స్ ఆడటం అతడి ప్రతిభను మరోసారి నిరూపించింది. ఇప్పటివరకు అండర్-19 క్రికెట్‌లో మెరిసిన సూర్యవంశీ ఇప్పుడు ఐపీఎల్‌లో కూడా తన ప్రతిభను చూపించేందుకు సిద్ధమవుతున్నాడు. రాజస్థాన్ రాయల్స్ తరపున ఆడుతున్న అతడిపై ఈసారి భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో జట్టు కెప్టెన్ రియాన్ పరాగ్ చేసిన వ్యాఖ్యలు ఆసక్తికరంగా మారాయి. 'గత ఏడాది నుంచి వైభవ్ అద్భుతంగా ఆడుతున్నాడు. ఎక్కడ మ్యాచ్ ఆడినా భారీ స్కోర్లు చేయడం అతడికి అలవాటైపోయింది. ఐపీఎల్ ద్వారా అతడు కొత్తగా నిరూపించుకోవాల్సిన అవసరం లేదు. అలాంటి యంగ్ ఓపెనర్ మా జట్టులో ఉండటం మాకు ఎంతో బలం' అని పరాగ్ తెలిపాడు. అండర్-19 ప్రపంచకప్‌లో సూర్యవంశీ ఆడిన ఇన్నింగ్స్‌లే అతడి సామర్థ్యానికి నిదర్శనమని చెప్పాడు.

అయితే అతడిపై ఒత్తిడి లేకుండా చూసుకోవడం జట్టుగా తమ బాధ్యత అని పరాగ్ స్పష్టం చేశాడు. మీడియా, సోషల్ మీడియా దృష్టి ఎక్కువగా ఉండడంతో వాటి నుంచి దూరంగా ఉంటూ తన ఆటను ఆస్వాదిస్తూ ఆడితే సూర్యవంశీ మరింత మెరుగ్గా రాణిస్తాడని సూచించాడు. మరోవైపు జట్టు కోచ్ కుమార సంగక్కర కూడా ఈసారి రాజస్థాన్ రాయల్స్ అన్ని విభాగాల్లో బలంగా ఉందని, టైటిల్ గెలవాలనే లక్ష్యంతో బరిలోకి దిగుతున్నామని తెలిపారు.

### రూ.16 వేల కోట్ల ఆఫర్‌కూ నో చెప్పిన

## రాజస్థాన్ రాయల్స్..

- **ఆర్సీబీ విలువ మరింత పెరగనున్నదా?**

**ముద్ర, స్పోర్ట్స్ డెస్క్:**



ఐపీఎల్ 2026 సీజన్ ప్రారంభానికి ముందు ఫ్రాంచైజీల విలువపై పెద్ద చర్చ మొదలైంది. ఈ నేపథ్యంలో రాజస్థాన్ రాయల్స్ ఫ్రాంచైజీకి వచ్చిన భారీ ఆఫర్‌ను యాజమాన్యం తిరస్కరించినట్లు వార్తలు వినిపిస్తున్నాయి. ఏకంగా రూ.16 వేల కోట్ల (సుమారు 1.7 బిలియన్ డాలర్లు) బిడ్డింగ్ వచ్చినప్పటికీ ఆర్ఆర్ యాజమాన్యం దాన్ని అంగీకరించలేదని క్రికెట్ వర్గాలు చెబుతున్నాయి. ఫ్రాంచైజీ విలువ ఇంకా పెరిగే అవకాశాలు ఉన్నాయని భావించి ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం.


అమెరికా, కెనడాల్లో ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకింగ్ మరియు ప్రైవేట్ ఈక్విటీ రంగంలో పనిచేస్తున్న కొలంబియా పసిఫిక్ క్యాపిటల్స్ పార్ట్‌నర్స్ (సీపీసీపీ) కన్సార్టియం ఈ ఆఫర్‌ను ఇచ్చినట్లు తెలుస్తోంది. మొత్తం మొత్తాన్ని రెండు వారాల్లోనే చెల్లించేందుకు సిద్ధమని వారు ముందుకొచ్చినా, ఆర్ఆర్ బోర్డు మాత్రం దాన్ని పక్కన పెట్టినట్లు సమాచారం. ప్రస్తుతం ఫ్రాంచైజీలో ఎమెర్జింగ్ మీడియా వెంచర్స్ అధినేత మనోజ్ బదాలేకు ప్రధాన వాటా ఉండగా, రెడ్‌బర్డ్ క్యాపిటల్ కూడా వాటాదారుగా ఉంది. భవిష్యత్తులో మరింత భారీ విలువ వచ్చే అవకాశం ఉందనే ఉద్దేశంతో యాజమాన్యం వేచి చూస్తోందని చెబుతున్నారు.

ఇక రాజస్థాన్ రాయల్స్ ఆఫర్‌ను తిరస్కరించిన నేపథ్యంలో ఇప్పుడు రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు ఫ్రాంచైజీ విలువపై కూడా చర్చ జోరుగా సాగుతోంది. ఐపీఎల్‌లో అత్యంత ప్రజాదరణ కలిగిన జట్లలో ఒకటైన ఆర్సీబీకి డిజిటల్ వ్యూస్, బ్రాండ్ విలువ, స్టార్ ఆటగాళ్లు వంటి అంశాల వల్ల భారీ డిమాండ్ ఉంది. అందుకే ఆర్సీబీ విలువ రాజస్థాన్ రాయల్స్ కంటే కూడా ఎక్కువగా ఉండొచ్చని క్రికెట్ విశ్లేషకులు భావిస్తున్నారు. కొన్ని అంచనాల ప్రకారం ఆర్సీబీ ఫ్రాంచైజీ విలువ రూ.20 వేల కోట్లకు చేరే అవకాశం ఉందని సమాచారం. ఇప్పటికే మణిపాల్ హాస్పిటల్స్ అధినేత డాక్టర్ రంజన్ పాయ్ నేతృత్వంలోని కన్సార్టియం ఆర్సీబీ కోసం ఆసక్తి చూపుతున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఐపీఎల్ ప్రారంభానికి ముందు ఫ్రాంచైజీల విలువపై ఈ పరిణామాలు మరింత ఆసక్తిని పెంచుతున్నాయి.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
21.03.2026 శనివారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



### స్వీయ విశ్వాసం పెంపొందించడం



మీ సామర్థ్యాలపై నమ్మకం ఉంచండి. ఇది ఎలాంటి పరిస్థితి-నైనా ధైర్యంగా ఎదుర్కొనే శక్తిని ఇస్తుంది.

## మృణాల్ ట్రెడిషనల్ లుక్ కి ఫ్యాన్స్ ఫిదా



తాజాగా బాలీవుడ్ నటి మృణాల్ ఠాకూర్ సోషల్ మీడియాలో షేర్ చేసిన ఫోటోలు నెటిజన్లను ఆకట్టుకుంటున్నాయి. ఈసారి ఆమె ప్రత్యేకమైన ట్రెడిషనల్ స్టైల్‌లో కనిపిస్తూ అభిమానుల దృష్టిని తనవైపు తిప్పుకుంది. బేజ్ కలర్ డ్రేప్ స్కర్ట్‌తో పాటు స్టైలిష్ డిజైనర్ బ్లౌజ్ ధరించి, దానికి బ్లూ ఎంబ్రాయిడరీ జాకెట్‌ను జత చేయడంతో ఆమె లుక్ చాలా అందంగా కనిపిస్తోంది. పొడవైన జడతో పాటు ఫ్లోరల్ గార్లాండ్స్‌ను జత చేయడం ఈ లుక్‌కు మరింత ప్రత్యేకతను తీసుకొచ్చింది. ట్రెడిషనల్ స్టైల్‌లోనే మోడర్న్ టచ్ ఇవ్వడం ద్వారా మృణాల్ మరోసారి తన ఫ్యాషన్ సెన్స్‌ను చూపించింది. ఈ ఫోటోలను చూసిన అభిమానులు ఆమె స్టైల్, కాన్ఫిడెన్స్‌పై ప్రశంసలు కురిపిస్తున్నారు.
ఇదిలా ఉండగా, మృణాల్ తన కెరీర్‌లో ఒక ముఖ్యమైన మైలురాయిని కూడా జరుపుకుంటోంది. సినిమాల్లోకి అడుగుపెట్టి పదేళ్లు పూర్తయిన సందర్భంగా ఆమె సోషల్ మీడియాలో ఒక ఎమోషనల్ పోస్ట్ షేర్ చేసింది. తన తొలి హిందీ సినిమా 'లవ్ సోనియా'తో ప్రారంభమైన ప్రయాణం తనకు ఎంత ముఖ్యమో ఆమె గుర్తు చేసుకుంది. అభిమానులు కూడా ఆమెకు శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు.





## తారక్ – బన్నీ – ఆదిత్య ధర్ కాంబోపై ఇండస్ట్రీలో హాట్ టాక్

**ముద్ర, సినిమా డెస్క్:**

దర్శకుడు ఆదిత్య ధర్ పేరు ఇప్పుడు దేశవ్యాప్తంగా మార్మోగుతోంది. 'దురంధర్ 2' విడుదల తర్వాత ఆయనపై అంచనాలు మరింత పెరిగాయి. సినిమా ప్రీమియర్ చూసిన తర్వాత టాలీవుడ్ స్టార్ హీరోలు జూనియర్ ఎన్టీఆర్, అల్లు అర్జున్ ఇద్దరూ సోషల్ మీడియాలో స్పందించడం ఇండస్ట్రీలో పెద్ద చర్చగా మారింది.
గతంలోనే ఆదిత్య ధర్ టాలీవుడ్ హీరోలతో సినిమా చేయాలని ప్రయత్నించినట్లు వార్తలు వచ్చాయి. ముఖ్యంగా 'ఇమ్మోర్టల్ అశ్వత్థామ' అనే ప్రాజెక్ట్ కోసం అల్లు అర్జున్‌తో చర్చలు జరిపినట్టు అప్పట్లో టాక్ వినిపించింది. ఆ సినిమాలో జూనియర్ ఎన్టీఆర్ కూడా ఒక కీలక పాత్రలో కనిపించవచ్చని ప్రచారం జరిగింది. కానీ కొన్ని కారణాల వల్ల ఆ ప్రాజెక్ట్ ముందుకు సాగలేదు.
ఇప్పుడు 'దురంధర్ 2' తర్వాత పరిస్థితి మారిపోయినట్లు కనిపిస్తోంది. సినిమా చూసిన తర్వాత తారక్, బన్నీ ఇద్దరూ దర్శకుడి పనితనాన్ని మెచ్చుకోవడంతో ఈ ముగ్గురి కాంబినేషన్‌పై ఆసక్తి పెరిగింది. అన్నీ కుదిరితే ఈ కాంబోలో భారీ స్థాయి సినిమా రావచ్చని సినీ వర్గాలు భావిస్తున్నాయి

## పెద్ది రిలీజ్ వాయిదా రూమర్స్ పై క్లారిటీ



**ముద్ర, సినిమా డెస్క్:**

రామ్ చరణ్ నటిస్తున్న 'పెద్ది' సినిమా కోసం అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. మరో నలభై రోజుల్లో సినిమా విడుదల అవుతుందని ఆశపడుతున్న సమయంలో సోషల్ మీడియాలో ఒక్కసారిగా వాయిదా పుకార్లు చక్కర్లు కొడుతున్నాయి. ఏప్రిల్ 30 విడుదల తేదీ మారి మే లేదా జూన్‌కు వెళ్లొచ్చని ప్రచారం జోరుగా సాగుతోంది. ముఖ్యంగా మార్చి 27న రామ్ చరణ్ పుట్టినరోజు సందర్భంగా స్ట్రాంగ్ అప్‌డేట్ వస్తుందని అభిమానులు ఎదురు చూస్తున్నారు. అయితే సినీ వర్గాల సమాచారం ప్రకారం సినిమా విడుదల వాయిదా పడే అవకాశాలు లేవని తెలుస్తోంది. ఇంకా మిగిలిన షూటింగ్‌ను వేగంగా పూర్తి చేసే పనిలో చిత్ర బృందం ఉంది. స్పెషల్ సాంగ్ మాత్రమే పెండింగ్‌లో ఉందని, త్వరలోనే ఆ పాట షూటింగ్ కూడా పూర్తయ్యే అవకాశముందని టాక్ వినిపిస్తోంది. మరోవైపు పోస్ట్ ప్రొడక్షన్ పనులు కూడా వేగంగా కొనసాగుతున్నాయని తెలుస్తోంది. సంగీత దర్శకుడు ఏఆర్ రెహమాన్ ఇప్పటికే రీ రికార్డింగ్ పనులు ప్రారంభించినట్లు సమాచారం. ఫస్ట్ హాఫ్ పనులు పూర్తయ్యాయని, రంజాన్ తర్వాత మిగిలిన భాగంపై పని మొదలుపెడతారని చెబుతున్నారు. సినిమా ప్లానింగ్‌లో ఎలాంటి మార్పు లేదని, ఏప్రిల్ 30 విడుదల లక్ష్యంతోనే బృందం పనిచేస్తోందని సినీ వర్గాలు అంటున్నాయి. ఇక బిజినెస్ పరంగా కూడా 'పెద్ది'పై భారీ అంచనాలు ఉన్నాయి. ఓవర్సీస్ బుకింగ్స్ కూడా త్వరలో ప్రారంభం కానున్నాయని సమాచారం.

## ధురంధర్ 2 మొదటి రోజు వరల్డ్ వైడ్ వసూళ్లు..

'ధురంధర్ 2' చిత్రం కలెక్షన్లతో దూసుకుపోతుంది. ట్రేడ్ విశ్లేషకులు అందిస్తున్న లెక్కల ప్రకారం చూస్తే ఈ చిత్రానికి ప్రీమియర్స్ + మొదటి రోజు కలిపి ఇండియన్ బాక్స్ ఆఫీస్ వద్ద 148 కోట్ల రూపాయిల నెట్ వసూళ్లు వచ్చాయి. బాలీవుడ్ లో వీకెండ్ కి వచ్చే వసూళ్లు, కేవలం మొదటి రోజే రావడం గమనార్హం. కేవలం ప్రీమియర్ షోస్ నుండే ఈ చిత్రానికి 40 కోట్ల రూపాయిల నెట్ వసూళ్లు వచ్చాయి. 'ధురంధర్ 1' చిత్రం మొదటి రోజు కేవలం 28 కోట్ల రూపాయిల నెట్ వసూళ్లను మాత్రమే రాబట్టింది. దీనిని బట్టీ ఈ సీక్వెల్ ప్రభంజనం ఎలాంటిదో అర్థం చేసుకోవచ్చు. తెలుగు వెర్షన్ కి సంబంధించిన అడ్వాన్స్ బుకింగ్స్ కూడా చాలా గట్టిగా జరిగాయి. కానీ చివరి నిమిషం లో రద్దు అవ్వడం పెద్ద మైనస్ అయ్యింది. డొమెస్టిక్ కలెక్షన్స్ గురించి కాసేపు పక్కన పెడితే ఓవర్సీస్ లో కూడా ఈ సినిమా సునామీ తరహా వసూళ్లను రాబట్టింది. అక్కడి ట్రేడ్ విశ్లేషకులు అందిస్తున్న లెక్కల ప్రకారం ఈ చిత్రానికి ప్రీమియర్స్ + మొదటి రోజు కలిపి 5.5 మిలియన్ డాలర్ల గ్రాస్ వసూళ్లు వచ్చాయి. కేవలం ఒక్క నార్త్ అమెరికా నుండే 2.2 మిలియన్ డాలర్ల గ్రాస్ వసూళ్లను రాబట్టింది. మిడిల్ ఈస్ట్ లో ఈ చిత్రాన్ని బ్యాన్ చేసినప్పటికీ ఈ రేంజ్ ఓపెనింగ్ రావడం హిస్టారికల్ అనే చెప్పొచ్చు. ప్రస్తుతం ఈ చిత్రానికి ఉన్నటువంటి ఊపు చూస్తుంటే క్లోజింగ్ లో ఈ చిత్రం కహితంగా 3000 వేల కోట్ల రూపాయిల గ్రాస్ వసూళ్లను రాబడుతుందని అనుకుంటున్నారు. మొదటి వారం లోనే ఈ చిత్రం వెయ్యి కోట్లకు పైగా గ్రాస్ కొడుతుందని అంచనా . రేపు రంజాన్ కావడం తో ఈ చిత్రానికి ఇంకా భారీ వసూళ్లు వచ్చే అవకాశాలు ఉన్నాయి.





## బాలీవుడ్ నటి నిమిషా నాయర్‌కు చేదు అనుభవం

**ముద్ర, సినిమా డెస్క్:**

బాలీవుడ్ నటి నిమిషా నాయర్‌కు ముంబైలో ఓ భయానక ఘటన ఎదురైంది. బాంద్రా ప్రాంతంలో క్యాబ్‌లో ప్రయాణిస్తున్న సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు ఆమెను ఇబ్బందిపెట్టినట్లు ఆమె సోషల్ మీడియాలో వీడియోతో పాటు వివరించింది. ఉదయం 4.50 గంటల సమయంలో ఈ ఘటన జరిగినట్లు తెలిపింది. క్యాబ్ డ్రైవర్ ఓ బైక్‌ను ఓవర్‌టేక్ చేయడంతో ఆ బైక్‌పై ఉన్నవారు ఆగ్రహానికి గురై తమ కారును వెంటాడినట్లు ఆమె చెప్పింది. బైక్‌పై ఉన్న వారు మద్యం సేవించినట్లుగా ప్రవర్తించారని నిమిషా నాయర్ వెల్లడించింది. హైవే మధ్యలో కారును అడ్డగించి ముందుకు వెళ్లనీయకుండా చేశారు. డ్రైవర్‌పై దాడి చేయాలనే ఉద్దేశంతో కార్ డోర్లు తెరవడానికి కూడా ప్రయత్నించినట్లు ఆమె పేర్కొంది. విండోస్ కిందకు దించమని పదే పదే ఒత్తిడి చేసినప్పటికీ తమ భద్రత కోసం అలా చేయలేదని చెప్పింది. తాను వీడియో తీస్తున్నానని గుర్తించిన తర్వాతే వారు అక్కడి నుంచి వెళ్లిపోయారని నిమిషా నాయర్ తెలిపింది. కారు ఫోటోలు తీసుకుని వెళ్లిపోయారని, ఈ ఘటనపై పోలీసులు చర్యలు తీసుకోవాలని కోరినట్లు పేర్కొంది. ఈ వీడియోను చూసిన నెటిజన్లు ఆమె సురక్షితంగా ఉండడం ఆనందంగా ఉందని, ఇలాంటి ఘటనలు చాలా బాధాకరమని కామెంట్లు చేస్తున్నారు. నిమిషా నాయర్ ఇప్పటికే 'అమర్ కాలనీ', '8 ఏఎమ్ మెట్రో' వంటి సినిమాల్లో నటించింది. 'ట్రయల్ బై ఫైర్' వెబ్ సిరీస్‌లో కూడా నటించి గుర్తింపు సంపాదించింది. ఈ ఘటన తర్వాత ఆమెకు మద్దతుగా పలువురు సోషల్ మీడియాలో స్పందిస్తున్నారు.

## ఆఫ్-షోల్డర్ లుక్‌లో హార్ట్‌బీట్ పెంచుతున్న నైరా



సోషల్ మీడియాలో తాజాగా ఒక స్టైలిష్ ఫోటో షూట్ వైరల్ అవుతోంది. ఆఫ్‌షోల్డర్ స్టైల్‌లో కనిపించిన బాలీవుడ్ నటి నైరా బెనర్జీ తన అందం, స్టైల్‌తో నెటిజన్లను ఆకట్టుకుంటోంది. సింపుల్‌గా కనిపించే వైట్ డ్రెస్‌లో కూడా ఆమె ఎంతో ఎలిగెంట్‌గా మెరిసిపోతోంది.
భుజాలపై నుంచి సాఫ్ట్‌గా జారుతున్న డ్రెస్ డిజైన్ ఆమె లుక్‌కు ప్రత్యేకమైన గ్లామర్‌ను తీసుకొచ్చింది. స్టైలిష్ బెల్ట్‌తో చేసిన స్టైలింగ్ ఈ అవుట్‌ఫిట్‌కు మరింత క్లాస్ టచ్ ఇచ్చింది. ఫోటోలో ఆమె ఇచ్చిన పోజ్‌లు కూడా చాలా ఆకర్షణీయంగా కనిపిస్తున్నాయి. లైట్ మేకప్‌తో నేచురల్ బ్యూటీని హైలైట్ చేస్తూ ఈ ఫోటో షూట్ సోషల్ మీడియాలో మంచి స్పందన పొందుతోంది. సింపుల్ లుక్‌లో కూడా గ్లామర్ ఎలా చూపించాలో నైరా మరోసారి ప్రూవ్ చేసింది. అభిమానులు ఈ ఫోటోలను చూసి లైక్స్, కామెంట్స్‌తో ముంచెత్తుతున్నారు.




## జబర్దస్త్ కమెడియన్ అదిరే అభి నుంచి థ్రిల్లింగ్ మూవీ

**ముద్ర, సినిమా డెస్క్:**

జబర్దస్త్ ద్వారా గుర్తింపు పొందిన కమెడియన్ అదిరే అభి ఇప్పుడు దర్శకుడిగా కొత్త ప్రయోగంతో ముందుకు వస్తున్నారు. ఆయన దర్శకత్వంలో రూపొందుతున్న సినిమా 'కామాఖ్య'. వాస్తవ సంఘటనల ఆధారంగా తెరకెక్కుతున్న ఈ చిత్రంపై ఇప్పటికే సినీ అభిమానుల్లో ఆసక్తి పెరుగుతోంది. సముద్రఖని, సమైరా, అభిరామి ప్రధాన పాత్రల్లో నటిస్తుండగా, సినిమా కథ ప్రత్యేకంగా ఉండబోతుందనే ప్రచారం వినిపిస్తోంది. ప్రస్తుతం ప్రమోషన్స్‌ను వేగవంతం చేసిన చిత్ర బృందం శుక్రవారం ఈ సినిమా ట్రైలర్‌ను విడుదల చేసింది. ట్రైలర్‌లో సీరియస్ కథాంశంతో పాటు థ్రిల్లింగ్ సన్నివేశాలు ఎక్కువగా కనిపించడంతో ప్రేక్షకుల్లో సినిమాపై అంచనాలు మరింత పెరిగాయి. ముఖ్యంగా సముద్రఖని పాత్రకు సంబంధించిన సీన్స్ ట్రైలర్‌కు ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. వాస్తవ ఘటనల ఆధారంగా తెరకెక్కుతున్న ఈ సినిమా కథ ఏమిటి? ప్రేక్షకులను ఎంతవరకు ఆకట్టుకుంటుంది? అన్న ఆసక్తి ఇప్పుడు అందరిలో కనిపిస్తోంది.

## 11 ఏళ్ల తర్వాత మళ్లీ తెరపైకి అబ్బాస్

**ముద్ర, సినిమా డెస్క్:**

'ప్రేమదేశం' సినిమాతో ఒకప్పుడు సెన్సేషన్‌గా నిలిచిన అబ్బాస్ చాలా కాలం తర్వాత మళ్లీ ప్రేక్షకుల ముందుకు రానున్నారు. 2015 తర్వాత నటనకు దూరంగా ఉన్న ఆయన, ఇప్పుడు 'హ్యాపీ రాజ్' అనే తమిళ సినిమాలో కీలక పాత్రలో నటించారు. ఈ సినిమా తెలుగులో కూడా ఈ నెల 27న విడుదల కానుంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో జరిగిన ట్రైలర్ విడుదల కార్యక్రమంలో దర్శకుడు మరియా రాజా సినిమా గురించి ఆసక్తికర విషయాలు వెల్లడించారు.
కథ పూర్తయిన తర్వాత మొదటగా దర్శకుడు హీరోగా నవీన్ పొలిశెట్టిని సంప్రదించినట్లు తెలిపారు. స్క్రిప్ట్ నచ్చినా అప్పటికే ఇతర సినిమాల పనుల్లో బిజీగా ఉండటంతో ఆయన చేయలేకపోయారని చెప్పారు. ఆ తర్వాత కథను జీవీ ప్రకాశ్ కుమార్‌కు చెప్పగా, వెంటనే అంగీకరించినట్లు పేర్కొన్నారు.
అబ్బాస్ రీ ఎంట్రీ గురించి కూడా దర్శకుడు వివరించారు. మంచి కథ కోసం చాలా కాలంగా ఎదురు చూస్తున్న అబ్బాస్‌కు ఆన్‌లైన్ ద్వారా కథ చెప్పగా వెంటనే ఒప్పుకున్నారని తెలిపారు. న్యూజిలాండ్‌లో ఉన్న ఆయనకు ఈ కథ చాలా నచ్చడంతోనే ఈ సినిమాతో మళ్లీ నటనలోకి రావాలని నిర్ణయించుకున్నారని చెప్పారు. ట్రైలర్ విడుదల కార్యక్రమానికి వెంకీ అట్లూరి, శివ నిర్వాణ వంటి దర్శకులు కూడా హాజరై చిత్ర బృందానికి శుభాకాంక్షలు తెలిపారు.

Printed and published by Executive Director Aliminati Indra Reddy, on behalf of M/s Networth Media Private Limited. Printed at Colour Dot Graphics, Ali cafe X Road, Amberpet, Hyderabad500013.Published at H. No. 63569/2, unit 4A Fourth Floor, Kamadhenu, Rockdale compound, Somajiguda, Hyderabad500082. Editor: Y. Narender Reddy. RNI No: TELTEL/2013/50413. email: mudradaily@gmail.com